www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 23-5-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 54 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా.10.30 తదుపరి ద్వాదశి; నక్షత్రం: ఉత్తరాభాద్ర సా.4.02 తదుపరి రేవతి; వర్జ్యం: రా.2.55-4.22; దుర్ముహూర్తం: ఉ.8.19-9.11, మ.12.37-1.29; అమృతఘడియలు: ఉ.11.35-1.04; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.39 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

అమెరికాలో ఇజ్రాయెలీల కాల్చివేత

2

యూదు మ్యూజియం వద్ద ఘటన

మృతులిద్దరూ కాబోయే దంపతులు..

దుండగుడిని అరెస్టు చేసిన పోలీసులు

పాలస్తీనా విమోచన కోసం నినాదాలు

భారత్ సహా ప్రపంచ దేశాల ఖండన

బీజేపీపై

రెండే నిమిషాలా?

రజతోత్సవ సభలో ఆ పార్టీని ఇంకా టార్గెట్ చేసి ఉండాల్సింది డాడీ

"ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయకుండా బీజేపీకి సాయం చేశామనే సందేశాన్ని కాంగ్రెస్ ప్రజల్లోకి తీసుకెళ్లింది. ఇలాంటి రాజకీయ పరిస్థితిని ఎదుర్కోవడానికి మీరు నిర్దిష్ట కార్యాచరణ ఇస్తారని అందరూ ఆశించారు. ఇప్పటికైనా 1-2 రోజులు పార్టీ ప్లీనరీ నిర్వహించి వీలైనంత ఎక్కువ మంది అభిప్రాయాలు వినండి. ఈ విషయాన్ని కొంచెం సీరియస్‌గా తీసుకోండి."

- లేఖలో కవిత

అలా చేయకపోవడం వల్ల భవిష్యత్తులో వారితో పొత్తు పెట్టుకుంటారనే ఊహాగానాలు

బీజేపీ మనకు ప్రత్యామ్నాయం అవుతుందేమో అని మన పార్టీ కార్యకర్తలే అనుకుంటున్నారు

ధూం ధాం విఫలమైంది.. 2001 నుంచి మీతో ఉన్న వారితో సభలో మాట్లాడించాల్సింది

కొందర్నే మీరు కలుస్తున్నారు.. అందర్నీ కలవండి

ఇప్పటికైనా 1-2 రోజులు ప్లీనరీ నిర్వహించండి

బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌కు కవిత 7 పేజీల లేఖాస్త్రం

తొలి మూడు పేజీల్లో సానుకూల అంశాల ప్రస్తావన

మిగతా నాలుగు పేజీల్లో ప్రతికూల అంశాల వెల్లడి



హైదరాబాద్, మే 22, (ఆంధ్రజ్యోతి): కిందటి నెలలో వరంగల్‌లో నిర్వహించిన పార్టీ రజతోత్సవ సభలో బీజేపీని లక్ష్యంగా చేసుకుని ఇంకా గట్టిగా మాట్లాడాల్సి ఉందంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు ఆయన కుమార్తె, ఎమ్మెల్సీ కవిత స్వదస్తూరీతో లేఖ రాశారు. కేసీఆర్ అలా చేయకపోవడం వల్ల.. బీఆర్ఎస్ భవిష్యత్తులో బీజేపీతో పొత్తు పెట్టుకుంటుందనే ఊహాగానాలు మొదలయ్యాయని అందులో పేర్కొన్నారు. బీజేపీపై కేసీఆర్ ఇంకా బలంగా మాట్లాడాలని తనకు కూడా ఉందని తెలిపారు. మే 2వ తేదీన ఆమె రాసిన ఏడు పేజీల లేఖ.. గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. "డాడీ.. సభ విజయవంతం అయినందుకు ముందుగా మీకు శుభాకాంక్షలు. ఈ సందర్భంగా నా దృష్టికి వచ్చిన కొన్ని సానుకూల, ప్రతికూల స్పందనలను మీతో పంచుకోవాలనుకుంటున్నాను." అంటూ తొలి మూడు పేజీల్లో సానుకూల అంశాలను ప్రస్తావించిన ఆమె.. తర్వాతి నాలుగు

మిగతా 12వ పేజీలో...



లోగుట్టు ఏంటి?

12

లేఖ బహిర్గతమవడంలో ఆంతర్యమేంటి?

రజతోత్సవ సభతోనే అంతర్గత వైరుధ్యాలు

పార్టీలో సమస్థాయి కోసం కవిత కోరుతున్నట్లు వార్తలు

ప్రత్యామ్నాయాలపై కూడా ఆలోచిస్తున్నట్టు ప్రచారం

ఆ పరిస్థితే వస్తే అటా? ఇటా?

అంటూ కొందరు నేతలను ఆమె అడిగినట్లు చర్చ



ప్రభుత్వ కార్పొరేషన్‌ను లక్ష్యంగా చేసుకునే క్రమంలో సమాఖ్య భావనను ఈడీ దెబ్బతీసింది. ఈడీ చర్యలు చట్ట విరుద్ధం. రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకం. - సుప్రీం

అన్ని హద్దులూ దాటేశారు

తక్షణమే దర్యాప్తును నిలిపివేయండి

కొంతమంది చేసిన ఉల్లంఘనకు సంస్థపై చర్యలెలా తీసుకుంటారు

తమిళనాడు మద్యం వివాదంలో ఈడీపై సుప్రీంకోర్టు ఆగ్రహం

కక్ష సాధింపునకే ఈడీ ప్రయోగం

ఎన్నికల దృష్టితో వ్యవహరిస్తున్న కేంద్రం

పిటిషన్‌లో తమిళనాడు ఆరోపణ

చెన్నై, మే 22 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ సమాఖ్య స్వరూపాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఉల్లంఘిస్తోందని సుప్రీంకోర్టు ఆక్షేపించింది. తమిళనాడు ప్రభుత్వ మద్యం క్రయవిక్రయాల సంస్థలో (తమిళనాడు రాష్ట్ర మార్కెటింగ్ కార్పొరేషన్-టాస్మాక్) అక్రమాల వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్న ఈడీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'టాస్మాక్' కేసు వ్యవహారంలో ఈడీ అన్ని హద్దులూ దాటేసిందని దుయ్యబట్టింది. కొంతమంది వ్యక్తులు చేసిన ఉల్లంఘనలకు ఒక సంస్థపై ఎలా చర్యలు తీసుకుంటారని నిలదీసింది. టాస్మాక్‌పై ఈడీ చేపట్టిన మనీలాండరింగ్ దర్యాప్తును నిలిపివేసింది. ఈ వివాదంలో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్

మిగతా 2వ పేజీలో...



కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో జ్యోతి వెలిగిస్తున్న బండి సంజయ్, పొన్నం

అమృత్ ఆవిష్కరణ

బేగంపేట, కరీంనగర్, వరంగల్ రైల్వే స్టేషన్లను బికనీర్ నుంచి ప్రారంభించిన ప్రధాని మోదీ

హైదరాబాద్‌లో ఎంఎంటీఎస్-2 పనులు షురూ

త్వరలో యాదగిరిగుట్ట మార్గంలోనూ మొదలు

దసరాకు కొమురవెల్లి స్టేషన్ సిద్ధం: కిషన్‌రెడ్డి

జమ్మికుంటనూ అమృత్‌లో చేరుస్తాం: సంజయ్

రాష్ట్రంలో 3 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేయడం హర్షణీయం: మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్/బేగంపేట/కరీంనగర్/గిర్మాజిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దిన 103 రైల్వే స్టేషన్లను ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. రాజస్థాన్‌లోని బికనేర్ నుంచి ఆయన ఉత్తర, దక్షిణాది రాష్ట్రాల్లో ఉన్న స్టేషన్లను వర్చువల్‌గా ఆవిష్కరించారు. ఇందులో తెలంగాణలోని

మిగతా 3వ పేజీలో...

పాక్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం



2

ఇక ప్రతి ఉగ్ర దాడికీ మూల్యం చెల్లించక తప్పదు

నా ఒంట్లో ప్రవహించేది రక్తం కాదు.. సిందూరం

సిందూరం గన్‌పౌడర్‌గా మారితే ఏమవుతుందో మన శత్రువులు ప్రత్యక్షంగా చూశారు

రహీంఖాన్ ఎయిర్‌బేస్ ఇంకా ఐసీయూలోనే..

రాజస్థాన్ బికనేర్‌లో ప్రధాని నరేంద్ర మోదీ ఎద్దేవా

'ఆపరేషన్ సిందూర్' తర్వాత తొలి బహిరంగ సభ



మేడిగడ్డ వద్ద కాంగ్రెస్ వాళ్లే

బాంబులు పెట్టారేమో?

బ్యారేజీ పగుళ్లకు వాళ్లే కారణం కావొచ్చు

కమీషన్ల కోసం కాళేశ్వరాన్ని కూల్చాలన్నదే రేవంత్‌రెడ్డి ఎజెండా

టైమ్‌పాస్ కోసమే కేసీఆర్, హరీశ్‌కు నోటీస్‌లు

మాపై లొట్టపీసు కేసులతో సీఎం చేసేదేం లేదు

కాళేశ్వరంపై బీజేపీ, కాంగ్రెస్ దుష్ప్రచారం

రేవంత్‌రెడ్డిలో అపరిచితుడున్నారు..

ప్రభుత్వం వద్ద రూపాయి కూడా లేదంటారు..

అందాల పోటీల కోసం 200 కోట్లు: కేటీఆర్

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజీ పగుళ్లకు కాంగ్రెస్ వాళ్లే కారణం కావొచ్చని, వాళ్లే బాంబులు పెట్టారన్న అనుమానం కలుగుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యానించారు. బ్యారేజీలో కేవలం రెండు చోట్ల పగుళ్లు వస్తే.. ఏదో అయిపోయినట్టు చేస్తున్నారని ఆరోపించారు. గురువారం తెలంగాణభవన్‌లో మీడియాతో జరిపిన ఇష్టాగోష్ఠిలో కేటీఆర్ పలు అంశాలను ప్రస్తావించారు. "కాసుల కక్కుర్తితో కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీలు కూల్చాలని.. మళ్లీ టెండర్లు పిలిచి 20శాతం నుంచి 30శాతం

మిగతా 12వ పేజీలో...

ఇప్పుడేం చేద్దాం..!!

కేసీఆర్‌తో మరోసారి హరీశ్‌రావు భేటీ

కాళేశ్వరం కమిషన్ నోటీసులపై సమాలోచన

ఫామ్‌హౌస్‌లో 3 గంటల పాటు సమావేశం



హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నేతలు

జంగు నవీన్, సజ్జా నాగేశ్వర్‌రావు

ఎన్‌కౌంటర్‌లో మృతి

మొత్తం 27 మంది వివరాలు ప్రకటించిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు

10

నంబాల కేశవరావు బృందం మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని వెల్లడి

సుకుమాలో పేలిన ఐఈడీ.. జవాన్ మృతి

కగార్ ఆపేయాలంటూ రాజధానిలో ధర్నా

పోలీసులు తెలిపినవి

అవాస్తవాలు

ఎన్నికల ప్రచారంలో నేను ఎక్కడా ఏ తప్పూ చేయలేదు

గత ప్రభుత్వ ఒత్తిడితో నాపై తప్పుడు కేసులు పెట్టారు

కోడ్ ఉల్లంఘన కేసుల్లో సీఎం రేవంత్ వాంగ్మూలం

నాంపల్లి కోర్టుకు హాజరు.. వచ్చే నెల 12న తుది తీర్పు



హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా తాను ఎక్కడా ఎలాంటి తప్పూ చేయలేదని.. కోడ్ ఉల్లంఘన కేసుల విషయంలో పోలీసులు తెలిపిన వివరాలు అవాస్తవాలని సీఎం రేవంత్ రెడ్డి నాంపల్లి కోర్టుకు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా.. ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారనే అభియోగాలతో.. అప్పటి టీపీసీసీ అధ్యక్షుడైన రేవంత్‌పై బేగంబజార్, నల్లగొండ టూటౌన్, మెదక్ పోలీసు స్టేషన్లలో కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. గురువారం ఈ కేసులపై తన వాంగ్మూలాన్ని ఇచ్చేందుకు రేవంత్ నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానానికి వచ్చారు. ఈ కేసు విచారణలో

మిగతా 13వ పేజీలో...



సద్గురు ధ్యానంతో..

2

చురుకైన మెదడు

మస్తిష్క వృద్ధాప్యానికి మెడిటేషన్‌తో చెక్

సంయమ సాధనతో 5.9 ఏళ్లు వెనక్కి

సద్గురు అభివృద్ధి చేసిన టెక్నిక్ సత్ఫలితాలు

హార్వర్డ్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

ప్రకటిత నేరస్థుడిగా ఎస్ఐబీ మాజీ చీఫ్!

జూన్ 20లోగా విచారణకు రావాలి

రాకుంటే ప్రొక్లెయిమ్డ్ అఫెండర్‌గా ప్రకటిస్తాం

ఫోన్ ట్యాపింగ్ కేసులో నాంపల్లి కోర్టు

ప్రభాకర్‌రావు ఇంటి గోడకు నోటీసులు అంటించిన సిట్ అధికారులు

13



జూరాల ప్రాజెక్టులో

వరద నీటి వృథా

పూర్తి కాని రూఫ్ వేతాదు మరమ్మతులు

పలు గేట్ల వద్ద దిగువకు పోతున్న నీళ్లు

12

చైనా చౌక బేరం!


తన జే-35ఏ ఫైటర్లపై పాక్‌కు 50% రాయితీ!

మొత్తం 30 విమానాల కొనుగోలుకు ఒప్పందం

ఈ ఏడాది ఆగస్టులోనే అందనున్న తొలి బ్యాచ్

భారత్‌పై దాడులకు 'బహుమతి' అంటూ ఆఫర్?

కానీ ఆయుధాల అమ్మకాలు పెంచుకునే ఎత్తుగడ అని అంటున్న రక్షణ రంగ నిపుణులు



న్యూఢిల్లీ, మే 22: ఆపరేషన్ సిందూర్ పరిణామాల నేపథ్యంలో చైనా, పాకిస్థాన్ మధ్య కీలక పరిణామం చోటు చేసుకుంది. చైనా తమ 'జే-35ఏ' ఐదోతరం యుద్ధ విమానాలను సగం ధరకే పాకిస్థాన్‌కు ఇస్తామని ఆఫర్ చేసింది. అమెరికాకు చెందిన ఎఫ్-35, రష్యాకు చెందిన సుఖోయ్-57లతో పోటీపడగలదని చైనా చెబుతున్న ఈ ఫైటర్ జెట్ల కొనుగోలు కోసం పాక్-చైనా మధ్య ఇప్పటికే ఒప్పందం కుదిరింది. మొత్తం 30 విమానాలకు ఆర్డర్ చేయగా.. అందులో తొలి బ్యాచ్ ఈ ఏడాది ఆగస్టులోనే పాక్‌కు అందనున్నాయి. దీనికి సంబంధించి చెల్లింపులు, ఇతర అంశాలపై

మిగతా 2వ పేజీలో...



హైదరాబాద్‌లోని శిల్పారామంలో జరిగిన టాలెంట్ ఫినాలేలో సుందరీమణుల ఆటాపాటా

ఇదే ఇలాకాలో బ్యూటీల తడాఖా

శిల్పారామంలో ప్రపంచ సుందరి పోటీదారుల ఆటాపాటా

టాలెంట్ ఫినాలేలో 24 మంది ఫైనలిస్టుల పోటాపోటీ

'ఢోల్ బాజే..' పాటకు ఆకట్టుకున్న నందినీ గుప్తా నృత్యం

'రాను.. బొంబైకి రాను' పాటకు నైజీరియా భామ స్టెప్పులు

14 టాలెంట్ ఫినాలే విజేతగా ఇండోనేషియా



శిల్పారామంలో పెయింటింగ్ వేస్తూ..



13

హైదరాబాద్‌కు 2 వేల ఈవీ బస్సులు

పీఎం ఈ-డ్రైవ్ కింద ఇవ్వనున్న కేంద్రం

వచ్చే మార్చికి ఐదు నగరాలకు బస్సులు

కేంద్ర మంత్రి కుమారస్వామి వెల్లడి

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ వరకు

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు!

3

రేడియల్ రోడ్డు ముగిసే ఆమనగల్ నుంచి మన్ననూరు దాకా

నాలుగు వరుసలతో రహదారి నిర్మాణం

సీఎం సూచనలతో 3 ప్రతిపాదనలను సిద్ధం చేసిన ఎన్‌హెచ్ఏఐ

సౌదీ తటస్థ వేదికగా చర్చలు

» పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆశాభావం

ఇస్లామాబాద్, మే 22: కశ్మీర్, సింధూ జలాలు, వాణిజ్యం, ఉగ్రవాదం వంటి కీలక అంశాలపై సౌదీ అరేబియా తటస్థ వేదికగా భారత్, పాక్ మధ్య చర్చలు జరగొచ్చని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ఆశాభావం వ్యక్తం చేశారు. సౌదీ ఇరు దేశాలకు ఆమోదయోగ్యమైన తటస్థ వేదికగా ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కరాచీకి చెందిన డాన్ పత్రిక కథనం ప్రచురించింది. అయితే చైనాలో చర్చలు జరిగే అవకాశాన్ని ఆయన తోసిపుచ్చారు. దీనికి భారత్ ఎప్పటికీ అంగీకరించబోదని చెప్పారు. భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించే దిశగా చర్చలకు మధ్యవర్తిత్వం వహించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు సౌదీ ప్రకటించింది. కాగా, ఉగ్రవాదం, పీవోకేను అప్పగించడంపై మాత్రమే పాక్‌తో చర్చలు జరుపుతామని, ఇందులో మూడో పక్షం జోక్యానికి తావులేదని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది.

ఇండిగో పైలట్ అభ్యర్థనను తిరస్కరించిన పాక్


వడగండ్లతో ఇండిగో విమానానికి పడిన రంధ్రం

న్యూఢిల్లీ, మే 22: ఢిల్లీ నుంచి శ్రీనగర్‌కు వెళ్తున్న ఇండిగో విమానం బుధవారం ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా శ్రీనగర్‌లో ఎమర్జెన్సీగా ల్యాండయిన ఘటనపై డీజీసీఏ విచారణ ప్రారంభించింది. అమృత్‌సర్ మీదుగా ప్రయాణిస్తున్న సమయంలో విమానం తీవ్రమైన తుఫానును ఎదుర్కొంది. దానిని నివారించేందుకు విమానాన్ని పాక్ గగనతలంలోకి మళ్లించేందుకు పైలట్ లాహోర్ ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ)ని అనుమతి కోరాడు. అయితే పాక్ ఏటీసీ ఆ అభ్యర్థనను తిరస్కరించినట్లు సమాచారం. ఆ విమానంలో తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన ఎంపీలు సహా మొత్తం 220 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. గాల్లో తుఫాను కారణంగా పైలట్ అత్యవసర పరిస్థితిని ప్రకటించి, శ్రీనగర్ ఏటీసీకి సమాచారం ఇచ్చారు. దీంతో విమానం శ్రీనగర్‌లో ల్యాండ్ అయింది.

జ్యోతి పర్యటనలకు యూఏఈ సంస్థ స్పాన్సర్‌షిప్

న్యూఢిల్లీ, మే 22: గూఢచర్యం ఆరోపణలపై పోలీసులు అదుపులోకి తీసుకున్న హరియాణా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాకు యూఏఈకి చెందిన ట్రావెల్ ఏజెన్సీ వెగో స్పాన్సర్ చేసిందని నిఘా వర్గాలు తెలిపాయి. అమె ట్రావెల్ వ్లాగ్‌ల కోసం పలు సంస్థల నుంచి స్పాన్సర్‌షిప్‌లు అందుకుంటున్నారు. జ్యోతి చేసిన చాలా వీడియోలకు వీగో స్పాన్సర్ చేసిందని అధికారులు గుర్తించారు. ఇంటర్నేషనల్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ అసోసియేషన్ (ఐఏటీఏ) గుర్తింపు ఉన్న ఈ సంస్థకు సింగపూర్, దుబాయ్‌ల్లో కూడా కార్యాలయాలు ఉన్నాయి. పాక్‌లో కార్యకలాపాలు సాగించడానికి అవసరమైన ట్రావెల్ ఏజెన్సీ లైసెన్స్ దీనికి ఉంది. పాక్‌కు వెగో నిధులు సమకూరుస్తోందనడానికి సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోయినప్పటికీ, ఆ దేశంలో కార్యకలాపాలు సాగించడంతో పాటు జ్యోతి ప్రయాణ ఖర్చులకు స్పాన్సర్‌గా ఉండటంపై దర్యాప్తు బృందాలు దృష్టి సారించాయి.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. నలుగురు టెర్రరిస్టుల హతం

జమ్మూ, మే 22: జమ్మూకశ్మీర్‌లోని కిష్త్వార్ జిల్లాలో గురువారం భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. సింగ్‌పొరా ప్రాంతంలో ఉగ్రవాదుల కదలికలపై అందిన పక్కా సమాచారంతో భద్రతా బలగాలు పోలీసులతో కలిసి సంయుక్త కార్డన్, సెర్చ్ ఆపరేషన్‌ను నిర్వహించాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు ఉగ్రవాదులను భద్రతా దళాలు మట్టుబెట్టగా, ఒక జవాను ప్రాణాలు కోల్పోయాడని ఆర్మీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' నిర్వహిస్తున్నప్పుడు జమ్మూకశ్మీరులోని సాంబ జిల్లా పరిధిలో సుమారు 45-50 మంది ఉగ్రవాదులు.. భారీగా చొరబడేందుకు ప్రయత్నించారని బీఎస్ఎఫ్ డీఐజీ ఎస్ఎస్ మాండ్ గురువారం వెల్లడించారు. భారత బలగాలు గుళ్ల వర్షం కురిపించడంతో వారు పాక్‌లోకే పారిపోయారని చెప్పారు.

ఆపరేషన్ సిందూర్‌లో 3 వేల మంది అగ్నివీరులు

న్యూఢిల్లీ, మే 22: ఆపరేషన్ సిందూర్‌లో మన సైన్యంలోని అగ్నివీరులూ కీలకపాత్ర పోషించారు. భారత్ దాడులకు ప్రతిదాడుల కోసం దాయాది పాక్ ప్రణాళికలను చిత్తు చేయడంలో 3వేల మందికిపైగా అగ్నివీరులు గట్టి పోరాట పటిమ కనబర్చారు. కీలకమైన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల వద్ద సైనికులతో పాటు విధుల్లో పాల్గొన్నారు. తద్వారా పాక్ క్షిపణులు, డ్రోన్ దాడుల నుంచి మనదేశ సైనిక స్థావరాలను పరిరక్షించారు. అంతా 20 ఏళ్ల వయసువారైన ఈ అగ్నివీరులు గత రెండేళ్లలో అగ్నిపథ్ పథకం కింద సైన్యంలోకి వచ్చారు. ఆపరేషన్ సిందూర్ సక్సెస్‌లో అగ్నివీరుల సహకారం ప్రశంసనీయమైనదని సైనిక వర్గాలు పేర్కొన్నాయి.

ప్రిన్సిపాల్ గదిలో 12 ఏళ్ల బాలికపై గ్యాంగ్ రేప్!

» యూపీలో ఘటన.. ఐదుగురు బాలుర అరెస్టు

బరెయిలీ, మే 22: పన్నెండేళ్ల దళిత బాలికపై ఐదుగురు బాలురు తాము చదువుకుంటున్న పాఠశాలలోని ప్రిన్సిపల్ గదిలో సామూహిక అత్యాచారానికి ఒడిగట్టారు. ఆ ఘోరాన్నంతా సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. యూపీలోని మొరాదాబాద్‌లో ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఐదుగురు నిందితులు 12-15 ఏళ్లలోపు వారే. బాలికతో పాటు అదే స్కూల్లో ఏడో క్లాసు నుంచి తొమ్మిదో క్లాసు చదువుతున్నారు. నిందితులంతా కూడా బాలిక ఇంటి సమీపంలోనివారే.. ఆమె సామాజిక వర్గానికి చెందిన పిల్లలే! మే 8న బాలిక, తన ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ఆమెతో మాటలు కలిపిన ఐదుగురు బాలురు.. కొద్దిసేపటికి ఆమెను అక్కడి నుంచి ఎత్తుకెళ్లారు. వారిలో ఒకరి తండ్రి స్కూల్లో వాచ్‌మన్ కావడంతో బడి తాళం చెవులు తెచ్చాడు. బడి గేటు తాళం తీసి.. ఆమెను నేరుగా ప్రిన్సిపల్ గదిలోకి తీసుకెళ్లారు. అక్కడ మత్తు మందు కలిపిన కూల్ డ్రింక్‌ను బాలికతో తాగించారు. ఆమె మత్తులోకి జారుకోగానే ఒకరి తర్వాత మరొకరు అత్యాచారానికి ఒడిగట్టారు. కొన్నిరోజులకు ఆ వీడియోను ఆ బాలురే నెట్‌లో పెట్టారు. ఈ నెల 19న బాలిక పొరుగింటి మహిళ ఆ వీడియోను చూసి.. దారుణం గురించి బాధితురాలి తల్లికి చెప్పింది. బాలిక తల్లి అదే రోజు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకొని జువైనల్ జస్టిస్ బోర్డు ఎదుట ప్రవేశపెట్టారు.

హార్వర్డ్‌లో విదేశీ విద్యార్థుల అడ్మిషన్లపై నిషేధం

వాషింగ్టన్ డీసీ, మే 22: ప్రసిద్ధ హార్వర్డ్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థుల అడ్మిషన్లపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిషేధం విధించారు. ఈ మేరకు యూనివర్సిటీ అధికారులకు హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టీ నోయెమ్ లేఖ పంపారు. యూనివర్సిటీపై జరుగుతున్న దర్యాప్తులో భాగంగానే తాము ఈ చర్య తీసుకున్నట్లు ఆమె తెలిపారు. చైనా కమ్యూనిస్టు పార్టీతో సమన్వయం చేసుకుంటూ.. క్యాంపస్‌లో హింసను, యూదు వ్యతిరేకతను యూనివర్సిటీ పెంచి పోషిస్తున్నదని ఆ లేఖలో పేర్కొన్నట్లు న్యూయార్క్ టైమ్స్ గురువారం ఓ వార్తాకథనం ప్రచురించింది. అయితే, విదేశీ విద్యార్థులను చేర్చుకోవాలని భావిస్తే, 72 గంటల్లో తాము అడిగిన సమాచారం అందజేయాల్సి ఉంటుందని క్రిస్టీ నోయెమ్ తెలిపారు.

హైపర్‌సానిక్ అణు క్షిపణి మినిట్ మ్యాన్ 3ని పరీక్షించిన అమెరికా

వాషింగ్టన్, మే 22: ప్రపంచంలో ఎక్కడైనా అణుదాడి చేసే సామర్థ్యం ఉన్న హైపర్‌సానిక్ ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి 'మినిట్‌మ్యాన్ 3'ని.. అమెరికా వాయుసేన బుధవారం పరీక్షించింది. ఎలాంటి ఆయుధాలూ లేకుండా ప్రయోగించిన ఈ క్షిపణి గంటకు 15 వేల మైళ్ల వేగంతో ప్రయాణించి.. 4200 మైళ్ల దూరాన పసిఫిక్ మహాసముద్రంలో ఉన్న మార్షల్ దీవుల్లో.. అమెరికా ఆర్మీ స్పేస్ అండ్ మిసైల్ డిఫెన్స్ కమాండ్‌కు చెందిన రోనాల్డ్ రీగన్ బాలిస్టిక్ మిసైల్ డిఫెన్స్ టెస్ట్ సైట్‌కు చేరింది. క్యాలిఫోర్నియాలోని వాండెన్‌బెర్గ్ స్పేస్ ఫోర్స్ బేస్ నుంచి ఈ క్షిపణిని విజయవంతంగా పరీక్షించినట్టు అమెరికా వాయుసేన ఒక ప్రకటనలో వెల్లడించింది. శత్రుదేశాల అణ్వాస్త్రాలను అడ్డుకునే శక్తిసామర్థ్యాలను చాటేందుకు రొటీన్‌గా, తరచుగా నిర్వహించే పరీక్షల్లో ఇది ఒక భాగమని వివరించింది. ఈ పరీక్షకు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలకూ ఎలాంటి సంబంధమూ లేదని అందులో స్పష్టం చేసింది.

పాక్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టాం!

ఇక ప్రతి ఉగ్ర దాడికీ మూల్యం తప్పదు.. నా వంట్లో ప్రవహించేది రక్తం కాదు.. సిందూరం: ప్రధాని

» 'ఆపరేషన్ సిందూర్' తర్వాత రాజస్థాన్‌లో తొలి బహిరంగ సభ

» దేశవ్యాప్తంగా 103 అమృత్ స్టేషన్లకు వర్చువల్‌గా ప్రారంభోత్సవం



బికనేర్, మే 22: 'మన సాయుధ బలగాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. త్రివిధ దళాలు ఎలాంటి చక్రవ్యూహం పన్నాయంటే.. వాటి దెబ్బకు పాకిస్థాన్ మోకరిల్లింది' అని ప్రధాని మోదీ అన్నారు. ఇక ప్రతి ఉగ్రవాద దాడికి ఆ దేశం భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. తన వంట్లో ప్రవహించేది రక్తం కాదని.. వేడి సిందూరమని స్పష్టం చేశారు. మహిళల సిందూరం గన్‌పౌడర్‌గా మారితే ఏమవుతుందో శత్రువులు కళ్లారా చూశారని అన్నారు. 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ప్రధాని మొదటిసారి రాజస్థాన్ వచ్చారు. బికనేర్‌లో బహిరంగ సభలో ప్రసంగించారు. పహల్గాంలో ఉగ్రవాదులు కురిపించిన బుల్లెట్ల వర్షానికి 140 కోట్ల మంది భారతీయుల గుండె గాయపడిందన్నారు. అయితే, మన మహిళల నుదుట బొట్టు చెరిపేసిన వారిని మన సైనికులు మట్టిలో కలిపేశారని చెప్పారు. 22 నిమిషాల్లో ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేశారన్నారు. 'సాధారణంగా నేను ప్రశాంతంగా ఉంటాను. దేశం విషయానికొస్తే మాత్రం తీవ్ర భావావేశంతో, సంకల్పంతో నా రక్తం వేడెక్కుతుంది. మోదీ నరాల్లో రక్తం కాదు.. వేడివేడి సిందూరం ప్రవహిస్తోంది" అని మోదీ అన్నారు. "పాక్ ఏనాడూ మనపై ప్రత్యక్ష యుద్ధంలో గెలవలేదు. అందుకే ఉగ్రవాదాన్ని ఆయుధంగా వాడుతోంది. ఇకపై భారత్‌పై ఉగ్రదాడికి దిగితే ఆ దేశం ప్రతి పైసాకూ అడుక్కోవలసి వస్తుంది. భారతీయుల నెత్తుటితో ఆటలాడితే మూల్యం చెల్లించక తప్పదు. ఇది మా దృఢ సంకల్పం. ప్రపంచంలోని ఏ శక్తీ ఈ విషయంలో మనల్ని కదిలించజాలదు. ఆపరేషన్ సిందూర్.. యావత్ భారత ఉగ్రరూపం. ఇదే భారత నూతన రూపం" అని తేల్చిచెప్పారు.

అప్పుడు శపథం చేశాను..

2019లో బాలాకోట్ దాడుల తర్వాత రాజస్థాన్‌లోనే చురులో తొలి సభ నిర్వహించానని ప్రధాని గుర్తుచేశారు. 'దేశాన్ని తలవంచనివ్వనని ఈ మట్టిపై శపథం చేశా.. ఇప్పుడు మళ్లీ రాజస్థాన్‌లోని బికనేర్ వీరభూమి నుంచి చెబుతున్నాను.. భారతీయుల నెత్తురు కళ్లచూసిన వాళ్లు ప్రతి రక్తపు బొట్టుకూ మూల్యం చెల్లించారు. భారత్ నోరుమూసుకుని కూర్చుంటుందని అనుకున్నవాళ్లు ఇప్పుడు తమ ఇళ్లలో దాక్కున్నారు. తమ ఆయుధాలు చూసి గర్వించినవాళ్లు.. వారి శిథిలాల కిందే సమాధి అయ్యారు. అయితే పహల్గాంలో ఉగ్రదాడికి ఇది ప్రతీకారం కాదు.. కొత్త తరహా న్యాయం. పాక్‌తో ఇక వాణిజ్యం గానీ, చర్చలు గానీ ఉండవు. పాక్ ఆక్రమిత కశ్మీరుపైనే చర్చిస్తాం. అణు బెదిరింపులకు భయపడేది లేదు' అని స్పష్టం చేశారు.

వసతుల కల్పనకు పెద్దపీట

అభివృద్ధి చెందిన భారత్‌లో అధునాతన మౌలిక వసతుల కల్పనకు పెద్దఎత్తున కృషిసాగుతోందని ప్రధాని అన్నారు. గత 11 ఏళ్లలో రైల్వే స్టేషన్లు, విమానాశ్రయాల ఆధునికీకరణకు అసాధారణంగా పనిచేశామని చెప్పారు. గతంలో కంటే ఎన్నో ఎక్కువ రెట్ల సొమ్మును అభివృద్ధి ప్రాజెక్టులపై ఖర్చుచేస్తున్నామని తెలిపారు. రూ.1,100 కోట్లతో దేశవ్యాప్తంగా 18 రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 86 జిల్లాల్లో నవీకరించిన 103 అమృత్ రైల్వే స్టేషన్లను బికనీర్ సభ నుంచి వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. 1,300కిపైగా రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నట్లు ఈ సందర్భంగా మోదీ తెలిపారు. వందేభారత్ రైలు దాదాపు 70 మార్గాల్లో నడుస్తోందని చెప్పారు. గత 11 ఏళ్లలో వందల కొద్దీ రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిలను నిర్మించామన్నారు. మొట్టమొదటి బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు పని విస్తృతంగా సాగుతోందని చెప్పారు. మౌలిక వసతులపై ఖర్చుచేసే డబ్బుతో ఉపాధి, వ్యాపార అవకాశాలు కూడా సృష్టిస్తున్నామన్నారు.

అన్నీ సినిమా డైలాగులే: కాంగ్రెస్

రాజస్థాన్‌లో ప్రధాని వ్యాఖ్యలు గొప్పగా ఉన్నాయని.. కానీ అవన్నీ సినిమా డైలాగులేనని కాంగ్రెస్ ఎద్దేవాచేసింది. తన వల్లే భారత్-పాక్ యుద్ధం ముగిసిందన్న ట్రంప్ వ్యాఖ్యలపై మోదీ ఎందుకు నోరెత్తరని ప్రశ్నించింది. 'ప్రధాని తక్షణమే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు పెట్టాలి. కాల్పుల విరమణపై ట్రంప్ వ్యాఖ్యలకు వివరణ ఇవ్వాలి' అని జైరాం రమేశ్ డిమాండ్ చేశారు. పహల్గాంలో దాడిచేసిన క్రూరహంతకులు ఇంకా స్వేచ్ఛగా ఎందుకు తిరుగుతున్నారని ప్రశ్నించారు.

ట్రంప్ జోక్యం లేదు

కాల్పుల విరమణ కోసం పాకిస్థానే దిగొచ్చింది

న్యూఢిల్లీ, మే 22: భారత్, పాక్ మధ్య శాంతి స్థాపనకు మధ్యవర్తిత్వం వహిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించుకోవడాన్ని విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తీవ్రంగా ఖండించారు. ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడం వెనుక వాస్తవంగా ఏం జరిగిందో ఆయన నెదర్లాండ్స్‌కు చెందిన ఎన్‌వోఎస్ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. 'రెండు దేశాలు పరస్పరం మాట్లాడుకోవడానికి మాకు హాట్‌లైన్ వ్యవస్థ ఉంది. కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామని మే 10న మాకు పాక్ ఆర్మీ నుంచి సందేశం వచ్చింది. దానికి అనుగుణంగా మేం స్పందించాం' అని జైశంకర్ తెలిపారు. ఉద్రిక్తతల సమయంలో అమెరికాతో సహా అనేక దేశాలు తమతో సంప్రదింపులు జరిపాయని అయితే ద్వైపాక్షిక చర్చలతోనే సమస్య పరిష్కారమైందని ఆయన స్పష్టం చేశారు. 'అమెరికా.. అమెరికాలోనే ఉంది. ఆ దేశ ఉపాధ్యక్షుడు వాన్స్ మన ప్రధాని మోదీకి ఫోన్ చేశారు. విదేశాంగ మంత్రి రూబియో నాతో ఫోన్‌లో మాట్లాడారు. ఇతర దేశాల తరహాలోనే వారు పాక్‌తో కూడా సంప్రదింపులు జరిపారు. అదేవిధంగా కొన్ని గల్ఫ్ దేశాలు కూడా భారత్‌ను సంప్రదించాయి. రెండు దేశాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొన్నప్పుడు ప్రపంచ దేశాలు వారికి కాల్ చేయడం సాధారణమే. అయితే కాల్పుల విరమణ, సైనిక చర్యలు ఆపేయడం అనేది భారత్, పాక్ మధ్య నేరుగా జరిగిన ఒప్పందం. ఫైరింగ్ ఆగాలని పాకిస్థానీలు కోరుకుంటే దాని గురించి వారే మాకు చెప్పాలి. వారి డీజీఎంవో మా డీజీఎంవోకు ఫోన్ చేసి ఈ విషయాన్ని చెప్పాల్సి ఉంటుందని అమెరికాతో పాటు మాతో మాట్లాడిన ప్రతి ఒక్కరికీ స్పష్టంగా చెప్పాం. చివరకు అదే జరిగింది' అని జైశంకర్ వెల్లడించారు. ఇదిలా ఉండగా, ప్రతి అంశంలో పాక్‌కు వత్తాసు పలుకుతూ వస్తున్న తుర్కియే.. మొదట సీమాంతర ఉగ్రవాదాన్ని వీడాలని పాకిస్థాన్‌కు చెప్పాలని భారత్ స్పష్టం చేసింది.

లోకం తీరు



చైనా చౌక బేరం!

(మొదటిపేజీ తరువాయి)

పాక్ ఉప ప్రధాని ఇషాక్‌దార్ ఇటీవలే చైనా రక్షణ శాఖ అధికారులతో సమావేశమై చర్చించారు కూడా. ఈ క్రమంలోనే.. జే-35ఏ ఫైటర్ జెట్లపై 50శాతం డిస్కౌంట్ ఇస్తామని, అది కూడా చిన్న వాయిదాల్లో చెల్లించే అవకాశం కల్పిస్తామని చైనా ఆఫర్ చేసినట్టు సమాచారం. దీనిని చైనా, పాక్ మధ్య స్నేహానికి గుర్తుగా, భారత్ దాడిని సమర్థవంతంగా ఎదుర్కొన్నందుకు 'బహుమతి'గా పేర్కొన్నట్టు తెలిసింది. ఈ అంశాలతో పలు ఆంగ్ల మీడియా సంస్థలు కథనాలు ప్రచురించాయి. పాకిస్థాన్‌లో పౌర, మిలటరీ సదుపాయాల కల్పన కోసం 25 బిలియన్ డాలర్లు (సుమారు రూ.2.14 లక్షల కోట్లు) పెట్టుబడులు పెడతామని కూడా హామీ ఇచ్చినట్టు పేర్కొన్నాయి.

ఆయుధాలు అమ్ముకునే ఎత్తుగడ!

పాకిస్థాన్‌కు సగం ధరకే జే-35ఏ ఫైటర్లను చైనా ఇవ్వడం వెనుక ఆయుధాలు అమ్ముకునే ఎత్తుగడ దాగి ఉందని రక్షణ నిపుణులు చెబుతున్నారు. చైనా అధునాతన యుద్ధ విమానాలు, ఆయుధాలు అభివృద్ధి చేసినా, అమ్మకానికి పెట్టినా.. వాటి పనితీరుపై సందేహాలతో కొనుగోలు చేయడానికి వెనుకాడే పరిస్థితి ఉంది. చాలా దేశాలు అమెరికా, రష్యా, దక్షిణ కొరియా, ఫ్రాన్స్ తదితర దేశాల యుద్ధ విమానాలను కొనుగోలు చేయడంపైనే ఆసక్తి చూపుతున్నాయి. ఈ క్రమంలో పాకిస్థాన్‌ను ముందు పెట్టి.. తన ఫైటర్లు, ఆయుధాలను అమ్ముకునేందుకు చైనా ప్రయత్నం చేస్తోందని రక్షణ రంగ నిపుణులు చెబుతున్నారు. జే-35ఏ ఫైటర్లను వీలైనంత త్వరగా పాకిస్థాన్‌కు అందించి.. అవి యుద్ధాలకు సిద్ధమనే సంకేతాలు ఇవ్వడం, వాటి పనితీరుపై నమ్మకం కలిగించడం కోసం చైనా ప్రయత్నాలు చేస్తోందని వివరిస్తున్నారు. ఆఫ్రికా, మిడిల్ ఈస్ట్, ఆగ్నేయాసియా దేశాలకు జే-35ఏ ఫైటర్లను అమ్మేందుకు చైనా ప్రయత్నిస్తోందని అంటున్నారు.



అమెరికాలో ఇజ్రాయెలీల కాల్చివేత

» భారత్ సహా ప్రపంచ దేశాల ఖండన

వాషింగ్టన్, మే 22: అమెరికాలో ఇజ్రాయెల్ ఎంబసీ సిబ్బందిపై కాల్పులు జరపడంతో ఇద్దరు మరణించారు. వాషింగ్టన్ డీసీలోని యూదు మ్యూజియం వద్ద బుధవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. మృతులను యరాన్ లిస్చిన్‌స్కీ, సారా మిల్‌గ్రిమ్‌గా గుర్తించారు. వీరు యూదు మ్యూజియంలో ఓ కార్యక్రమానికి హాజరై తిరిగి వెళ్తుండగా దుండగుడు వీరి సమీపానికి వచ్చి కాల్పులు జరిపాడు. అనంతరం దుండగుడు నడుచుకుంటూ మ్యూజియంలోకి వెళ్లిపోయాడు. అక్కడి భద్రతా సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా నిందితుడు 'ఫ్రీ..ఫ్రీ..పాలస్తీనా' అంటూ నినాదాలు చేశాడు. నిందితుడిని షికాగోకు చెందిన ఇలియాస్ రోడ్రిగూజ్(30)గా గుర్తించారు. లిస్చిన్‌స్కీ, మిల్‌గ్రిమ్ ప్రేమజంట అని, త్వరలో పెళ్లి బంధంతో ఒక్కటవ్వాలనుకున్నారని అమెరికాలోని ఇజ్రాయెల్ రాయబారి యెచీల్ లీటర్ తెలిపారు. వచ్చేవారం జెరూసలెంలో వారి నిశ్చితార్థ కార్యక్రమం జరగాల్సి ఉందన్నారు. ఈ ఘటనను భారత్ సహా ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించాయి. 'యూదులకు వ్యతిరేకంగా ఇలాంటి భయంకరమైన హత్యలకు ముగింపు పలకాలి. అమెరికాలో విద్వేషాలకు, రాడికలిజానికి స్థానం లేదు' అంటూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నారు.

అన్ని హద్దులూ దాటేశారు

(మొదటిపేజీ తరువాయి)



దాఖలు చేసిన అప్పీలు పిటిషన్లపై కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశిస్తూ తదుపరి విచారణను వేసవి సెలవుల అనంతరం చేపడతామని తెలిపింది. ఈ మేరకు సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. టాస్మాక్ సంస్థలో రూ.వెయ్యి కోట్ల విలువైన మద్యం స్కామ్ జరిగిందంటూ వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా గత మార్చిలో ఈడీ అధికారులు ముమ్మర తనిఖీలు చేపట్టారు. మద్యం సరఫరా ఆర్డర్ల కోసం డిస్టిలరీలు ముడుపులు చెల్లించాయనే ఆరోపణలపై దర్యాప్తు జరుపుతోంది. దీనిని సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం మద్రాస్ హైకోర్టును ఆశ్రయించింది. అయితే, ఈడీ చర్యలను హైకోర్టు సమర్థిస్తూ ఈ ఏడాది ఏప్రిల్ 23న తీర్పు ఇచ్చింది. దీంతో తమిళనాడు ప్రభుత్వం, టాస్మాక్‌లు సుప్రీంకోర్టు ఈ నెల 20న తలుపుతట్టాయి. ఈ పిటిషన్‌పై గురువారం విచారణ జరిగింది. పిటిషనర్ల తరఫున కపిల్ సిబాల్, ముకుల్ రోహిత్గి తదితరులు వాదనలు వినిపించారు. టాస్మాక్‌లో 2014 నుంచి మద్యం వ్యవహారంలో కొంతమంది వ్యక్తులు డబ్బు అందుకోవడంపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 41 కేసులు నమోదుచేసిందన్నారు. కానీ ఈడీ ఇప్పుడీ వ్యవహారాన్ని ముందుకు తెచ్చి హడావుడిగా సోదాలు చేపట్టిందని ఆరోపించారు. టాస్మాక్ కార్యకలాపాలు స్తంభింపజేసేలా కార్యాలయంలోని కంప్యూటర్లు, పెన్ డ్రైవ్ సహా పలు పరికరాలను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. అలాగే, టాస్మాక్ సంస్థలోని ఉద్యోగుల సెల్‌ఫోన్లు ట్యాపింగ్ చేస్తున్నారని, మహిళా ఉద్యోగులను సైతం వేధింపులకు గురిచేస్తూ నిర్బంధంలో ఉంచుతున్నారని ఆరోపించారు. అవినీతికి పాల్పడిన వ్యక్తులపై రాష్ట్ర ప్రభుత్వమే చర్యలకు ఉపక్రమించిన నేపథ్యంలో ఈడీ ఇలాంటి చర్యలకు పాల్పడడం ఎంతమేరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. రాష్ట్రప్రభుత్వం ఆధీనంలో ఉన్న టాస్మాక్‌పై 'మీరెలా దాడి చేస్తారు' అని ఈడీ తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వీ రాజును ప్రశ్నించింది. ఒక ప్రభుత్వ కార్పొరేషన్‌ను లక్ష్యంగా చేసుకునే క్రమంలో సమాఖ్య భావనను ఈడీ దెబ్బతీసిందని ఆక్షేపించింది. ఈడీ చర్యలు చట్టవిరుద్ధంగానూ, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగానూ ఉన్నాయని తేల్చింది. ఈడీకి నోటీసులు జారీ చేసింది. కాగా, సుప్రీంకోర్టు తీర్పు ఈడీకి చెంపపెట్టులాంటిదని అధికార డీఎంకే అధికార ప్రతినిధి ఆర్ఎస్ భారతి వ్యాఖ్యానించారు.

వక్ఫ్‌పై మధ్యంతర ఉత్తర్వులను వాయిదా వేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, మే 22: వక్ఫ్ సవరణ చట్టం-2025 లోని మూడు కీలక అంశాలపై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న వినతులపై గురువారం సుప్రీంకోర్టు నిర్ణయాన్ని వాయిదా వేసింది. కోర్టులు వక్ఫ్ భూములుగా గుర్తించిన ఆస్తులను (వక్ఫ్ బై కోర్ట్స్), వినియోగదారుల చేతిలో ఉన్న వక్ఫ్ ఆస్తులను (వక్ఫ్ బై యూజర్), పత్రాలు ద్వారా దఖలుపడ్డ వక్ఫ్ ఆస్తులను (వక్ఫ్ బై డీడ్)లను డీ-నోటిఫై చేయకూడదని కోరుతూ పలు వ్యాజ్యాలు దాఖలయ్యాయి. ఒకవేళ డీ-నోటిఫై చేస్తే వక్ఫ్ ఆస్తులన్న గుర్తింపును అవి కోల్పోతాయి. ప్రభుత్వం వీటిని డీ-నోటిఫై చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని పిటిషనర్లు కోరారు. ఈ వ్యాజ్యాలపై సీజేఐ జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం వరుసగా మూడురోజుల పాటు విచారణ జరిపింది.

నీట్ పీజీలో 'సీట్ల బ్లాక్'ను నిరోధించండి!

నీట్ పీజీ అడ్మిషన్ల కౌన్సెలింగ్‌లో సీట్ల బ్లాకింగ్‌పై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కొంత మంది అభ్యర్థులు పాల్పడే ఈ చర్య వలన మెరిట్ విద్యార్థులకు నష్టం జరుగుతుందని పేర్కొంది. సీట్ల బ్లాకింగ్ అనేది కేవలం తప్పు మాత్రమే కాదని, ఇది పాతుకుపోయిన లోతైన వ్యవస్థాగత లోపాలను ఎత్తిచూపుతుందని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో సీట్ల బ్లాకింగ్‌కు చెక్ పెట్టేందుకు కోర్టు కీలక ఆదేశాలు ఇచ్చింది. నీట్ పీజీ కోసం అన్ని ప్రైవేటు/డీమ్డ్ వర్సిటీలు కౌన్సెలింగ్‌కు ముందుగానే ట్యూషన్, హాస్టల్, కాషన్ డిపాజిట్ తదితర ఫీజుల వివరాలను తప్పనిసరిగా వెల్లడించాలని ఆదేశించింది. సీట్ల బ్లాకింగ్‌కు పాల్పడితే సెక్యూరిటీ డిపాజిట్లు జప్తు, భవిష్యత్తు నీట్ పీజీ పరీక్షకు అనర్హత, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే కాలేజీను బ్లాక్ లిస్టులో పెట్టడం వంటి చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఆధార్ ఆధారిత సీట్ల ట్రాకింగ్‌ను అమలు చేయాలని సూచించింది.

సద్గురు ధ్యానంతో.. చలాకీ మెదడు

» సంయమ సాధనతో 5.9 ఏళ్లు వెనక్కి..

» హార్వర్డ్ అధ్యయనంలో వెల్లడి



న్యూఢిల్లీ, మే 22: శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండటానికి యోగా, ధ్యానం తోడ్పడతాయని అందరికీ తెలుసు. అయితే ఓ వినూత్న ధ్యానంపై పరిశోధనల్లో సరికొత్త విషయం ఇప్పుడు గుర్తించారు. సద్గురు జగ్గీవాసుదేవ్ అభివృద్ధి చేసిన సంయమ సాధనతో మెదడు వృద్ధాప్యం తగ్గుతోందని హార్వర్డ్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. హార్వర్డ్ మెడికల్ స్కూల్‌తో కలసి మసాచుసెట్స్ జనరల్ హాస్పటల్, బెత్ ఇస్రాయెల్ డీకొనెస్ మెడికల్ సెంటర్‌కు చెందిన నిపుణులు సంయమ సాధన మెడిటేషన్‌పై ఇటీవల అధ్యయనం చేశారు. ఈ ధ్యానంలో 8 రోజులు పూర్తి శిక్షణ తీసుకుని సాధన చేస్తున్న వ్యక్తులను వీరు పరిశీలించారు. సంయమ సాధన చేస్తున్న వారి ప్రస్తుత వయసు కంటే వారి మెదడు 5.9 సంవత్సరాల వెనక్కు మళ్లిందని పరిశోధనల్లో గుర్తించారు. కొంతమంది విషయంలో అది పదేళ్లకు పైగా వెనక్కి వెళ్లిందని చెప్పారు. అంటే వారి వయసుతో పోలిస్తే వారి మెదడు వృద్ధాప్యం తక్కువగా ఉందన్నారు. ధ్యానానికి మెదడుకు ఉన్న సంబంధాన్ని గుర్తించడానికి కొందరిపై ఈఈజీ స్కాన్లను ఉపయోగించి పరిశీలన చేశారు. ధ్యాన సాధన ఫలితాలను పోల్చి చూడటానికి ఈ అధ్యయనంలో పాల్గొన్న వారిలో పూర్తి ఆరోగ్యంతో ఉన్న వారితో పాటు వయసుతో పాటు వచ్చే మెదడు సమస్యలు ఉన్న వారిని కూడా చేర్చారు. సంయమ సాధన చేసిన వారు సుఖంగా నిద్రపోతున్నారని, స్పష్టమైన ఆలోచన, పదునైన జ్ఞాపకశక్తి కలిగి ఉన్నారని వారు వెల్లడించారు. హార్వర్డ్ మెడికల్ స్కూల్‌కు చెందిన బాల సుబ్రమణీయం నేతృత్వంలో జరిగిన ఈ అధ్యయన అంశాలను 'మైండ్‌ఫుల్‌నెస్' జర్నల్‌లో ప్రచురించారు.

ఇదొక అద్భుతం..: సద్గురు

మానవ శరీరంపై ఆధ్యాత్మిక సాధన శాస్త్రాల ప్రభావాన్ని ఆధునిక సైన్స్ మదించడం, గుర్తించడం అద్భుత విషయం అని సద్గురు జగ్గీవాసుదేవ్ పేర్కొన్నారు. ప్రతి మనిషి తన భౌతిక, మానసిక ఆరోగ్యంపై పెట్టుబడి పెట్టాలని, అలా చేయడం వల్ల మనకు, భవిష్యత్ తరాలకు ఉపయోగకరమని చెప్పారు.

సంయమ సాధన అంటే ఏమిటి?

ఇది 8 రోజులు నిశ్శబ్దంగా చేసే తీవ్రమైన సాధన. దీనికి నెలల కొద్దీ సన్నద్ధత కావాలి. సాధకులు ప్రతిరోజు యోగా, ధ్యానం సాధన కచ్చితంగా చేయాలి. వీగన్ డైట్‌ను అనుసరించాలి. శాంభవి మహాముద్ర, శక్తి చలన క్రియ తదితర క్రియా యోగాలను, యోగాసనాలు, శూన్య మెడిటేషన్ తప్పనిసరిగా చేయాలి. దీనిని సద్గురు జగ్గీ వాసుదేవ్ అభివృద్ధి చేశారు.

ఆహ్వాన పత్రికలను పంచేందుకు వెళ్లి..

కానరాని లోకాలకు

» రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుల దుర్మరణం

తల్లాడ, మే 22 (ఆంధ్రజ్యోతి): శుభకార్యానికి బంధువులకు ఆహ్వాన పత్రికలను అందజేసి తిరుగు ప్రయాణమైన తండ్రీకొడుకులను రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. ఈ సంఘటన ఖమ్మం జిల్లాలోని తల్లాడ - దేవరపల్లి జాతీయ రహదారిపై గురువారం జరిగింది. కల్లూరు మండలం చంద్రుపట్ల గ్రామానికి చెందిన కొత్తపల్లి రాంబాబు (26) గురువారం తన బైకుపై రామచంద్రాపురం గ్రామంలోని తన మామ కత్తి వెంకటి ఇంటికి వెళ్లాడు. వేసవి సెలవులకు వెళ్లి అక్కడే ఉన్న తన పెద్ద కుమారుడు క్రిషాంత్ (6)ను తీసుకుని.. మల్లవరం గ్రామంలోని వారి బంధువులకు ఆహ్వాన పత్రికలు ఇవ్వడానికి వెళ్లాడు. అక్కడి నుంచి తమ స్వగ్రామమైన చంద్రుపట్లకు బయల్దేరగా.. ఎన్టీఆర్ నగర్ వద్ద సత్తుపల్లి నుంచి జగ్గయ్యపేట వైపునకు వెళుతున్న లారీ వారి బైకును ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాంబాబు అతడి కుమారుడు క్రిశాంత్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తీసుకెళ్తుండగా మార్గంమధ్యలో ఇద్దరూ మృతిచెందారు. రాంబాబు కల్లూరులోని ఓ హోటల్‌లో పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఇది మొదటి అడుగే

» ప్రతి జిల్లాలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

» ప్రకటించిన 'ఆంధ్రజ్యోతి' ఈడీ వేమూరి ఆదిత్య

» మున్సిపల్, తుడా నిధులతో సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మించాం

» మహిళలకు భద్రత కోసం పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు

» ఇళ్ల పట్టాల సమస్యనూ పరిష్కరిస్తాం: ఎమ్మెల్యే ఆరణి

» తిరుపతి జీవకోనలో 'అక్షరమే అండగా..' సభ

» రూ.1.06 కోట్లతో అభివృద్ధి పనులకు భూమి పూజ

తిరుపతి, మే 22(ఆంధ్రజ్యోతి): 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కారంలో ఇది మొదటి అడుగు మాత్రమేనని 'ఆంధ్రజ్యోతి' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వేమూరి ఆదిత్య స్పష్టం చేశారు. ప్రతి జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ప్రకటించారు. గురువారం తిరుపతి నగరం జీవకోన అంబేడ్కర్ కూడలి సమీపంలోని శ్రీలలితా త్రిపుర సుందరి ఆలయ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది జనవరిలో జీవకోనలో నిర్వహించిన 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' సదస్సులో ప్రజలు ప్రస్తావించిన సమస్యలకు సంబంధించి రూ.62లక్షలతో సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్ల నిర్మాణాలు పూర్తయ్యాయని వివరించారు. మరో రూ.1.06కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసినట్లు తెలిపారు. సభలో ప్రజల నుంచి మరిన్ని వినతులు అందాయని, వాటిని కూడా పరిష్కరించేందుకు ప్రయత్నిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా సమస్యలను వార్తలుగా ప్రచురించడానికే పరిమితం కాకుండా వాటి పరిష్కారానికి 'ఆంధ్రజ్యోతి' చేస్తున్న ప్రయత్నం అభినందనీయమని కొనియాడారు. జీవకోనలో గంజాయి బ్యాచ్‌లు, ఆకతాయిల ఆగడాలను అరికట్టి మహిళలకు భద్రత కల్పించేందుకు పోలీస్ అవుట్ పోస్టును ఏర్పాటు చేశామని చెప్పారు. శ్మశానానికి ప్రహరీ, గేట్లు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేశామన్నారు. జీవకోన ప్రాంతంలో ఎక్కువ ఇళ్లకు శాశ్వత పట్టాలు, పత్రాలు లేకపోవడం ప్రధాన సమస్యగా ఉందని, దీనిపై రెవెన్యూ, అటవీ, టీటీడీ అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. 'ఆంధ్రజ్యోతి' వేసిన పునాదిని కొనసాగించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మున్సిపల్ కమిషనర్ మౌర్య అన్నారు. అంతకుముందు ఎమ్మెల్యే, మున్సిపల్ కమిషనర్‌తో కలసి జీవకోనలో రూ.1.06 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేసిన అభివృద్ధి పనులకు జరిగిన భూమి పూజలో ఆదిత్య పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన రెండు ఆర్వో ప్లాంట్లను పరిశీలించారు. అంబేడ్కర్ కూడలిలో జిల్లా పోలీసు శాఖ ఏర్పాటు చేసిన పోలీసు ఔట్ పోస్టు ప్రారంభోత్సవ కార్యక్రమంతో పాటు సత్యనారాయణపురం నుంచీ ఎర్రమిట్టకు నిర్మించిన సీసీ రోడ్డు ప్రారంభోత్సవంలోనూ ఆయన పాల్గొన్నారు. సభలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, 'ఆంధ్రజ్యోతి' అసిస్టెంట్ ఎడిటర్ ఆర్ఎం ఉమామహేశ్వరరావు, బ్రాంచి మేనేజర్ సురేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




సభలో ప్రసంగిస్తున్న ఆంధ్రజ్యోతి ఈడీ వేమూరి ఆదిత్య

శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ వరకు

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు!

రేడియల్ రోడ్డు ముగిసే ఆమనగల్ నుంచి మన్ననూరు దాకా



ఆమనగల్ నుంచి మన్ననూరు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ప్రతిపాదిత ప్రత్యామ్నాయ అలైన్‌మెంట్ మ్యాప్ | ఎర్ర రంగులో ఉన్నది ఆప్షన్-1, ఆకుపచ్చ రంగులో ఉన్నది ఆప్షన్-2, నీలం రంగులో ఉన్నది ఆప్షన్-3.

» 4 వరుసలతో రహదారి నిర్మాణం

» సీఎం సూచనలతో 3 ప్రతిపాదనలను సిద్ధం చేసిన ఎన్‌హెచ్ఏఐ

» ఒకదానికి సర్కారు ఆమోదముద్ర వేయగానే కేంద్రానికి నివేదిక

» ఆపై ప్రారంభం కానున్న పనులు

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి డిండి, మన్ననూరు, శ్రీశైలం మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లే ప్రయాణికులకు తీపికబురు. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్), రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్)లను కలుపుతూ కొంగర్‌కలాన్ నుంచి ఆమనగల్ వరకు 41.5 కి.మీ మేర నిర్మించనున్న గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డుకు కొనసాగింపుగా ప్రతిపాదిత (జాతీయ రహదారి 765) శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం ప్రారంభమయ్యే ప్రాంతం వరకు గ్రీన్‌ఫీల్డ్ హైవే అందుబాటులోకి రానుంది. ఈ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం పూర్తయితే ఏపీకి వెళ్లడానికి ప్రయాణ దూరం తగ్గనుంది. ప్రయాణ సమయమూ ఆదా కానుంది.. కొంగర్‌కలాన్ నుంచి ఆమనగల్ వరకు హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్‌జీ సీఎల్), హెచ్ఎండీఏ పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డును నిర్మిస్తున్నారు. ఆమనగల్ దగ్గర ముగిసే ఈ రేడియల్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును కొనసాగిస్తూ శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ వరకు నాలుగు వరుసల విధానంలో గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించాలని సర్కారు నిర్ణయించింది. ఇందుకు సంబంధించి జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) మూడు ప్రతిపాదనలను సిద్ధం చేసింది. వాటిలో ఒకదానికి ప్రభుత్వం ఆమోదముద్ర వేయగానే కేంద్రానికి కూడా నివేదిక సమర్పించి, అనుమతి వచ్చాక రహదారి పనులను ప్రారంభించనున్నారు. కాగా హైదరాబాద్ నుంచి డిండి వరకు రోజుకు సగటున 10వేలకు పైగా వాహనాలు ప్రయాణం చేస్తున్నట్టు నివేదికలో పొందుపర్చారు. ఇప్పుడు ఆమనగల్ నుంచి మన్ననూర్ వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించాలని సీఎం సూచనల నేపథ్యంలో సిద్ధం చేసిన మూడు ప్రతిపాదనల్లో రహదారి అలైన్‌మెంట్‌లో మార్పులు చోటుచేసుకున్నాయి. మొదటి ప్రతిపాదనలో 20 గ్రామాలు, రెండో ప్రతిపాదనలో 11 గ్రామాలున్నాయి. మూడో ప్రతిపాదనలో ముఖ్యమంత్రి స్వగ్రామం కొండారెడ్డిపల్లితో పాటు మొత్తం 15 గ్రామాల మీదుగా మన్ననూర్ వరకు రహదారి అలైన్‌మెంట్‌ను ఉంది.

మూడు ప్రతిపాదనలు ఇవే

ఆప్షన్-1: ఇది ప్రస్తుత రోడ్డు 75కి.మీ ఉంది. గ్రీన్‌ఫీల్డ్ విధానంలో 6.9కి.మీ, బ్రౌన్‌ఫీల్డ్ విధానంలో 68.15కి.మీ నిర్మాణం చేపట్టాలి. ఆమనగల్, మేడిగడ్డ, పెద్దాపూర్, చెర్కూర్, వెల్దండ, కోట్ర, జయప్రకాశ్‌నగర్, తండ్రా, వంగూర్ గేట్, సర్వారెడ్డిపల్లి, కోనేటిపురం, తిరుమలగిరి, డిండి, ఈరట్వాన్‌పల్లి, వెల్టూరు, అయ్య వారిపల్లి, చెన్నారంసబ క్, రాయ్‌చేడు, హజీపూర్, తానాపూర్, బ్రాహ్మణపల్లి, మన్ననూర్ గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం కానుందని తెలిపారు.

ఆప్షన్-2: ఈ విధానంలో 59కి.మీ రోడ్డు ఉంటుంది. గ్రీన్‌ఫీల్డ్ విధానంలో 46.7కి.మీ, బ్రౌన్‌ఫీల్డ్ విధానంలో 12.65కి.మీ మేర నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. ఆమనగల్, తిమ్మాయిపల్లి, దొంతులగుట్ట తండా, సర్వారెడ్డిపల్లి, కో నెట్లపురం, తిరుమలగిరి, సింగవారం, కొర్రాతండా, చెదురుబావితండా మీదుగా మన్ననూర్ వరకు ఈ రోడ్డు ఉండనుంది.

ఆప్షన్-3: ఇది మొత్తం 72.35 కి.మీ ఉండనుంది. నిర్మాణానికి రూ.1,822 కోట్ల వరకు ఖర్చవుతుందని పేర్కొన్నారు. ఆమనగల్, మేడిగడ్డ, నారా యణపూర్, చెర్కూర్, చౌకన్నపల్లి, వెల్దండ, కొండారెడ్డిపల్లి, వంగూర్, తిప్పారెడ్డిపల్లి, డిండి, వెల్టూర్, చెన్నారంసబక్, హజీపూర్, నడింపల్లి మీదుగా మన్ననూర్ వరకు రోడ్డు ఉండనుంది.


బేగంపేట రైల్వే స్టేషన్‌లో శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కిషన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి

అమృత్ స్టేషన్ల ఆవిష్కరణ

(మొదటి పేజీ తరువాయి)

బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో స్టేషన్‌ను రూ.25 కోట్లతో ఎయిర్‌పోర్టు తరహా సదుపాయాలతో తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా బేగంపేట రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ వీడియో లింక్ ద్వారా హాజరయ్యారు. ఇటీవల ఆపరేషన్ సిందూర్ పేరుతో నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో విజేతలకు బహుమతులను కిషన్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా భారత్‌లో ఒకేసారి 1,300 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నామని, ఇందులో తెలంగాణలో 40 స్టేషన్లు ఉన్నాయని తెలిపారు. కొమురవెల్లి స్టేషన్‌ను ఈ ఏడాది దసరాకు అందుబాటులోకి తీసుకువస్తామని చెప్పారు. రూ.1,000 కోట్లతో ఎంఎంటీఎస్ ఫేజ్-2నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని తెలిపారు. యాదగిరిగుట్టకు ఎంఎంటీఎస్ మంజూరైందని, సుమారు రూ.400 కోట్లతో త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రైలు ప్రమాదాల నివారణ కోసం తెలంగాణలో పైలట్ ప్రాజెక్టు కింద 617 కి.మీ. మేర కవచ్ టెక్నాలజీని తీసుకొచ్చామని చెప్పారు. తెలంగాణలో మూడు రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసి, ప్రారంభించడం హర్షణీయమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. యాదగిరిగుట్టకు వచ్చే భక్తుల కోసం ఎంఎంటీఎస్ ఫేజ్-2ను వేగవంతం చేయాలని కోరారు. కరీంనగర్-హసన్‌పర్తి రైల్వే లైన్‌పై కేంద్రం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. కరీంనగర్ రైల్వే స్టేషన్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ఈ మార్గంలో 61 కి.మీ. నిర్మాణంపై సర్వే పూర్తి చేసి డీపీఆర్ తయారు చేశామని తెలిపారు. ఈలైన్ నిర్మాణానికి రూ.1,480 కోట్లు అవుతుందని డీపీఆర్‌లో పేర్కొన్నారని, దీనిపై అతి త్వరలోనే కేంద్రం నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. త్వరలోనే జమ్మికుంట రైల్వే స్టేషన్‌ను సైతం అమృత్ భారత్ పథకంలో చేర్చి ఆధునీకరిస్తామని తెలిపారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆధునిక హంగులతో రైల్వే స్టేషన్లను ఆధునీకరించడం అవసరమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీలో మరో 6నెలల్లో ఉత్పత్తి ప్రారంభమవుతుందని కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ తెలిపారు. వరంగల్ రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. హైదరాబాద్ మెట్రో రెండవ దశ విస్తరణ ప్రతిపాదనలను త్వరగా ఆమోదించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. రీజినల్ రింగ్ రోడ్డుకు సమాంతరంగా రైల్వే లైన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు ఈటల రాజేందర్, డీకే అరుణ, కడియం కావ్య పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఇదేమి మర్యాద?

'ఎంటర్ ఎట్ యువర్ ఓన్‌రిస్క్'.. అమెరికా అధ్యక్షుడు తన ఓవల్ ఆఫీస్‌లో అడుగుపెట్టినవారితో మర్యాదగా వ్యవహరించపోగా, తీవ్రంగా అవమానించి పంపిస్తాడంటూ ప్రపంచ దేశాధినేతలందరికీ ఒక ఆంగ్లపత్రిక చేసిన హెచ్చరిక ఇది. దక్షిణాఫ్రికా అధ్యక్షుడు సిరిల్ రాంఫోసాతో బుధవారం డోనాల్డ్ ట్రంప్ వ్యవహరించిన తీరుతో బహుశా ఏ దేశాధినేతాకూడా నమ్మకంగా ఓవల్ ఆఫీసులోకి అడుగుపెట్టలేడేమో. ట్రంప్‌తో భేటీ తరువాత విలేఖరులతో రాంఫోసా ఓ బలవంతపు చిరునవ్వు మధ్యన 'మిమ్మల్ని నిరాశపరిచినట్టున్నాను' అని ఓ వ్యాఖ్య చేశారు. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఇదే కార్యాలయంలో ట్రంప్ ఎంత అవమానకరంగా వ్యవహరించారో రాంఫోసాకు తెలుసు. ఆ సందర్భంగా జెలెన్‌స్కీ ఏమాత్రం తగ్గకుండా ట్రంప్‌కు దీటైన సమాధానాలు ఇచ్చి, అగ్రరాజ్యాధినేత ఆగ్రహానికి గురై అర్ధాంతరంగా అవమానకరమైన రీతిలో బయటకు పోవాల్సివచ్చింది. కానీ, ట్రంప్ ఎంత అవమానించినా కూడా వాగ్యుద్ధం హద్దులు దాటకూడదని, తాను మరో జెలెన్‌స్కీ కాకూడదని రాంఫోసా జాగ్రత్తపడ్డారు. అందుకే, విలేఖరులను నిరాశపరిచానన్న నర్మగర్భమైన వ్యాఖ్య చేశారు.

దక్షిణాఫ్రికాలో నల్లవారు ఒక పద్ధతిప్రకారం శ్వేతజాతిరైతుల భూములను ఆక్రమించుకుంటూ, వందలాది తెల్లవారిని ఊచకోత కోశారన్నది మస్క్–ట్రంప్ బృందం వాదన. అమెరికాలో శ్వేతజాతీయుల ఓట్లు కొల్లగొట్టడానికి ఇది ఎంత ఉపకరించిందన్నది అటుంచితే, ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత దక్షిణాఫ్రికాలోని తెల్లవారికి అమెరికా ప్రవేశాన్ని సులభతరం చేశారు. దక్షిణాఫ్రికామీద కక్షకట్టి నిధుల నిలిపివేతసహా పూర్తిస్థాయి సహాయనిరాకరణ ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ట్రంప్‌తో మాట్లాడి, ఈ కక్షకు స్వస్తి పలకాలని రాంఫోసా ప్రతిపాదించినప్పుడు, ట్రంప్ మనసు తెలిసి కూడా వెళ్ళి అవమానపడటం ఎందుకని ఆయన శ్రేయోభిలాషులు సలహా ఇచ్చారట. కానీ, ఆర్థికంగా దేశానికి జరిగేనష్టం కంటే, ఉధృతంగా సాగుతున్న ట్రంప్ ప్రచారాన్ని మిగతా ప్రపంచం ఎప్పటికోప్పటికి నమ్మే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని, పోయిరావలసిందేనని రాంఫోసా పట్టుబట్టి, చివరకు ఇలా అవమానపడాల్సి వచ్చింది. నిజంగా వందలాదిమంది తెల్లరైతుల హత్యలే జరిగితే ఈ నల్లదేశాన్ని పాశ్చాత్యప్రపంచం బతకనిస్తుందా?

మొహమాటపు పలకరింపులు అయ్యాక, ట్రంప్ ఒక్కసారిగా ముసుగు తీసేశారు. చావులు..చావులు..ఘోరమైన చావులు అంటూ మీ దేశంలో శ్వేతజాతిమారణకాండ సాగిపోతోందని రాంఫోసా మీద విరుచుకుపడ్డారు. దక్షిణాఫ్రికాలో హింస హెచ్చుగా ఉన్నమాట నిజమే కానీ, వ్యవసాయరంగానికి సంబంధించిన హత్యల్లో నల్లవారే ఎక్కువగా చనిపోయారని రాంఫోసా ఒక దశలో ఏదో చెప్పబోయారు. చూస్తాను, చేస్తానని ఏదో అన్నారు. ఇంతలోగా ట్రంప్ ఆదేశాల మేరకు ఓవల్ ఆఫీసులో లైట్లు తగ్గిపోయి, అప్పటికప్పుడు అది ఓ చలనచిత్ర ప్రదర్శనశాలగా మారిపోయింది. దక్షిణాఫ్రికా స్వాతంత్ర్య పోరాట కాలంలో శ్వేతజాతివారిమీద నల్లజాతి నాయకులు కక్షపూరితంగా పాడిన పాటలు, ఇటీవల కొందరు నాయకులు ఇచ్చిన నినాదాలు, డ్రోన్‌ద్వారా చిత్రీకరించిన కొన్ని దృశ్యాలు గుదిగుచ్చిన ఒక ఐదునిముషాల విడియోను రాంఫోసా చెమటలు తుడుచుకుంటూ చూడాల్సివచ్చింది. ప్రదర్శన ఆగినవెంటనే, ఉపాధ్యక్షుడు వాన్స్ అందించిన ఒక పెద్దకాగితాలకట్టని ముందుగా మీడియాకు విప్పి చూపించి, ఆ తరువాత రాంఫోసాకు అందించారు ట్రంప్. వాటిమీద కనిపిస్తున్న ఫోటోలన్నీ ప్రిటోరియా తదితర ప్రాంతాల్లో ఊచకోతకు గురైన తెల్లవారి మృతదేహాలని ట్రంప్ బృందం ప్రపంచానికి చెప్పదల్చుకుంది. కానీ, బిబిసి సహా చాలా మీడియా సంస్థలు ట్రంప్ ప్రదర్శించిన విడియోలోనూ, చూపిన ఈ కాగితాల్లోనూ ఎన్ని అసత్యాలు దాగివున్నాయో విశ్లేషిస్తున్నాయి. కాంగో దృశ్యాలను తెచ్చి, దక్షిణాఫ్రికా మీద రుద్దుతున్నారని, గతంలో ఒక శ్వేతజాతిరైతుదంపతుల హత్యకు ఆగ్రహించి ఒక రహదారికి అటూ ఇటూ తెల్ల శిలువలు పాతితే, ఆ దృశ్యాన్ని సైతం వాడుకొని ఆ శిలువలన్నీ వందలాదిమంది తెల్లరైతుల ఊచకోతకు నిదర్శనంగా ప్రచారం చేస్తున్నారని ఈ సంస్థలు అంటున్నాయి. ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించి, గాజాలో సాగుతున్నది జీనోసైడ్‌గా నిర్ధారించేట్టు చేసి, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు అరెస్టు వారెంట్ జారీచేయించినందుకు, అదే పదజాలంతో ట్రంప్ బృందం దక్షిణాఫ్రికా మీద ఇలా కక్షతీర్చుకుంటోందన్నమాట.

తెలంగాణ జరూర్ ఆనా–కుచ్ సీఖ్ నా

ప్రస్తుతం హైదరాబాద్ వేదికగా 72వ మిస్‌వరల్డ్ పోటీలు జరుగుతున్నాయి. ప్రపంచంలోని 109 దేశాల సుందరీమణులు వీటిల్లో పాల్గొంటున్నారు. మే 10న అట్టహాసంగా ప్రారంభమైన ఈ పోటీలు ఈ నెల 31న జరగబోయే గ్రాండ్ ఫినాలేతో ముగుస్తాయి. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రాజ్‌భవన్‌లో జరగబోయే తేనీటి విందులో మిస్‌వరల్డ్ విజేతతో పాటు ఇతర కంటెస్టెంట్లు ఆతిథ్యం స్వీకరించి, అనంతరం వారి దేశాలకు వెళ్లిపోతారు.



'తెలంగాణ జరూర్ ఆనా' నినాదంతో ఈ పోటీల ద్వారా తెలంగాణ పర్యాటకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రమోట్ చేస్తున్నది. రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను ప్రపంచ సుందరీమణులు సందర్శించేలా అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేసింది. ఇప్పటికే బుద్ధ వనం, చౌమల్లా ప్యాలెస్, చార్మినార్, యాదగిరిగుట్ట, రామప్ప గుడి, భద్రకాళి గుడి, వేయి స్తంభాల గుడి, ఫలక్‌నుమా ప్యాలెస్, పోచంపల్లి, సచివాలయం, పిల్లలమర్రి తదితర ప్రాంతాలను ఈ అందగత్తెలు సందర్శించారు. కానీ సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న అతి పెద్ద అంబేడ్కర్ విగ్రహ సందర్శనకు ఆ అతిథులను ప్రభుత్వం తీసుకువెళ్లకపోవడం శోచనీయం.

ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం మనది. అతి పెద్ద లిఖితపూర్వక రాజ్యాంగం కూడా. అలాంటి గొప్ప రాజ్యాంగాన్ని రచించిన మహనీయుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కూడా ఆ రాజ్యాంగం ప్రకారమే జరిగింది. అందుకే తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆ మహనీయుడికి నివాళిగా, భవిష్యత్తు తరాలకు స్ఫూర్తినిచ్చేలా హుస్సేన్‌సాగర్ తీరాన, హైదరాబాద్ నడిబొడ్డున అతిపెద్ద అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని నెలకొల్పారు. ఆ పరిసరాలను అంబేడ్కర్ స్మృతివనంగా తీర్చిదిద్దారు. విగ్రహ పీఠం లోపల స్మారక భవనంలో అంబేడ్కర్‌కు సంబంధించిన అరుదైన ఫొటో గ్యాలరీ ఉంది. అక్కడ అంబేడ్కర్ రచనలు, జీవిత విశేషాలు, రాజ్యాంగ ప్రతులు, ఆయన గురించి పలువురు రాసిన పుస్తకాలు.. ఎన్నో ఉన్నాయి.

మన దేశ గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని, ప్రజాస్వామ్య ఘనతను విశ్వవ్యాప్తం చేసే అరుదైన అవకాశం ఇప్పుడు తెలంగాణకు దక్కింది. మిస్‌వరల్డ్ పోటీదారులను అంబేడ్కర్ స్మృతి భవనానికి ఆహ్వానించడం, వారికి మన రాజ్యాంగ గొప్పతనాన్ని వివరించడం వంటివి చేస్తే చాలా బాగుంటుంది. కానీ సీఎం రేవంత్‌రెడ్డికి అలాంటి ఆలోచనేమీ లేనట్టుగా కన్పిస్తోంది. ఏడాదిన్నర కిందట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇంతపెద్ద అంబేడ్కర్ విగ్రహాన్ని ఏనాడూ పట్టించుకోలేదు. మరికొన్ని రోజుల్లో ఈ అందాల పోటీలు ముగుస్తున్నందున మిస్‌వరల్డ్ పోటీదారులు అంబేడ్కర్ స్మృతివనాన్ని సందర్శించేలా రేవంత్ ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలి. అలా చేయని పక్షంలో ప్రపంచ నలుదిశలా వ్యాపించబోయే తెలంగాణ ఖ్యాతిని అడ్డుకున్న పార్టీగా కాంగ్రెస్ చరిత్రలో మిగిలిపోతుంది.

– బోయినపల్లి వినోద్ కుమార్, మాజీ ఎంపీ

'న్యూ' ఇండియాలో న్యాయం నిష్పాక్షికమేనా?



> **ప్రొఫెసర్ అలీఖాన్ మహమూదాబాద్ పాల్పడిన 'నేరం' ఏమిటి? దేశ చట్టాల ఉల్లంఘన కిందకు వచ్చే ఎలాంటి వ్యాఖ్యలనైనా చేయడం కానేకాదు; ప్రస్తుత ప్రభుత్వాన్ని నిర్భయంగా విమర్శించే భారతీయ ముస్లిం కావడమే ఆయన 'అపరాధం'. కల్నల్ సోఫియా ఖురేషిపై మత విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన విజయ్ షాపై చట్టపరమైన చర్యలు ఏవీ చేపట్టక పోవడానికి కారణం ఆయన పాలక పక్షంలో ప్రముఖ నాయకుడు కావడం వల్లే కాదూ? మీ ఇంటి పేరు షా కావడం, ఖాన్ కాకపోవడంలో ఉన్న వ్యత్యాసమది.**



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

హిందుత్వ రాజకీయ ప్రాబల్యం పెరిగిపోతున్న ఈ రోజుల్లో ఒక భారతీయ ముస్లింగా ఉండడం అంటే ఏమిటి? ఈ విషయమై ఆలోచనాపరుల భిన్నాభిప్రాయాలతో కూడిన 'మై నేమ్ ఈజ్ రహీమ్ ఖాన్' అనే వీడియో బ్లాగ్‌ను కొద్ది వారాల క్రితం ప్రసారం చేశాను. వెన్వెంటనే కరడుగట్టిన మితవాద హిందువులు నన్ను లక్ష్యంగా చేసుకుని తీవ్ర విమర్శనాస్త్రాలను సంధించారు. ఇస్లామిక్ తీవ్రవాదం పెచ్చరిల్లిపోతున్న తరుణంలో ఆ నిజమైన సమస్యతో తలపడడాన్ని తప్పించుకునేందుకే ముస్లింలను 'బాధితులు'గా చిత్రీకరిస్తున్నానని ఆక్షేపించారు. ఇప్పుడు వెనుతిరిగి పర్యాలోచించుకుంటే ఆ బ్లాగ్ శీర్షిక తప్పుగా పెట్టానని అనిపిస్తుంది. నేను ఆ వీడియో బ్లాగ్‌కు 'మై నేమ్ ఈజ్ అలీఖాన్ మహమూదాబాద్' అని పేరు పెట్టి ఉండవల్సింది.

భారత్, పాకిస్థాన్ ఘర్షణలకు సంబంధించి ఇరువురు మహిళా సైనికాధికారులు– కల్నల్ సోఫియా ఖురేషి, వింగ్ కమాండర్ వ్యోమికా సింగ్– మీడియా సమావేశం గురించి తన అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు పెట్టిన అశోకా యూనివర్శిటీ పొలిటికల్ సైన్స్ ప్రొఫెసర్ అలీఖాన్ మహమూదాబాద్‌ను ఇటీవల అరెస్ట్ చేశారు. అధికార రాజకీయ వ్యవస్థ ఎంత దారుణంగా వ్యవహరిస్తుందీ ఆ అరెస్ట్ ఉదంతం వెల్లడించింది. కల్నల్ సోఫియా ఖురేషీని టీవీ యాంకర్లు, వ్యాఖ్యాతలు ఘనంగా ప్రశంసించడాన్ని ప్రశ్నిస్తూ ఆపరేషన్ సిందూర్‌పై తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించడమే ప్రొఫెసర్ అలీఖాన్ చేసిన 'నేరం'! తన సోషల్ మీడియా పోస్ట్‌లో ఆయన ఇలా అన్నారు: 'కల్నల్ సోఫియా ఖురేషిని టీవీ వ్యాఖ్యాతలు ప్రశంసిస్తుండడం చూసి నాకు చాలా సంతోషంగా ఉంది. మరి వీరంతా మూకల హింసాకాండ, అకారణ బుల్డోజింగ్ బాధితులు, ఇంకా బీజేపీ ద్వేషపూరిత ప్రచార బాధితుల పక్షాన కూడా గళమెత్తితే వారికీ భారతీయ పౌరుల్లా రక్షణ లభిస్తుంది. ఇద్దరు మహిళా సైనికాధికారుల ద్వారా సమాచారం ఇవ్వడం ప్రశంసనీయమే. అయితే ఆ సమాచార వెల్లడి విధానం వాస్తవికంగా ఉండాలి. లేదంటే అది నయవంచనే అవుతుంది. తన లౌకికవాద నిబద్ధతను ఆ మహిళా సైనికాధికారుల ద్వారా చూపేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. అయితే క్షేత్ర స్థాయిలో సాధారణ ముస్లింలు దానికి భిన్నమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు'.

మోదీ ప్రభుత్వాన్ని అలీఖాన్ తీవ్రంగా విమర్శించారు, సందేహం లేదు. అయితే మోదీ సర్కార్ భావిస్తున్నట్టుగా ఆ వ్యాఖ్యల్లో భారతదేశ సార్వభౌమత్వం, ఐక్యత, సమగ్రతలకు అపాయం కలిగించేది ఏముంది? ఆ మాటకొస్తే మత విద్వేషాన్ని రెచ్చగొట్టేదీ ఏముంది? మహిళా సైనికాధికారుల గౌరవానికి భంగం కలిగించేది ఏముంది? ఎంతగా రెచ్చగొట్టేది అయినా ప్రభుత్వంపై చేసిన విమర్శను 'నేరపూరిత చర్య'గా ఎప్పటి నుంచి పరిగణిస్తున్నారు? అందునా బీజేపీ యువ మోర్చా కార్యకర్త అయిన ఒక గ్రామ సర్పంచ్ ఫిర్యాదు లేదా హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ పంపిన నోటీస్ ఆధారంగా అరెస్ట్ చేయడం న్యాయబద్ధమేనా?

మహిళా సైనికాధికారుల గౌరవానికి భంగం కలిగించే విషయాలు అలీఖాన్ సోషల్ మీడియా పోస్టులో ఏమున్నాయని ఒక టెలివిజన్ ఇంటర్వ్యూలో అడిగిన ప్రశ్నకు హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ అధ్యక్షురాలు రేణు భాటియా సరైన సమాధానమివ్వలేకపోయారు.. చాలా 'సర్కారీ' సంస్థల మాదిరిగానే హర్యానా రాష్ట్ర మహిళా కమిషన్ సైతం శీఘ్రగతిన అలీఖాన్‌కు వ్యతిరేకంగా అనాలోచిత నిర్ణయం తీసుకున్నది. 'అధికారిక' ఆదేశాల మేరకు అలీఖాన్‌కు సమన్లు జారీ చేసింది. లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని కూడా డిమాండ్ చేసింది. ఈ న్యాయ సమ్మతం కాని వ్యవహారంలో పోలీసులూ భాగస్వాములు అయ్యారు. ఒక పౌరుని ప్రాథమిక హక్కులను కాలరాచివేస్తున్నామనే ఆలోచన లేకుండా, యుక్తమైన ప్రక్రియను అనుసరించకుండా అలీఖాన్‌ను అరెస్ట్ చేశారు.

ప్రొఫెసర్ అలీఖాన్ కేసు అనేక ఇబ్బందికరమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. మొదటిది వాక్ స్వాతంత్ర్యాన్ని, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను అరికట్టేందుకు నిస్సిగ్గుగా అధికార దుర్వినియోగం జరిగింది. ఈ విషయంలో అలీఖాన్‌దే ఏకైక కేసు కాదు. కేంద్రంలో గానీ, రాష్ట్రాలలో గానీ పార్టీలకు అతీతంగా ప్రతి ప్రభుత్వమూ తన అధికారాలు, పోలీస్ వ్యవస్థపై నియంత్రణను తన విధానాలతో విభేదించేవారి గొంతులను నొక్కివేసేందుకు నిస్సంకోచంగా ఉపయోగించుకుంటోంది. రాష్ట్రాలలో చోటుచేసుకున్న అలాంటి అనుచిత చర్యలు కొన్నిటిని గుర్తు చేస్తాను. 2022లో ఎన్‌సీపీ అధినేత శరద్ పవార్‌ను అవహేళన చేసిన సోషల్ మీడియా పోస్ట్ నొకదాన్ని షేర్ చేసినందుకు మరాఠీ నటుడు కేటకి చితాలెను అరెస్ట్ చేశారు. తమిళనాడు అధికార పక్షాన్ని విమర్శించే యూ ట్యూబర్ సవుక్కు శంకర్ గృహంలోకి ఒక గుంపు చొరబడి చెత్త, అశుద్ధ పదార్థాలను కుప్పపోయడంపై డీఎంకే ప్రభుత్వం మౌనం వహించింది. మమతా బెనర్జీని పరిహసించిన ఒక కార్టూన్ విషయమై కోల్‌కతా ప్రొఫెసర్ ఒకరిని అరెస్ట్ చేశారు. 'మీకు వాక్ స్వాతంత్ర్యం ఉన్నది. అయితే మాట్లాడిన తరువాత మీ స్వేచ్ఛకు నేను హామీ ఇవ్వలేను' అన్న ఒకనాటి ఉగాండా నిరంకుశ పాలకుడు ఇడి అమీన్ ప్రవచనాన్నే భారత రాజకీయ వ్యవస్థ ఒక విధంగా అనుసరిస్తోంది!

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వంపై ఎలాంటి విమర్శలనైనా 'జాతి–వ్యతిరేక'మైనవిగా పరిగణించి, సదరు విమర్శకులపై దేశద్రోహ చట్టాలను ప్రయోగించడం పరిపాటి అయింది. కేంద్ర ప్రభుత్వాన్ని అనుసరించి పలు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా వివిధ చట్టాలను ప్రత్యర్థులపై ఆయుధాలుగా ప్రయోగిస్తున్నాయి. వాక్ స్వాతంత్ర్యాన్ని అణచివేసేందుకు చట్టాన్ని ఆయుధంగా వాడడమే కాదు, ఆ అధికార దుర్వినియోగానికి ఎంపిక చేసుకున్న కొద్ది మంది విషయంలో మాత్రమే పాల్పడుతున్నారు. వ్యతిరేకంగా ఉపయోగిస్తున్నారు. ఈ అవాంఛనీయ పరిణామం రెండవ తక్షణ సమస్యను లేవనెత్తుతోంది. నిర్దిష్ట చట్టం పరిధిలోకి ఎవరు వస్తారు అనేది పూర్తిగా అధికారంలో ఉన్నవారి చపలచిత్త వైఖరులు, భ్రమలపై ఆధారపడి ఉన్నది. ప్రొఫెసర్ అలీఖాన్ మహమూదాబాద్, మధ్యప్రదేశ్ రాష్ట్ర మంత్రి విజయ్ షా కేసుల మధ్య వ్యత్యాసాన్ని పరిగణనలోకి తీసుకోండి. కల్నల్ సోఫియా ఖురేషికి వ్యతిరేకంగా అవమానకరమైన, జెండర్ వివక్షాపూరిత, మత విద్వేషకరమైన వ్యాఖ్యలు చేసిన మహాశయుడు విజయ్ షా. మరి ఆయన్ని మంత్రి మండలి నుంచి తొలగించారా? లేదు. కనీసం మధ్యప్రదేశ్‌లోని బీజేపీ నాయకత్వం విజయ్ షాను బహిరంగంగా మందలించిందా? ఇదీ జరగలేదు. పైగా రాష్ట్ర పార్టీ నాయకులు అందరూ ఆయనకు బాసటగా నిలబడ్డారు. కేంద్రం మౌనం పాటించింది. అయితే విజయ్ షా లాంఛనప్రాయంగా క్షమాపణలు చెప్పారు. కల్నల్ సోఫియా ఖురేషీపై ఆయన వ్యాఖ్యలను మధ్యప్రదేశ్ హైకోర్టు సుమోటోగా స్వీకరించి ఎఫ్ఐఆర్ నమోదు చేయవల్సిందిగా రాష్ట్ర డీజీపీని ఆదేశించింది. సుప్రీంకోర్టు సైతం ఆయన వ్యాఖ్యలు 'జాతికి సిగ్గు చేటు' అని అభివర్ణించింది.

ఉన్నత న్యాయస్థానాలు ఇలా ప్రతిస్పందించిన తరువాతనే విజయ్ షా బహిరంగంగా క్షమాపణలు చెప్పారు. 'ఇటీవల నేను చేసిన ప్రకటన అన్ని వర్గాల మనోభావాలను దెబ్బతీసేలా ఉంది. అందుకు నేను చాలా సిగ్గుపడుతున్నాను. మనఃస్ఫూర్తిగా క్షమాపణలు కోరుతున్నానని' విజయ్ షా అన్నారు. మంత్రి వ్యాఖ్యలపై దర్యాప్తునకు కోర్టు ఆదేశం మేరకు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటయింది. అయితే ఢిల్లీ పోలీసులు ప్రొఫెసర్ అలీఖాన్‌ను అరెస్ట్ చేసిన విధంగా మధ్యప్రదేశ్ పోలీసులు విజయ్ షాను అరెస్ట్ చేయలేదు!

ఈ కారణంగానే అలీఖాన్ కేసులో మూడవ, మరింత అత్యవసరమైన ప్రశ్న ఉన్నది. ప్రొఫెసర్ అలీఖాన్ కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయం నుంచి డాక్టొరేట్ పొందిన విద్యాధికుడు. అయితే ఆయన తన భావాలు, అభిప్రాయాలను నిర్భయంగా వ్యక్తం చేసే భారతీయ ముస్లిం పౌరుడు. మరీ ముఖ్యంగా ఒకప్పటి మహమూదాబాద్ రాజకుటుంబానికి చెందినవాడు. ఆయన తాత మొహమ్మద్ ఆమిర్ అహ్మద్ ఖాన్ స్వాతంత్ర్యానికి పూర్వం ముస్లింలీగ్‌లో ఒక కీలక నాయకుడు. మరి హిందుత్వవాదులకు ఇంతకు మించి నిర్దుష్ట శత్రువు అయిన వ్యక్తి మరొకరు ఎవరుంటారు? భారతీయ ముస్లింలను దేశభక్తి లేనివారు, పాకిస్థాన్ అనుకూలురు, సంశయాస్పద స్వభావులుగా వేధించడమే హిందుత్వ సంస్థల, వ్యక్తుల ప్రాథమిక లక్ష్యంగా ఉన్నది. ముస్లిం కాని ప్రతిపక్ష నాయకుడు లేదా మీడియా ప్రముఖుడు ఎవరైనా ఆపరేషన్ సిందూర్‌పై ఇబ్బందికరమైన ప్రశ్నలు ఎన్ని లేవనెత్తినా ప్రభుత్వ ఆగ్రహానికి గురి కాకుండా సురక్షితంగా ఉండగలుగుతారు. అయితే తమ భావాలు, అభిప్రాయాలను స్పష్టంగా వ్యక్తం చేయగలిగే భారతీయ ముస్లింలు ఎవరికీ అటువంటి అనుమతి, స్వేచ్ఛ లేదు! ఈ కారణంగానే అలీఖాన్ చట్టవిరుద్ధ కార్యకలాపాలలో పాల్గొంటున్న వ్యక్తిగా పరిగణితుడయ్యాడు. ఆయన పాల్పడిన 'నేరం' ఏమిటి? దేశ చట్టాల ఉల్లంఘనకు కిందకు వచ్చే ఎలాంటి వ్యాఖ్యలనైనా చేయడం కానేకాదు; ప్రస్తుత ప్రభుత్వాన్ని నిర్భయంగా విమర్శించే భారతీయ ముస్లిం కావడమే ఆయన 'అపరాధం'. మత విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన విజయ్ షాపై చట్టపరమైన చర్యలు ఏవీ చేపట్టకపోవడానికి కారణం ఆయన పాలకపక్షంలో ప్రముఖ నాయకుడు కావడం వల్లే కాదూ? మీ ఇంటి పేరు షా కావడం, ఖాన్ కాకపోవడంలో ఉన్న వ్యత్యాసమది. ఒకరి విషయంలో క్షమాపణతో సరి, మరొకరి విషయంలో అరెస్ట్ అనివార్యమయింది! ఇదే 'న్యూ' ఇండియా సుమా!

తాజా కలం: ప్రొఫెసర్ అలీఖాన్‌కు తాత్కాలిక బెయిల్ మంజూరు చేస్తూ సుప్రీంకోర్టు ఆయన సామాజిక మాధ్యమాల పోస్ట్‌లపై దర్యాప్తునకు ఒక సిట్‌ను నియమించింది. ఈ ప్రత్యేక బృందం దర్యాప్తు చేసేది ఏమిటో స్పష్టంగా తెలియదు. పనిలేని పోలీసధికారులు చాలా మంది ఉన్నారని, విచారణ ప్రక్రియే శిక్షగా ఉన్న న్యాయవ్యవస్థ ఉన్నదని మనకు స్పష్టంగా తెలుసు.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

తెలుగు వద్దా.. సంస్కృతం ముద్దా..!

"పలికెడిది ఇంటర్మీడియట్ బోర్డట.. పలికించెడు వాడు.." ఎవరో తెలుసుకోవాల్సిన సమయం ఆసన్నమయింది. 2008లోనే కేంద్ర ప్రభుత్వం తెలుగు భాషకు 'ప్రాచీన హోదా' ప్రకటించింది. అట్లాంటి తెలుగు భాషపై కత్తి వేలాడదీస్తూ, సంస్కృతానికి రెడ్ కార్పెట్ పరుస్తూ తెలంగాణ ఇంటర్ బోర్డు ఈ సంవత్సరం ఏప్రిల్ 8న ఒక సర్క్యులర్ విడుదల చేసింది. అది తెలుగు భాషాభిమానుల్లో కలకలం రేపింది. ఆ కలకలానికి జవాబుగా 'ఇంటర్మీడియట్ స్థాయిలో తెలుగు భాషకొచ్చిన నష్టం ఏమీ లేదని' బోర్డు అధికారులు హామీ అయితే ఇచ్చారు కానీ, సదరు సర్క్యులర్‌ను ఉపసంహరించుకున్నట్లు ప్రకటించలేదు. మహారాష్ట్రలో మరాఠీని బలహీనపరచే యత్నాలు, తమిళనాడు స్కూళ్లలో మళ్ళీ హిందీని రుద్దే ప్రయత్నాలు ఎందుకు జరుగుతున్నాయి? తెలంగాణలో తెలుగుపై పరోక్ష యుద్ధానికి కారణమేమిటి? ఈ పరిణామాలన్నిటి వెనక వ్యూహం ఏదయినా ఉందా?

తెలుగు సాహిత్యంలో ఇప్పుడు అనువాద యుగం పరిఢవిల్లుతున్నది. ఒకప్పుడు శరత్, ప్రేమ్‌చంద్‌లు తెలుగువాళ్లేనా అనిపించేటట్లుగా బెంగాలీ నవలలను తెలుగీకరించేవారు. ఇప్పుడు దేశదేశాల సాహిత్యాన్ని, శాస్త్ర సాంకేతిక రంగాలలో నిపుణుల పరిశోధనలను తెలుగులోకి అనువదించే ప్రక్రియ ప్రయోజనకరంగా సాగుతున్నది. పుంఖానుపుంఖాలుగా మలయాళీ, తమిళ్, ఇంగ్లీష్, హిందీ ఇంకా ఎన్నో భాషల నుంచి సినిమాలు, నాటకాలు డబ్బింగ్ అయి టీవీలలో ప్రదర్శితమవుతున్నాయి. ఇంటర్నెట్ రంగంలో తెలుగు భాష దూసుకుపోతున్నది. ఈ రకంగా తెలుగు యువత ఉపాధి రంగంలో లబ్ధి పొందుతున్న ఈ తరుణంలో ఇంటర్ విద్యాధికారులు తెలుగు భాషకు ప్రత్యామ్నాయంగా సంస్కృతాన్ని ప్రోత్సహించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

స్థానిక, దేశీయ భాషలపై ఇది వ్యూహాత్మక దాడి. విభిన్న సాంస్కృతిక సంపదతో దేశంలో అనేక భాషలు అలరారుతున్నాయని వీటన్నింటికీ గుర్తింపు లభించాలన్న లక్ష్యంతో ఏడు దశాబ్దాల క్రితం భాషాప్రయుక్త రాష్ట్రాలకు శ్రీకారం చుట్టింది భారత ప్రభుత్వం. భాష ద్వారానే సాంస్కృతిక వికాసం వ్యక్తమవుతుందన్న శాస్త్రీయ భావనతో భాషకు విద్యావ్యవస్థలో సమున్నత స్థానం కల్పించారు విద్యారంగ నిపుణులు. ప్రభుత్వ పాలనలో ముఖ్య అంశం స్థానిక భాష. ఇంటర్మీడియెట్, ఆ పై చదివే విద్యార్థులలో అధిక సంఖ్యాకులు భవిష్యత్తులో ప్రభుత్వ యంత్రాంగంలో భాగమవుతారు. వారు సామాన్య ప్రజలతో సంబంధాలు కొనసాగించాలన్నా, ప్రజల వద్దకు పాలనా ఫలితాలను చేర్చాలన్నా స్థానిక భాష అతి ముఖ్యం. తెలంగాణ స్థానిక భాష అయిన తెలుగును కాదని, రాష్ట్రంలో, దేశంలో ఎక్కడా వ్యావహారిక భాషగా లేని సంస్కృతానికి పెద్దపీట వేయడానికి ఇంటర్మీడియట్ బోర్డు సాహసించిందంటే ఇందులో మర్మం ఏమిటో ప్రజలకు తెలియాలి. దేశ వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి, భారతదేశ భవిష్యత్తు తరగతి గదులలోనే నిర్మితమవుతుందని ప్రవచించిన కొఠారి, తదితర కమిషన్లు దేశీయ భాషలను ప్రోత్సహించాలని సిఫారసు చేశాయి. అలాగే హిందీ మాట్లాడే రాష్ట్రాలలో దక్షిణాదిలో మాట్లాడే భాషను ఒకదానిని పాఠ్యప్రణాళికలో భాగం చెయ్యాలని సూచించింది. భిన్నత్వంలో ఏకత్వం సాధించడం ఈ సూచన వెనక ఉన్న ఉద్దేశ్యం. అలాగే ఇంటర్మీడియట్ స్థాయిలో సంస్కృతాన్ని ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యం వెనక ఉన్న విద్యా పరమార్థం ఏమిటో విద్యాభిమానులకు తెలియజెప్పాల్సిన అవసరం, బాధ్యత ఇంటర్ బోర్డు అధికారులకు ఉంది. ఈ విషయంలో తెలంగాణ విద్యా కమిషన్ తన అభిప్రాయం ఏమిటో కూడా స్పష్టం చెయ్యాలి.

సంస్కృతంపై అమితమైన ప్రేమ ఉంటే, తెలంగాణ ఇంటర్మీడియట్ విద్యాధికారులు ఆ పరీక్షను ఖచ్చితంగా దేవనాగరి లిపిలోనే రాయాలన్న నిబంధన ఎందుకు విధించరు? ఏ భాషలో పరీక్ష ఆ భాషలోనే రాయాలి, కానీ సంస్కృతం పరీక్ష మాత్రం తెలుగులో అయినా, ఇంగ్లీష్‌లో అయినా రాసుకోవచ్చుట! ఇంతకంటే హాస్యాస్పదమైన నియమం ఇంకొకటి ఉండదు.

– రాజేంద్రబాబు అర్విణి
పూర్వ అధ్యక్షుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్ల సంఘం

యువత భవితకు 'ఇంటర్న్‌షిప్' ఊతం

నూట నలభై ఐదు కోట్ల పైచిలుకు జనాభాలో అలరారుతున్న దేశం మనది. వీరిలో తొంభై కోట్లకు పైగా యువత ఉన్నారు. వీరంతా ముప్పై ఐదు సంవత్సరాల లోపువారే. ప్రపంచంలోని ఏ ఇతర దేశానికి లేని యువ సంపద మన సొంతం. కాని, చదివిన చదువులకు తగిన పని అనుభవం కలిగినవారు ఎందరు? గణాంకాలు కలవరపాటుకు గురిచేస్తాయి. ఏళ్ళ తరబడి చదువులు చదువుతూ, స్వల్పకాలంలో పని అనుభవాన్ని సాధించగలిగే నైపుణ్యాలను వృద్ధి చేసుకోడంలో యువత ఎందుకు వెనకబడుతున్నారన్నది అందరూ ఆలోచించాలి.

'జాతీయ విద్యావిధానం–2020' యువతకు ఉద్యోగ అవకాశాలను పెంచడానికి ఇంటర్న్‌షిప్‌లను వారి చదువులలో భాగం చేసింది. ఇది యువతలో ఆరోగ్యకర పోటీని పెంచటంతోపాటు, వివిధ రకాలైన ఉద్యోగ నైపుణ్యాలను పెంపొందించడానికి సహకరిస్తుంది. వివిధ వృత్తులు, ఉద్యోగాలు, పరిశోధనల్లో ఆసక్తిని పెంపొందించడానికి ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో దోహదం చేస్తాయి. జాతీయ విద్యావిధానం మూడు రకాలైన ఇంటర్న్‌షిప్‌లపై దృష్టి పెట్టాలని విద్యాలయాలకు సూచించింది. వారానికి రెండు నుంచి నాలుగు క్రెడిట్ల బోధన, అభ్యసన గంటలను ఇంటర్న్‌షిప్‌లకు కేటాయించాలని విధానపత్రం సూచిస్తోంది.

ఇంటర్న్‌షిప్‌లలో మొదటిరకం వృత్తి నైపుణ్యాలను వృద్ధి చేసుకోడానికి సంబంధించినది. పరిశ్రమలు, కార్యాలయాలతో అనుసంధానమై విద్యార్థులు దీనిని పూర్తి చేయాలి. రెండవది, తాము చదువుతున్న సబ్జెక్టులో పరిశోధన నైపుణ్యాలను వృద్ధి చేసుకోడానికి సంబంధించింది. చదువుకొంటున్న విద్యాలయంలోని ఆచార్యుల పర్యవేక్షణలో ఉంటూ విద్యార్థి పరిశోధన ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేయాలి. ఇందుకోసం, ఇతర విద్యాలయాలు, పరిశోధన సంస్థలతో కూడా కలసి పనిచేయవచ్చు. మూడవది, సమాజంతో మమేకమై పనిచేయడం. సమాజం పట్ల సానుకూలమైన దృక్పథాన్ని యువతలో పెంపొందింప చేయడానికి ఇది మేలైన మార్గం. ప్రజాప్రయోజనం కోసం పనిచేసే వ్యక్తులు, సంస్థలు, కార్యాలయాలు, ప్రభుత్వ శాఖలు... మొదలైన వాటితో కలిసి పనిచేస్తూ సమాజ చలనసూత్రాలను నేరుగా అధ్యయనం చేసే వీలు దీని ద్వారా యువతకు లభిస్తుంది. ఈ మూడు రకాలైన ఇంటర్న్‌షిప్‌లలో దేనిని ఎంచుకోవాలన్నది విద్యార్థుల అభిరుచిపై ఆధారపడి ఉంటుంది.

కళలు, సాహిత్య రంగాలు, సామాజిక శాస్త్రాలు, వృత్తివిద్య, విజ్ఞాన శాస్త్రాలు వంటి అన్ని రంగాలలోను, అన్నిరకాల చదువులలోను ఇంటర్న్‌షిప్‌లను భాగం చేయాలని యూజీసీ మార్గదర్శక సూత్రాలు తెలియజేస్తున్నాయి. స్థాయికి అనుగుణంగా యువతకు ఉన్న ఉపాధి అవకాశాలను పెంచడం దీనిలో గుర్తించదగిన ఒక ప్రధానమైన అంశం. ఒక తరగతి చదివే విద్యార్థులంతా మూస పద్ధతిలో ఒకే రకమైన ఇంటర్న్‌షిప్‌ను ఎంచుకోవలసిన అవసరం లేదు. ఏఏ ఇంటర్న్‌షిప్‌లను ఎంతమంది చేయాలనుకొంటున్నారో విద్యార్థులు, ఆచార్యులు కలిసి నిర్ణయించుకోవచ్చు. డిగ్రీ పూర్తయ్యేలోపు ఇటువంటి ఇంటర్న్‌షిప్‌లలో ఏ ఒక్కటైనా పూర్తి చేయాలని విధానపత్రం నిర్దేశిస్తోంది.

> **ఇంతకు ముందుకాలాల్లో లేని ఎన్నో విద్యావకాశాలను జాతీయ విద్యావిధానం ఇప్పటి యువతకు అందిస్తోంది. విద్యార్థి దశలో చేసే ఇంటర్న్‌షిప్‌లు వారి మూర్తిమత్వ వికాసంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తాయి. బృందంగా ఏర్పడి పనిచేయడానికి తగిన కౌశలాలను పెంచుతాయి. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నవీకరణ చెందడానికి, సమతుల్యాన్ని సాధించడానికి ఇంటర్న్‌షిప్‌లు సహకరిస్తాయి.**



ఒకప్పుడు సైన్సు, ఇంజనీరింగ్, సాంకేతిక విద్యలకు సంబంధించిన కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులు మాత్రమే ఇంటర్న్‌షిప్‌లను పూర్తి చేసేవారు. ఇప్పుడు అన్ని రకాల చదువులు చదివే విద్యార్థులు చేయదగిన అంశాలు ఇబ్బడిముబ్బడిగా అందుబాటులో ఉన్నాయి. తాము మంచి వ్యక్తులుగా ఎదగడమే కాకుండా, సమాజాన్ని వృద్ధిచేయడానికి కావలసిన నైపుణ్యాలను ఎన్నిటినో ఇంటర్న్‌షిప్‌ల ద్వారా యువత సాధించుకోవచ్చు. వీటిని అందుకోడానికి యువత తమను తాము ఎంతగా సమాయత్తం చేసుకొంటే మన సమాజాలు అంతగా వృద్ధి చెందుతాయి.

ఇంతకు ముందుకాలాల్లో లేని ఎన్నో విద్యావకాశాలను జాతీయ విద్యావిధానం ఇప్పటి యువతకు అందిస్తోంది. డిగ్రీలు పూర్తయ్యేవరకు విద్యార్థులకు ఆయా విషయాల్లో పని అనుభవం లేకపోతే ఉద్యోగాల కల్పన కష్టం అవుతుంది. అందుకే ఏఐసీటీఈ వంటి సంస్థలు సాంకేతిక విద్యకు సంబంధించి నమూనా ప్రణాళికలను అందిస్తున్నాయి. వీటి ఆధారంగా ఆయా రాష్ట్రాలు తగిన కార్యాచరణను ప్రారంభిస్తున్నాయి. కృత్రిమమేధ, సైబర్ సెక్యూరిటీ, మెషిన్ లెర్నింగ్... వంటి అంశాలలో పాఠశాల స్థాయినుంచి తర్ఫీదును ఇచ్చేందుకు కొన్ని రాష్ట్రాలలో ప్రణాళికలు సిద్ధం అవుతున్నాయి. సంబంధిత సంస్థలు, పరిశ్రమలతో అవగాహన ఒప్పందాలను చేసుకొని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో చదువుకొంటున్న విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు అందించడానికి సిద్ధం అవుతున్నాయి. మరికొన్ని విద్యాసంస్థలు మరో అడుగు ముందుకేసి అంతర్జాతీయ పరిశోధన సంస్థలు, పరిశ్రమలతో ఇంటర్న్‌షిప్‌ల కోసం అవగాహన ఒప్పందాలను చేసుకొంటున్నాయి.

విద్యార్థి దశలో చేసే ఇంటర్న్‌షిప్‌లు వారి మూర్తిమత్వ వికాసంలో గణనీయమైన మార్పులను తీసుకువస్తాయి. బృందంగా ఏర్పడి పనిచేయడానికి తగిన కౌశలాలను పెంచుతాయి. వ్యక్తిగతమైన బలహీనతలను అధిగమించి, సామూహికమైన బలాలను ప్రజోపయోగ్యమైన రీతిలో వాడే అవకాశం చిక్కుతుంది. తమ ప్రతిభను ఏయే రంగాలలో సానపెట్టుకోవచ్చో యువతకు అనుభవంలోకి వస్తుంది. విభిన్నమైన పని వాతావరణాలు, పని సంస్కృతులపై అవగాహన, గౌరవం పెంచుకోడానికి ఇంటర్న్‌షిప్‌లు ఎంతగానో సహకరిస్తాయి. సాధించిన నైపుణ్యంతో ఎక్కడైనా గెలవవచ్చనే ధీమా పెరుగుతుంది. మారుతున్న ప్రపంచానికి అనుగుణంగా నవీకరణ చెందడానికి, సమతుల్యాన్ని సాధించడానికి ఇంటర్న్‌షిప్‌లు సహకరిస్తాయి.

సమాజ వృద్ధికి దోహదపడే నిర్ణయాలు తీసుకోడానికి ఇంటర్న్‌షిప్‌లలో పొందే పని అనుభవం యువతకు ఎంతగానో సహకరిస్తుంది. స్పష్టమైన ఆలోచనలతో ముందుకు సాగే స్థైర్యాన్ని ఇంటర్న్‌షిప్‌లు కలిగిస్తాయి. బృందంలో కలిసి పని చేయగలగడంతోపాటు, నాయకత్వ లక్షణాలు అలవడతాయి. నైతిక విలువల ఆధారంగా సమాజవృద్ధికి సహకరించే సృజనాత్మక ఆలోచనలకు ఇంటర్న్‌షిప్‌లు సహకరిస్తాయి. తాము ఎంచుకున్న రంగంలో, తమతో కలిసి పనిచేస్తున్న సహచరులతోపాటు, ఆ రంగంలో నిష్ణాతులైన పండితుల వరకు ఉన్నవారందరితో మంచి సంబంధాలు ఏర్పడతాయి.

పాఠశాల, కళాశాల విద్యను పూర్తిచేసిన యువతకు ఉద్దేశించిన ఇంటర్న్‌షిప్‌ల కోసం కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కార్పొరేట్ వ్యవహారాల శాఖ ఇటీవలే ప్రకటన వెలువరించింది. ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకంగా పిలుచుకునే దీనిలో ఎంపికైన యువతకు నెలకు ఐదువేల రూపాయల భృతి లభిస్తుంది. నేర్చుకున్న అంశాలను పని అనుభవం ద్వారా పదునుపెట్టుకోవడానికి ఇది యువతకు అందివచ్చిన ఒక గొప్ప అవకాశం. ఒక సంవత్సరం వ్యవధిలో సాగే ఈ ఇంటర్న్‌షిప్‌లో అభ్యర్థికి ఆరునెలలపాటు ఉద్యోగ శిక్షణ ఉంటుంది.

ఉన్నత పాఠశాల విద్య, డిగ్రీ, పీజీ వంటి కోర్సులు చదివే విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు చేయడానికి ఇంటర్న్‌శాల అనే ఆన్‌లైన్ వేదిక అవకాశాలను అందిస్తోంది. ఇంటర్న్‌షిప్‌లు చేయాలనుకొనే విద్యార్థులకు, అవి అందించే వ్యవస్థలకు సంస్థలకు ఉమ్మడి ఆన్‌లైన్ వేదిక 'ఇంటర్న్‌శాల'. దీనిలో రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు ఇంటర్న్‌షిప్‌లు అందించే కార్యాలయాలు, సంస్థలతో నేరుగా అనుసంధానాన్ని పొందవచ్చు. వివిధ ఉద్యోగాల కోసం కావలసిన నైపుణ్యాలను వృద్ధిచేసే అనేకమైన స్వల్పకాలిక కోర్సులను కూడా దీని ద్వారా చేయవచ్చు. ఇంటర్న్‌శాల అందించే ఇంటర్న్‌షిప్‌లలో వైవిధ్యం ఎక్కువ. వివిధ కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులు, స్వల్పమైన వృత్తి నైపుణ్యాలు కలిగినవారు నేరుగా ఉద్యోగాలలో చేరడానికి వీలుగా కొన్ని సంస్థలు దీనిలో అవకాశాన్ని కల్పిస్తున్నాయి. జీవితమనే బండి పట్టాలపై సాఫీగా సాగిపోవాలంటే పట్టాలిచ్చే చదువులు మాత్రమే చాలవిప్పుడు. పని అనుభవాన్ని కూడా తోడుపెట్టినప్పుడే సాధించిన పట్టాలకు సార్థకత. యువత తక్షణం దృష్టిసారించవలసిన విషయం ఇది.

■ ఆచార్య పమ్మి పవన్‌కుమార్
డిపార్ట్‌మెంట్ ఆఫ్ తెలుగు, హెచ్‌సీయూ


అమృత్ పథకం కింద అభివృద్ధి చేసిన వరంగల్ రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ



రైల్వేస్టేషన్లను ఎయిర్‌పోర్టులుగా తీర్చిదిద్దాం

- ప్రయాణికులు పరిశుభ్రతను పాటించాలి..
- త్వరలోనే కాజీపేట రైల్వేస్టేషన్‌లో అమృత్ సేవలు
- కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ
- వర్చువల్ ద్వారా ప్రారంభించిన ప్రధాని మోదీ

అట్టహాసంగా అమృత్ వరంగల్ రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవం 6


బోనాల కిషన్, రాయల ప్రభాకర్‌రావు

కమిషనరేట్‌కు ఇద్దరు అదనపు డీసీపీలు

వరంగల్ క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు అదనపు డీసీపీలుగా బోనాల కిషన్, రాయల ప్రభాకర్‌రావులను నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా అడ్మిన్ అడిషినల్ ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న బోనాల కిషన్‌ను ఆపరేషన్ అండ్ క్రైం అదనపు డీసీపీగా, ఆసిఫాబాద్ అడ్మిన్ అదనపు ఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్న రాయల ప్రభాకర్‌రావును లాఅండ్‌ఆర్డర్ అండ్ ట్రాఫిక్ విభాగం అదనపు డీసీపీగా ప్రభుత్వం నియమించింది. కాగా, గతంలో ఇద్దరు అధికారులు వరంగల్ పోలీస్ కమిషనరేట్‌తో పాటు ఉమ్మడి జిల్లాలో వివిధ హోదాల్లో సుదీర్ఘకాలంగా పని చేశారు.

బ్యాంకుకే బురిడీ

- నకిలీ బంగారం తాకట్టు
- మేనేజర్ ఫిర్యాదుతో వ్యక్తి అరెస్టు



నిందితుడిని అరెస్టు చూపుతున్న పోలీసులు

హనుమకొండ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో నకిలీ బంగారం తాకట్టు పెట్టి మోసం చేస్తున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు సుబేదారి సీఐ పి.సత్యనారాయణరెడ్డి తెలిపారు. వరంగల్‌లోని పల్లగుట్ట ప్రాంతానికి చెందిన వెణుముద్దుల సతీష్‌రెడ్డి, తాళ్లపెల్లి ప్రవీన్ అనే మరో వ్యక్తితో కలిసి నకిలీ బంగారాన్ని నిజమైన బంగారంగా నమ్మిస్తూ వివిధ బ్యాంకుల్లో, ఫైనాన్స్ కంపెనీల్లో తాకట్టు పెట్టి వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఇటీవల హనుమకొండలోని సెంట్రల్ బ్యాంకు మేనేజర్ ముత్యాల మురళి నకిలీ బంగారంపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. నకిలీ బంగారాన్ని గుర్తించడానికి వీలుకాకుండా బంగారంపై పోతపోసి లోపల సీసంతో నింపి ఉండడంతో గుర్తించడానికి కష్టంగా మారినట్లు తెలిపారు. పోలీసులు ప్రత్యేక టీంలుగా ఏర్పడి నిందితులైన తాళ్లపెల్లి ప్రవీణ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తులో ప్రతిభను కనబరిచిన ఎస్సై మహేందర్‌రెడ్డి, క్రైం కానిస్టేబుల్ ప్రభాకర్‌లను సీఐ అభినందించారు.


పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

జై హనుమాన్

- జయంతి వేళ ప్రణమిల్లిన ఓరుగల్లు
- వేయిస్తంభాల ఆలయంలో మహాపూర్ణాహుతి 8



- 2015 నాటి దరఖాస్తులకు కలగని మోక్షం
- కుడాలో ఇప్పటికీ పెండింగ్‌లో 3 వేల దరఖాస్తులు
- మొత్తం ఫీజు చెల్లించినవారి ఫైళ్లు మాత్రమే క్లియర్
- రూ.10 వేలు ఫీజు కట్టినవారివి మూలకు పడేసిన వైనం
- పరిష్కరించలేమని చేతులెత్తేసిన కుడా అధికారులు
- అయోమయంలో దరఖాస్తుదారులు

మా సంగతేమిటి?!

త్రిశంకు స్వర్గంలో పాత ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు

హనుమకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ కోసం 2015 నుంచి 2020 మధ్య కాలంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా) కార్యాలయంలో రూ.10వేలు కట్టి దరఖాస్తులు చేసుకున్నవారి పరిస్థితి అయోమయంగా ఉంది. వారి దరఖాస్తులు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. ప్రస్తుతం అమలులో ఉన్న కొత్త విధానం కింద మరోసారి దరఖాస్తు చేసుకునే అవకాశ మూ లేదు. దీంతో ఈ దరఖాస్తుదారులంతా అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. తమ సమస్యకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇలాంటి దరఖాస్తులు కుడా కార్యాలయంలో సుమారు మూడువేల వరకు మూలుగుతున్నాయి. పూర్తి రుసుము కట్టినవారి దరఖాస్తులనే కుడా పరిష్కరిస్తోంది. ఇవికూడా చాలావరకు పెండింగ్‌లో ఉన్నాయి. పదేళ్లవుతున్నా కుడాలోని ఎల్ఆర్ఎస్ దరఖా స్తులకు ఇప్పటి వరకు మోక్షం లభించకపోవడంతో దరఖాస్తుదారులంతా కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

పదేళ్ల కిందట

అనుమతి లేని లేఔట్ల ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం తొలుత 2015లో అవకాశం కల్పించింది. ఇందుకోసం భూ క్రమబద్ధీకరణ పథకాన్ని (ఎల్ఆర్ఎస్) తీసుకువచ్చింది. ఈ మేరకు 2015 నవంబర్ 2న జీవో నెంబరు 151 జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు పెద్ద సంఖ్యలో ముందుకు వచ్చారు. నగరం, దాని చుట్టుపక్కల కుడా పరిధిలోని ప్రాంతాల నుంచి 30వేలకుపైగా దరఖాస్తులు దాఖలయ్యాయి. ఎల్ఆర్ఎస్ చేసే బాధ్యతను ప్రభుత్వం పట్టణాభివృద్ధి సంస్థలకే ప్రభుత్వం అప్పగించింది. దీంతో ఈ దరఖాస్తులను పరిష్కరించే బాధ్యత కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ మీదే పడింది. దరఖాస్తుల దాఖలు సందర్భంగా కుడా రూ.10వేల చొప్పున, దరఖాస్తు పరిష్కారమైన తర్వాత మిగతా డబ్బును వసూలు చేసింది. దీనితో స్థల విస్తీర్ణాన్ని బట్టి లక్షల రూపాయలను దరఖాస్తుదారులు చెల్లించారు. ఎల్ఆర్ ఎస్ కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు లను దాఖలు చేశారు. లైసెన్సుడ్ సర్వేయర్ల సహకారంతో పూర్తి వివరాలను, ఇతర సంబంధిత పత్రాలను అందచేశారు.

అయోమయం

వెబ్‌సైట్ మూసివేయడంతో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి? వాటి పరిస్థితి ఏమిటి? తెలిసే అవకాశం లేకుండా పోయింది. అన్ని సక్రమంగా ఉన్నాయని తేల్చిన దరఖాస్తుదారులకు మొదట్లో కట్టిన రూ.10వేలకు అదనంగా మార్కెట్ విలువను బట్టి మిగతా రెగ్యులరైజేషన్ చార్జీలను చెల్లించాలని కుడా నోటీసులు పంపింది. ఈ తాఖీదులు అందుకున్నవారిలో చాలామంది నిర్దేశిత మొత్తాన్ని చెల్లించారు. అవి కూడా ఇప్పటివరకు పరిష్కారం కాలేదు. చార్జీలనైతే కుడా అధికారులు కట్టించుకున్నారు కానీ అనేకమందికి ప్రొసీడింగ్స్ ఇవ్వకుండా తాత్సారం చేస్తూ వచ్చింది. షార్ట్‌ఫాల్ పేరుతో తొక్కిపెడుతూ వచ్చారు. ముడుపులు ఇచ్చినవారివి మాత్రం క్షణాల మీదే క్లియర్ చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చారు.

విఫలమైన కుడా

సిబ్బంది కొరత, ఆశ్రితపక్షపాతం, అవినీతి వల్ల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించడంలో కుడా విఫలమైంది. క్షేత్ర స్థాయిలో స్థలాలను పరిశీలించి దరఖాస్తులను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. ముడుపులు ఇస్తేనే పని అన్న చందంగా వ్యవహరించడంతో దరఖాస్తుల పరిష్కారంలో తీవ్రజాప్యం చోటు చేసుకున్నది. 2020 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతూనే వచ్చింది. అప్పటి వరకు ఇంకా వేలల్లో దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉన్నాయి. ఆ తర్వాత వెబ్‌సైట్ మూసివేయడంతో దరఖాస్తులు అటకెక్కాయి. దరఖాస్తుదారులు అయోమయంలో పడ్డారు.

ఫీజు మొత్తం చెల్లించినవారివే..

రెగ్యులరైజేషన్ చార్జీలను మొత్తం చెల్లించినవారి దరఖాస్తులను మాత్రమే పరిష్కరిస్తున్నామని కుడా అధికారులు చెబుతున్నారు. డబ్బులు పూర్తిగా కట్టిన వారికి రెగ్యులరైజేషన్ కోసం నోటీసులు పంపినా స్పందనా లేదని కుడా అధికారులు చెబుతుండగా, తమకు ఎలాంటి నోటీసులు అందలేదని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ఏడు డాక్యుమెంట్లు- రిజిస్ట్రేషన్ డీడ్, ఎల్ఆర్ఎస్ ప్లాన్, మార్కెట్ వాల్యుయేషన్ పత్రం, ఇండెమ్నిబాండ్, అండర్‌టేకింగ్, తాజా ఎంకంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ)ని ఒక దరఖాస్తుతో పాటు జత చేసి మరోసారి సమర్పిస్తే ఎల్ఆర్ఎస్ చేస్తామని చెబుతున్నారు. అవన్నీ దాఖలు చేసినా చేయడం లేదని, ముడుపులు ఇస్తేనే పనవుతున్నదని దరఖాస్తుదారులు వాపోతున్నారు.

రూ.10వేలు చెల్లించినవారు..?

ఎల్ఆర్ఎస్ కోసం 2020లో రూ.10వేలు చెల్లించిన మా పరిస్థితి ఏమిటని దరఖాస్తుదారులు వాపోతున్నారు. తమ దరఖాస్తులను కుడా పక్కన పడేసింద ని, పరిష్కారించాలని అడిగితే వెబ్‌సైట్ మూసేసి నందువల్ల సాధ్యం కాదని చేతులెత్తేస్తున్నారని అం టున్నారు. ఇలాంటి వారు మూడువేల మందికిపై గానే ఉంటారు. వీటి విషయంలో ప్రభుత్వం నుంచి ఏవైనా మార్గదర్శకాలు వస్తే తప్ప తామేమీ చేయలేమంటున్నారు. కొత్తగా దాఖలైన దరఖాస్తులతో కలిపి పాత వాటిని పరిష్కరించడం కొత్త విధానం ప్రకారం వీలుకాదని చెబుతున్నారు. రూ.10వేలు తిరిగి చెల్లించే అవకాశం లేదని, వాటిపై ఆశలు వదులుకోవలసిందేనని అంటున్నారు. ఎల్ఆర్ఎస్ కోసం తాజాగా దరఖాస్తు చేసుకునే అవకాశం కూడా లేదు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారు తిరిగి చేసుకోరాదని ప్రభుత్వం స్పష్టం చేసింది. దీనితో వీరి పరిస్థితి త్రిశంకు స్వర్గంలా మారింది. 2020లో జారీ అయిన జీవోకు సవరణ చేస్తే తప్ప పాత దరఖాస్తులకు మోక్షం లభించే అవకాశం లేదు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో చింతగట్టు వాసి

- పీజీ చదువుతూ 2016లో పోరుబాట పట్టిన బూర రాకేశ్
- మావోయిస్టు అగ్రనేత కేశవరావు వద్ద కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు


బూర రాకేశ్ (ఫైల్)

హసన్‌పర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా మాడ్ అటవీ ప్రాంతం లో గురువారం జరిగిన ఎదు రుకాల్పుల్లో 26మంది మావోయిస్టులు మృతి చెందగా, వారిలో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన బూర రాకేశ్(32) అలియాస్ వివేక్ మృతి చెందాడు. ఈ విషయాన్ని చత్తీస్‌గఢ్ పోలీసులు ప్రకటిం చారు. ప్రస్తుతం రాకేష్ మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు అలి యాస్ బసవరాజ్ వద్ద కంప్యూటర్ అపరేటర్‌గా పనిచేస్తున్నట్లు తెలిసింది. చింతగట్టుకు చెందిన బూర బాబు-స్వరూప

మిగతా 8వ పేజీలో...


చింతగట్టులోని రాకేష్ తల్లిదండ్రులు ఉంటున్న ఇల్లు, రాకేష్ తండ్రి బాబు

ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

- ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి
- ప్రజా సంఘాల ప్రతినిధుల డిమాండ్ 8


పుష్కరిణికి హారతి ఇస్తున్న కాశీ పండితులు


పూజలు చేస్తున్న ఎంపీ ఈటల రాజేందర్


త్రివేణి సంగమంలో పుష్కర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

సరస్వతి పుష్కరం.. సకల పాప హరం..

పుష్కర స్నానానికి పెరుగుతున్న భక్త జన సందోహం

- 8వ రోజు లక్షమందికి పైగా పుణ్యస్నానాలు
- వర్షాన్ని సైతం లెక్కచేయని భక్త జనం
- 5 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్
- వన్‌వే చేసినా, పార్కింగ్ స్థలం లేక నిష్ప్రయోజనం

7



జీవవైవిధ్య పరిరక్షణ పురస్కారం అందుకుంటున్న పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక ప్రతినిధులు

యూఎఫ్ఈపీకి జీవవైవిధ్య పురస్కారం

హనుమకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక (యూపీఎఫ్ఈపీ)కు జీవవైవిధ్య పరిరక్షణ పురస్కార ప్రదానం జరిగింది. ప్రపంచ జీవవైవిధ్య దినం పురస్కరించుకొని హైదరాబాద్‌లోని బిర్లా సైన్స్ సెంటర్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని తెలంగాణ జీవ వైవిధ్య మండలి సెక్రెటరీ కాళీచరణ్, కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్టు ప్రిన్సిపల్ సెక్రెటరీ డాక్టర్ సి.సువర్ణ చేతుల మీదుగా యూపీఎఫ్‌పీ అధ్యక్షుడు కె.పురుషోత్తం, ప్రధాన కార్యదర్శి టి.శ్రవణ్‌కుమార్, ఈసీ మెంబర్ శ్రీనివాస్ ఈ పురస్కారాన్ని అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణకు కొన్నేళ్లుగా పర్యావరణ పరిరక్షణ ఐక్యవేదిక చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డును ప్రదానం చేశారు. హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలంలోని ఇనుపరాతి గట్టు అటవీ ప్రాంత పరిరక్షణకు ఈ ఐక్య వేదిక విశేషమైన కృషి చేస్తోంది. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతను విద్యార్థులకు తెలియ చేసేందుకు పాఠశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. పర్యావరణంపై విద్యార్థులకు పోటీలను నిర్వహిస్తోంది. ప్రపంచ పర్యావరణ దినం, ప్రపంచ ధరిత్రి దినం, ప్రపంచ జీవవైవిధ్య దినం తదితర సందర్భాల్లో ర్యాలీలు, వాకథాన్‌లను జరుపుతోంది.

గ్రామదేవతలు సంస్కృతికి ప్రతిబింబాలు

శాసనమండలి డిప్యూటీ వైస్ చైర్మన్ బండా ప్రకాశ్

చిలుపూర్, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ దేవతలు తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబాలని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. గురువారం జనగామ జిల్లా చిలుపూర్ మండలంలోని కృష్ణాజీగూడెంలో నిర్వహిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ పదో వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, అనంతరం మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారం కోసం ముదిరాజ్‌లంతా ఐక్యంగా ఉండాలన్నారు. ఆలయ ప్రహరీ నిర్మాణానికి తనవంతు సహకారమందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు పోలు రఘు, ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు కండ్లకోలు శ్రీనివాస్, నాయకులు ఊరడి శ్రీనివాస్, యాదగిరి, పోలు సంపత్, ఊరడి రాజు, సాంబరాజు, రమేష్, ఊరడి మల్లేష్, మహేశ్, పోలు శ్రీనివాస్, నేరడి బొందిరాజు పాల్గొన్నారు.



కృష్ణాజీగూడెం పెద్దమ్మతల్లి ఆలయంలో శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

జనగామలో...

జనగామ కల్చరల్: జనగామ జిల్లా కేంద్రంలోని సంజయనగర్‌లో పెద్దమ్మ తల్లి 12వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవానికి తెలంగాణ శాసన మండలి డిప్యూటీ చైర్మెన్ బండా ప్రకాశ్ ముఖ్యఅతిథిగా హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు పల్లెబోయిన అశోక్, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా అధ్యక్షుడు నీల రాజు, పిట్టల కుమార్, నీల యాదగిరి, కాతాల అజయ్, ముప్పిడి మల్లేశం, దండు ఉపేందర్, పిట్టల సరేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీవో పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- పరీక్ష రాయనున్న 330 వీఆర్‌వోలు, వీఆర్ఏలు
- హనుమకొండ జిల్లాలో 132 మంది
- వరంగల్ జిల్లాలో 198 మంది
- రెండు పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- జారీ అయిన హాల్ టికెట్లు



హనుమకొండ, మే 22 (ఆంధ్రజ్యోతి): గ్రామ రెవెన్యూ వ్యవస్థ బలోపేతంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తెరపైకి తెచ్చిన గ్రామ పాలన అధికారి (జీపీవో) నియామక పరీక్షకు రంగం సిద్ధమైంది. జీపీవోలుగా నియామకానికిగాను తిరిగి మాతృశాఖకు వచ్చేందుకు పూర్వ వీఆర్‌వో, వీఆర్ఏలకు ఐచ్ఛికానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆన్‌లైన్‌లో వీరి నుంచి దరఖాస్తులను కోరింది. ఈ మేరకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 25న రాత పరీక్ష నిర్వహించనున్నారు. వరంగల్ జిల్లాలో 198 మంది, హనుమకొండ జిల్లాలో 132 మంది దరఖాస్తు చేసుకున్నారు. హనుమకొండ జిల్లాకు చెందిన అభ్యర్థుల కోసం హనుమకొండలోని సెయింట్ పీటర్స్ హైస్కూల్ (చర్చి కాంపౌండ్)లో, వరంగల్ జిల్లాకు చెందిన అభ్యర్థుల కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి ఎదురుగా గల ఇస్లామియా కాలేజీలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. గ్రామ పాలనాధికారులు వీఆర్‌వోలు, వీఆర్ఏలలో ఎంత మంది అర్హులో తేల్చేందుకు నిర్వహిస్తున్న స్క్రీనింగ్ పరీక్ష ఇది. పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. పరీక్షను పారదర్శకంగా, పగడ్బందీగా నిర్వహించేందకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. అభ్యర్థులకు ఇప్పటికే హాల్ టికెట్లు జారీ అయ్యాయి. ఇప్పటికీ పొందని వారు సీసీఎల్ఎల్ వెబ్‌సైట్ http://ccla.telangana.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. హాల్ టికెట్‌పై ప్రస్తుత శాఖాధికారి (కంట్రోలింగ్ ఆఫీసర్) సంతకంతో పాటు అభ్యర్థి ఫోటో అతికించి పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది.

భూ భారతి అమలుకు..

భూభారతి చట్టం పూర్తిస్థాయిలో అమలయ్యే నాటికి జీపీవోల నియామక ప్రక్రియ ముగించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా నిర్వహించే రాతపరీక్షకు ప్రాధాన్యత ఏర్పడింది. పరీక్షల్లో ఎలాంటి ప్రశ్నలు అడుగుతారు? సిలబస్ ఏమిటనేది తెలియకుండా పరీక్షకు హాజరు కావాల్సి రావడం పట్ల అభ్యర్థుల్లో కొంత అయోమయం నెలకొన్నా రెవెన్యూ సంబంధిత ప్రశ్నలే అడుగుతారని ఆయా శాఖల అధికారులు చెబుతుండడంతో కొంత ఊరట కలుగుతోంది.

హాల్ టికెట్ల జారీ

సొంత జిల్లాలోనే పరీక్ష రాసేలా పూర్వ వీఆర్‌వోలు, వీఆర్ఏలకు హాల్ టికెట్లు జారీ చేసిన ప్రభుత్వం వాటిపై 14 సూచనలు చేసింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అంటే మూడు గంటల పాటు పరీక్ష కొనసాగనున్నది. గంట ముందు నుంచి లోనికి అనుమతిస్తారు. 10 గంటల తర్వాత అనుమతించ బోమని అధికారులు స్పష్టం చేస్తున్నారు. తెలుగులోగానీ, ఇంగ్లీష్‌లోగానీ 100 మార్కుల ప్రశ్నాపత్రానికి సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుంది. ఒక్కో ప్రశ్నకు 20 మార్కులు కేటాయిస్తారు. 10 ప్రశ్నల్లో అయిదింటికి సమాధానాలు రాయాల్సి ఉంటుంది. అభ్యర్థి వెంట హాల్ టికెట్‌తో పాటు ఎంప్లాయి గుర్తింపు కార్డు, ఆధార్ కార్డు, తీసుకువెళ్లాల్సి ఉంటుందని సూచనల్లో పేర్కొన్నారు.

మిగలనున్న ఖాళీలు

జిల్లాలో మొత్తం 160 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామానికి ఒక గ్రామ పాలనాధికారిని నియమించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీపీవోల నియామకంలో భాగంగా పూర్వ వీఆర్‌వో, వీఆర్ఏలకు ఐచ్ఛికం కింద అవకాశం కల్పించింది. వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించగా వచ్చిన దరఖాస్తులను సంఖ్యను బట్టి చూస్తే ఈ రెండు జిల్లాల్లో 60కిపైగా ఖాళీలు మిగిలే అవకాశాలు ఉన్నాయి. పరీక్ష తర్వాత జీపీవోలుగా ఎంపికైనవారు పోను విగిలిన ఖాళీలను ప్రభుత్వం ఆ తర్వాత నియమిస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా 10,941 జీపీవో పోస్టులకు 6,120 మంది మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారు. ఎంపిక ప్రక్రియ పూర్తయిన తర్వాత ఇంకా 4వేలకుపైగా పోస్టులు మిగిలవచ్చునని అంచనా వేస్తున్నారు. వీటిని టీజీపీఎస్సీ ద్వారా తర్వాత భర్తీ చేస్తారు.

రాధాక్రిష్ణకు ప్యారమౌంట్ అచీవ్‌మెంట్ రికార్డు



వరంగల్ మెడికల్, మే 22 (ఆంధ్రజ్యోతి): ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ వరంగల్ జిల్లా నేషనల్ అబ్జర్వర్ మేరుగు రాధాక్రిష్ణగౌడ్‌కు ప్యారమౌంట్ అచీవ్‌మెంట్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నుంచి విశిష్ట గౌరవం లభించింది. వినియోగదారుల హక్కుల పరిరక్షణకు అంకితంగా పని చేస్తూ ప్రజల్లో అవగాహన పెంచే దిశగా చేసిన సేవలను గుర్తించి రికార్డు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మేరుగు రాధాక్రిష్ణగౌడ్ మాట్లాడుతూ.. ఈ గౌరవం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్‌లోనూ ప్రజల హక్కుల కోసం కృషి చేస్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన నేషనల్ చైర్మన్ డాక్టర్ సాయిరమేశ్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

ఆర్టీసీ బస్సుల్లో పుష్కరాలకు తరలివెళ్లాలి..

వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను

హనుమకొండ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు వేళ్లే భక్తులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేసి సురక్షితంగా గమ్యస్థానాలకు చెరుకోవాలని వరంగల్ ఆర్ఎం డి.విజయభాను గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పుష్కరాలకోసం ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలకు గురతున్నట్లు తెలిపారు. సురక్షితమైన ప్రయాణం కోసం ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

రైతు ఆత్మహత్య



యాదగిరి(ఫైల్)

రఘునాథపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్ది గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నూనెముంతల యాదగిరి(50) తనకున్న రెండెకరాలు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. సరైన పంట చేతికిరాక, బోరు కోసం తెచ్చిన అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్థాపానికి గురయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెందిన యాదగిరి తన వ్యవసాయ బోరు వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడిఉన్నాడు. గమనించిన స్థానిక రైతులు కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య భాగ్యలక్ష్మి, ఇద్దరు కుమారులు అఖిల్, అజయ్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కగార్ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేయాలి

సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న

మహబూబాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి) : కగార్ ఆపరేషన్‌ను తక్షణమే నిలిపివేసి, సీజ్‌ఫైర్ ప్రకటించి మావోయిస్టులతో శాంతిచర్చలు ప్రారంభించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి గురువారం ఆయన పేరిట పంపిన లేఖలో పలు అంశాలను వెల్లడించారు. గత 50 సంవత్సరాలకు పైగా విప్లవకారులు ఎన్‌కౌంటర్‌లలో మృతి చెందినట్లు పాలకులు పదేపదే ప్రకటిస్తున్నారని, ఈ ఎన్‌కౌంటర్‌లలో అత్యధికంగా బూటకపు ఎన్‌కౌంటర్‌లేనని ఇది జగమెరిగిన సత్యమేనన్నారు.

1975లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాష్ట్ర కమిటీ సభ్యుడు నీలం రాంచంద్రయ్య, పీడీఎస్‌యూ నిర్మాత జేసీఎస్ ప్రసాద్‌ను విజయవాడలో అరెస్టు చేసి ఖమ్మం జిల్లా ఇల్లందు సమీపంలో చీకటిగండ్లలో కాల్చి చంపారని ఆరోపించారు. 1976లోరాష్ట్ర కార్యదర్శి పొట్ల రామనర్సయ్యతో పాటు నలుగురిని హైదరాబాద్ నగరంలో అరెస్టు చేసి వరంగల్ జిల్లా నర్సంపేట సమీపంలోని చిలుకలగుట్ట అడవుల్లో చిత్రహింసలు పెట్టి కాల్చి చంపారన్నారు. సామ అంతిరెడ్డిని సూర్యాపేటలో అరెస్టు చేసి, కరీంనగర్ జిల్లాలో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు ప్రకటించారని చెప్పారు. మధుసూదన్‌రాజు యాదవ్‌ను హైదరాబాద్ నడిబొడ్డులో అరెస్టు చేసి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు ప్రకటించారని చెప్పారు. నల్లా ఆదిరెడ్డి, సంతోష్‌రెడ్డి, నరేష్‌లను బెంగుళూరులో మత్తుమందు ప్రయోగించి వారిని పట్టుకువెళ్లి కొయ్యూరులో ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు చిత్రీకరించినట్లు పేర్కొన్నారు.

పటేల్ సుధాకర్‌రెడ్డి, ఆజాద్‌ను మైదాన ప్రాంతాల్లో అరెస్టు చేసి ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు పేర్కొన్నారు. వేలాది మంది ఆదివాసీలను, విప్లవకారులను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపుతూ.. ప్రభుత్వాలు ప్రకటించే ఎన్‌కౌంటర్‌లలో 80 శాతం బూటకపు ఎన్‌కౌంటర్‌లేని చెప్పారు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్న మావోయిస్టు కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావును అరెస్టు చేసి అడవికి తీసుకువచ్చి ఆదివాసీలను, మరికొంతమంది విప్లవకారులను ఎన్‌కౌంటర్ చేశారని, దీన్ని కేంద్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుందని చెప్పారు.

ఈ బూటకపు ఎన్‌కౌంటర్లలో మృతి చెందిన కేంద్ర కమిటీ కార్యదర్శి కేశవరావు, విప్లవ నాయకులకు, కార్యకర్తలకు, ఆదివాసీలకు తీవ్ర సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు చెప్పారు. ఎన్‌కౌంటర్‌లలో మృతి చెందిన మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించాలని, బూటకపు ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు న్యాయమూర్తిచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రజా స్వామిక వాదులు, రాజకీయ పార్టీలు, మేధావులు, సమస్త వర్గాలప్రజలు ముక్తకంఠంతో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, సీజ్‌ఫైర్ ప్రకటించి శాంతి చర్చలకు జరపాలని డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెల మృతి

హసన్‌పర్తి, మే 22 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతానాగారంలో గురువారం విద్యుత్ షాక్‌తో మూడు పాడి గేదెలు మృతి చెందాయి. బాధితుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. సీతనాగారం గ్రామానికి చెందిన దావ తిరుపతికి చెందిన రెండు పాడి గేదెలు, బోయిన సుమన్‌కు చెందిన ఒక పాడి గేదె సీతానాగారం సమీపంలో మేత మేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతకు గురైనట్లు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి సుమారు రూ.2.40 లక్షల విలువ చేసే పాడి గేదెలు మృతి చెందాయని స్థానిక మాజీ సర్పంచ్ దావ రవి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండి రజనీకుమార్ మండిపడ్డారు. పాడి రైతులకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై సిద్దాపూర్ పశువైద్యాధికారి అర్చనను వివరణ కోరగా మూడు గేదెలకు పంచనామా నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదికను పంపిస్తున్నట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలులో సమస్యల పరిష్కారానికి టోల్‌ఫ్రీ 18004253424

వరంగల్ కలెక్టరేట్, మే 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం కొనుగోలు చేసే సమయంలో ఉత్పన్నమయ్యే సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ, ధాన్యం సేకరణ, రవాణా, మద్దతు ధర, సమాచారం, ఇతర ఫిర్యాదుల కోసం టోల్‌ఫ్రీ 18004253424 నెంబరుకు ఫోన్ చేయవచ్చని చెప్పారు. సమస్య తలెత్తితే వెంటనే ఫిర్యాదు చేయవచ్చన్నారు. రైతులు కాల్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

రైల్వేస్టేషన్లను ఎయిర్‌పోర్టులుగా తీర్చిదిద్దాం

రైల్వేస్టేషన్‌లో పరిశుభ్రత పాటించాలి ● కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ● అమృత్ వరంగల్ రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవం



అమృత్ పథకం కింద అభివృద్ధి చేసిన వరంగల్ రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

గిర్మాజిపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఓరుగల్లు కేంద్రంగా సాగిన కాకతీయుల పాలన, చారిత్రక, సాంస్కృతిక కళావైభవాన్ని చాటిచెబుతూ ఎయిర్‌పోర్టు తరహాలో అధునాతన ప్రయాణ వసతులతో వరంగల్ రైల్వేస్టేషన్‌ను అమృత్‌స్టేషన్‌గా అభివృద్ధి చేసినట్లు కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ చెప్పారు. గతంలో మౌలిక వసతులు లేని రైల్వేస్టేషన్లు ప్రధానమంత్రి మోదీ అమృత్ పథకంతో అత్యంత అధునాతన సేవలతో ఎయిర్‌పోర్టుల మాదిరిగా ప్రయాణికులకు అందుబాటులోకి వచ్చాయని అన్నారు. కాజీపేట రైల్వేస్టేషన్‌లో అమృత్ అభివృద్ధి సేవలు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని కేంద్ర మంత్రి తెలిపారు. అమృత్ స్టేషన్ పథకం కింద దేశ వ్యాప్తంగా ఆధునీకరించిన వరంగల్‌తో సహా 103 రైల్వేస్టేషన్‌లను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం వర్చువల్‌గా బీకనూర్(రాజస్థాన్) నుంచి ప్రారంభించారు. వరంగల్ రైల్వేస్టేషన్ ఆవరణలో దక్షిణమధ్య రైల్వే ఏజీఎం నీరజ్ అగర్వాల్ అధ్యక్షతన జరిగిన వరంగల్ రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధునాతన సాంకేతికతతో ప్రజల ఆకాంక్షలు, అవసరాలకు అనుగుణంగా మెరుగైన ప్రయాణ వసతులతో చేపట్టిన భారతీయ రైల్వే వ్యవస్థ అభివృద్ధిలో భాగంగానే అమృత్ స్టేషన్ పథకాన్ని లక్షల కోట్ల రూపాయలతో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయంలో స్థానిక చారిత్రక, సాంస్కృతిక, సంప్రదాయాలు, కళావైభవాలు, పర్యాటక ప్రాముఖ్యతకు అనుగుణంగా రైల్వేస్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వరంగల్ రైల్వేస్టేషన్ భవనం కాకతీయ పాలనను గుర్తుకు తెచ్చేలా ఉందని, అలాగే విశాలమైన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, లిఫ్టులు, ర్యాంపులు, దివ్యాంగులకు సైతం అనువైన అధునాతన ప్లాట్‌ఫారమ్, ఫసడ్ లైటింగ్‌తో వరంగల్ రైల్వేస్టేషన్ ఎయిర్‌పోర్టు మాదిరిగా ఉందని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. రైల్వేస్టేషన్‌ను పరిశుభ్రత, భద్రత, రక్షణ విషయంలో ప్రయాణికులు, స్థానిక ప్రజలు రైల్వేశాఖ సహకరించాలని కోరారు. చారిత్రక ప్రత్యేకత కలిగిన వరంగల్ అభివృద్ధికి మోదీ ప్రభుత్వం అంతే ప్రాధాన్యతనిస్తూ అమృత్, హృదయ్ తదితర పథకాలతో అభివృద్ధి చేస్తున్నదని తెలిపారు. రామప్పకు యునెస్కో గుర్తింపు, మామునూరు ఎయిర్‌పోర్టు, కాజీపేట ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ, సమ్మక్క, సారలమ్మ జాతీయ విశ్వవిద్యాలయం ఏర్పాటు ఘనత మోదీ ప్రభుత్వానిదేనంటూ, వరంగల్ ప్రజలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మద్దతుగా నిలవాలని కేంద్ర మంత్రి కోరారు.

కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలి

ఉత్తర, దక్షిణ భారతావనికి జంక్షన్‌గా ఉన్న కాజీపేట రైల్వే స్టేషన్‌ను రైల్వే డివిజన్‌గా అభివృద్ధి చేయాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ ప్రత్యేక చొరవ తీసుకోవాలని అన్నారు. హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో ఎలా అభివృద్ధి చెందిందో వరంగల్ మహానగరం కూడా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని, ఈవిషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న కార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని కోరారు. తెలంగాణలోని పలు రైల్వేస్టేషన్లను అమృత్ స్టేషన్లుగా అధునాతన వసతులతో కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయడం అభినందనీయమని మంత్రి పొంగులేటి కొనియాడారు. వరంగల్ రైల్వేస్టేషన్‌ను పునరాభివృద్ధితో ప్రారంభించడం చాలా సంతోషకరమని అన్నారు. వరంగల్ లోక్‌సభ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ.. కాకతీయుల చరిత్రను ప్రతిబింబిస్తూ వరంగల్ రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అమృత్ రైల్వేస్టేషన్ పథకం కింద రూ.25కోట్లతో కాజీపేట రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు జరుగుతున్నాయని, త్వరలోనే ప్రారంభించనున్నట్లు చెప్పారు. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటు, ఆర్‌వోబీ, రైల్వేశాఖ ద్వారా కాజీపేట బస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

రూ.2,750 కోట్లతో 40 రైల్వేస్టేషన్ల అభివృద్ధి

అధునాతన మెరుగైన వసతులు, భద్రతతో కూడిన రైల్వే సేవలు లక్ష్యంగా దక్షిణమధ్య రైల్వే పనిచేస్తూ ప్రయాణికులకు సేవలు అందిస్తున్నదని దక్షిణమధ్య రైల్వే ఏజీఎం నీరజ్ అగర్వాల్ అన్నారు. అమృత్ పథకంకింద తెలంగాణలో 40 రైల్వేస్టేషన్‌లను రూ.2,750 కోట్లతో అధునాతన వసతులతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అంకితభావం కలిగిన సిబ్బంది, పనితీరుతో అధునాతన రైళ్లు, రైల్వేస్టేషన్ల అభివృద్ధి, రైల్వేలైన్‌ల విస్తరణలో దక్షిణమధ్య రైల్వే ముందుందని అన్నారు. హసన్‌పర్తి - కాజీపేట బైపాస్ మార్గంను రికార్డుస్థాయిలో 14 రోజుల్లోనే పూర్తిచేసిన చరిత్ర దక్షిణమధ్య రైల్వేదని ఏజీఎం నీరజ్ అగర్వాల్ చెప్పారు. అలాగే వరంగల్ రైల్వేస్టేషన్‌ను నిర్ణీత కాలంలో పునరాభివృద్ధి చేసిన అన్ని విభాగాల అధికారులు, సిబ్బందిని ఏజీఎం నీరజ్ అగర్వాల్ అభినందిస్తూ.. ఇది తమ సిబ్బంది పనితీరుకు నిదర్శనమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాష్, ఎంపీలు ఈటల రాజేందర్, డి.కె.అరుణ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి, యశస్వినిరెడ్డి, కుడా చైర్మన్ వెంకట్రామ్‌రెడ్డి, మాజీ ఎంపీ డాక్టర్ సీతారాం నాయక్, మాజీ ఎమ్మెల్యేలు ధర్మారావు, డాక్టర్ రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద, గ్రేటర్ బల్దియా కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే, రైల్వే ఏడీఆర్ఎం గోపాల్, ఏసీఎం శ్రీరామమూర్తి, డీఈఎన్(సౌత్) దినకర్, స్టేషన్ మేనేజర్ బాల్‌రాజ్, సీసీఐ రాజ్‌గోపాల్, సీటీఐలు విజయ్‌కుమార్, రాజేంద్రప్రసాద్, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, బీజేపీ నాయకులు రఘునారెడ్డి, రావు పద్మారెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ రైల్వేస్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ప్రజలు, బీజేపీ నాయకులు

సంగమతీరం.. హారతి ప్రత్యేకం

- సరస్వతి పుష్కరాల్లో ఆకట్టుకుంటున్న కాశీ పండితుల నవరత్న హారతి కార్యక్రమం
- తిలకించి తరిస్తున్న భక్తజనం

కాళేశ్వరం, మే 22 (ఆంధ్రజ్యోతి) : సరస్వతీ పుష్కరాల్లో త్రివేణి సంగమానికిచ్చే హారతి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. సంగమతీరంలో ఏర్పాటు చేసిన ఏకశిల సరస్వతీ మాత విగ్రహంతో పాటు లైటింగ్స్, హారతితో పాటు వచ్చే ప్రత్యేక స్వరమాల ఆకట్టుకుంటోంది. సప్తహారతులతో ఇచ్చే నవరత్నమాల నవరసాలు పండిస్తోంది. ఈ అద్భుత దృశ్యాన్ని కనులారా తిలకించేందకు వి విధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. సాయంత్రం వేళ ఓ పక్క నదీ ప్రవాహం, మరో పక్క నవరత్న మాలహారతీ అక్కడున్న వారిని మంత్ర ముగ్ధులను చేస్తోంది. ప్రతిరోజు ఓ ప్రత్యేక అతిథి వచ్చి కార్యక్రమాన్ని వీక్షించడం విశేషం.



నదిలో పూజ చేస్తున్న యువతి

సరస్వతీ పద్యాలతో ప్రారంభమయ్యే నవరత్న మాల హారతి సరస్వతీ, అచ్యుతం, యాకుండేందు, కాళభైరవాష్టకం, శివతాండవం, హారతులతో సిద్ధం చేయించిన ప్రత్యేక స్వరమాలతో ముగుస్తోంది. హారతి ప్రారంభం నుంచి 45 నిమిషాల పాటు సాగే ఈ కార్యక్రమం ఆద్యంతం భక్తులను కట్టిపడేస్తుంది. సరస్వతీమాత విగ్రహం, దానికి రెండు వైపులా ఏర్పాటు చేసిన మిరుమిట్లుగొలిపే లైటింగ్ భక్తులను ఆకట్టుకుంటోంది. నదీమ హారతి కోసం జొన్నవిత్తుల రామలింగేశ్వరావు స్వరపరిచిన గానం వింటుంటే ఒళ్లు పులకరిస్తోంది.

సుమారు గంటపాటు సాగే నవరత్నమాల హారతిలో కాళేశ్వర క్షేత్ర పాశస్త్యాన్ని స్పష్టంగా తెలిపారు. కాశీ క్షేత్రపాలకుడు కాళభైరవుడు కాగా, కాళేశ్వర క్షేత్ర పాలకుడు లోలార్కభైరవుడని.. ఒకే పానవట్టం, రెండు లింగాలు ఈ క్షేత్రానికి ప్రత్యేకమనే సందేశాన్ని ఈ హారతిలో వివరి స్తారు. కాశీపండితులతో సరస్వతీ మాతకు ఇచ్చే హారతీ ఇక్కడ ప్రత్యేకమనే సందేశాన్ని అందిస్తారు. ఉత్తరప్రదేశ్‌లోని కాశీ గంగా నదికి హారతి ఇచ్చే పండితుల బృందంతో సరస్వతీ పుష్కర ఘాట్‌లో త్రివేణి సంగమానికి నవరత్నమాల హారతి ఇస్తుండడం ఇక్కడ ప్రత్యేకంగా నిలుస్తోంది. సంవత్సరమంతా గంగానదికి హారతి ఇచ్చే పదేళ్ల అనుభవం ఉన్న ఎనిమిది మంది కాశీపండితులచే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఆచార్య ఆశుతోష్ పాండే నేతృత్వంలోని నితేష్ పాండే, అభిషేక్ పాండే, దీపక్ పాండే, అంకిత్ పాండే, శివ మిశ్రా, కౌశల్ తివారి, సామంతి తివారిలతో కూడిన బృందం 12 రోజుల పాటు నదిమాతల్లికి ప్రత్యేక హారతి ఇస్తున్నారు. ఈ బృందానికయ్యే ఖర్చంతా తెలంగాణ ప్రభుత్వమే భరిస్తోంది.

కాగా, నవరత్నమాల హారతిలో ఒక్కో హారతికి ఒక్కో ప్రత్యేకత ఉంది. తొలుత నిర్వహించే 'ఓంకార హారతి'తో సర్వదోషాలు తొలగిపోతాయి. సర్వదోషాలు పోయి ఆరోగ్యాన్ని ప్రసాదించేందుకు 'నాగహారతి', దీర్ఘాయుష ప్రసాదించేందుకు 'పంచ హారతి', రోగాలను తొలగించి ఆరోగ్యాన్ని ప్రసాదించేందుకు 'సూర్యహారతి', పాడిపంటలను, మనశ్శాంతిని ప్రసాదించేందుకు 'చంద్రహారతి', ధర్మబుద్ధిని, శక్తిని, విద్యను ప్రసాదించేందుకు 'నందిహారతి', నాయకత్వ పటిమ పొంది ధైర్యాన్ని నింపేందుకు ' సింహ హారతి', సంపదను ఇచ్చి, కోటి సుఖాలను ప్రసాదించేందుకు 'కుంభ హారతి', నిర్మలమైన మనస్సును, కీర్తిని ప్రసాదించేందుకు 'నక్షత్ర హారతి ఇస్తున్నారు.

హారతి ఇస్తున్న కాశీ పండితులు





నదిలో పుణ్యస్నానం ఆచరిస్తున్న భక్తురాలు

హారతి ఇవ్వడం నా అదృష్టం
- ఆచార్య అశుతోష్ పాండే, కాశీ పండితుడు

కాశీలోని బనారస్ ఘాట్‌లో గత పదేండ్లుగా గంగా నదికి ఇస్తున్న నిత్య హారతి కార్యక్రమంలో నేను ఒకరిని. దక్షిణ కాశీగా పిలువబడే కాళేశ్వర క్షేత్రంలోని త్రివేణి సంగమానికి ఇచ్చే హారతికి ప్రధాన పాత్ర వహించేందుకు అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు. సనాతన ధర్మాలను కాపాడేందుకు ఇక్కడి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. నదీమ తల్లికి ఇచ్చే హారతితో ఎన్నో ఫలితాలుంటాయి. హారతిలో వాడే నెయ్యి, కర్పూరం వల్ల వచ్చే దూపంతో ప్రతీ ఒక్కరికి ఎంతో పాజిటీవ్ ఎనర్జీ లభిస్తుంది.

కాళేశ్వర ఖ్యాతి ఖండాంతరాలు దాటుతోంది
- నగేశ్ శర్మ, కాళేశ్వరాలయ ఉప ప్రధాన అర్చకుడు

తెలంగాణ ప్రభుత్వం త్రివేణి సంగమం వద్ద నదిమా తల్లికి ఇచ్చే నవరత్నమాల హారతితో కాళేశ్వర ఖ్యాతి ఖండాంతరాలకు విస్తరిస్తోంది. ఈ నవరత్నమాల హారతిలో ఒక్కో హారతి ఒక్కో ఫలితాన్నిస్తుంది. ప్రచార మాధ్యమాల ద్వారా కాకుండా నేరుగా వచ్చి హారతిని వీక్షిస్తే కలిగే అనుభూతి మాటల్లో చెప్పలేం.

పుష్కర స్నానాలకెళ్లి.. తిరిగిరాని లోకాలకు..

- భూపాలపల్లి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఆటోను కారు ఢీకొన్న సంఘటనలో ఇద్దరు మృతి
- 13 మందికి తీవ్ర గాయాలు



ఆస్పత్రిలో బెడ్‌పై విష్ణు, రజిత మృతదేహాలు

కాటారం, మే 22 (ఆంధ్రజ్యోతి): పుష్కరాలకు వెళ్లి పుణ్య స్నానం చేద్దామని ఇంటి నుంచి ఆటోలో బయలుదేరిన వారికి కారు మృత్యురూపంలో ఎదురైంది. ఆటోలో ముగ్గురు అక్కా చెల్లెళ్లు.. వారి కుటుంబసభ్యులతో కలిసి మాట ముచ్చట చెప్పుకుంటూ ఆహ్లాదకరంగా ఉన్న అటవీ ప్రాంతాన్ని చూస్తూ వెళ్తున్న వారికి ఎదురుగా వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ఇద్దరు మృత్యువాత పడగా రెండు వాహనాల్లోని 13 మంది తీవ్రగాయాల పాలయ్యారు. ఈ విషాద సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలో 353(సీ)జాతీయ రహదారిపై కమలాపూర్ క్రాస్ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. కాటారం ఎస్సై మ్యాక అభినవ్ తెలిపిన వివరాల ప్రకారం..

హైదరాబాద్‌కు చెందిన కొత్త చంద్రకాంత్ నలుగురితో కలిసి కారులో కాళేశ్వరం పుష్కరాలకు తీసుకుని వచ్చి పుణ్యస్నానం అనంతరం తిరిగి బయలుదేరారు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వరికోల్‌పల్లి, కుమ్మరిపల్లికి చెందిన గుంటుక నర్సింహా అలియాస్ స్వామి, అతడి భార్య సంధ్య, కుమారుడు విష్ణు, సంధ్య సోదరీమణులు శ్రీరాముల శోభ, రజితలతో పాటు వారి కుటుంబసభ్యులు అజిత్‌పాషాకు చెందిన ఆటోలో పుష్కరస్నానం చేయడానికి కాళేశ్వరం వెళ్తున్నారు. కమలాపూర్ క్రాస్ సమీపంలో కాళేశ్వరం నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారువేగంగా ఎదురుగా వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో ధ్వంసమై రోడ్డు కిందకు అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లింది. కారు ఎగిరిపడి ఒకవైపు బోల్తా పడింది. దీంతో ఆటోలో ఉన్న పాల రజిత(28), గుంటుక విష్ణు(21) తీవ్ర గాయాలతో మృతి చెందారు. నర్సింహా, సంధ్య, శోభ, వివాన్, శాన్విత, విశృత్, మోక్షిత్, డ్రైవర్‌పాషా తీవ్రంగా గాయపడగా పలు వాహనదారులు 108 అంబు లెన్స్‌లో వివిధ ఆస్పత్రులకు చికిత్స నిమిత్తం తరలించారు. గాయపడ్డ వారిలోనూ ఒకరిద్దరి పరిస్థితి వి షమంగా ఉన్నట్లు తెలుస్తోంది. కారు డ్రైవర్ కొత్త చంద్రకాంత్‌తోపాటు మరో నలుగురు తీవ్రగాయాలవడంతో భూపాలపల్లి 100 పడకల ఆస్పత్రికి అంబులెన్స్‌లో తరలించారు. కాగా, ప్రమాదస్థలంలో మృతదేహాలు, క్షతగాత్రులతో హృదయ విదారకంగా కనిపించింది. క్షతగాత్రుల రోదనలతో అటవీప్రాంతం దద్దరిల్లింది. ప్రమాద సంఘటనను చూసి పలువురు కంటతడి పెట్టి బాధితులకు సాయమందించారు. ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న ట్లు ఎస్సై అభినవ్, పీఎస్సై గీత తెలిపారు.

ప్రమాదంలో ధ్వంసమైన కారు, ఆటో



భక్తులకు ఆర్టీసీ విస్తృత సేవలు

కాళేశ్వరం, మే 22 (ఆంధ్రజ్యోతి) : సరస్వతి నదీ పుష్కరాల్లో భాగంగా భక్తులకు ఆర్టీసీ విస్తృత సేవలు అందిస్తున్నట్లు వరంగల్ రీజినల్ మేనేజర్ వి నయ్‌భాను గురువారం తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రతీ రోజు 300లకు పైగా బస్సు ట్రిప్పులను నడుపుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ బస్సులు హనుమకొండ, భూపాలపల్లి, హైదరాబాద్, ఖమ్మం, తొర్రూరు, నర్సంపేట, మంథని, గోదావరిఖని, మంచిర్యాల, కరీంనగర్, వేములవాడ తదితర ప్రాంతాలకు నడుపుతున్నట్లు తెలిపారు. ప్రతి రోజు సుమారు 40 వేలకు పైగా భక్తులకు రవాణా సౌకర్యం కల్పిస్తునట్లు తెలిపారు. 130 మంది సిబ్బంది ఇరువై నాలుగు గంటల పాటు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పార్కింగ్ స్థల పరిశీలన

కాళేశ్వరం, మే 22 (ఆంధ్రజ్యోతి):సరస్వతి పుష్కరాలకు నిత్యం లక్షకు పైగా భక్తజనం వేలాది వాహనాల్లో తరలివస్తుండడంతో ట్రాఫిక్ జామ్‌లతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు పుష్కర భక్తులకు ట్రాఫిక్ జామ్ కష్టాలను తప్పించడానికి వన్ వే మార్గంగా చర్యలు చేపట్టిన ఇక్కట్లు తొలగలేదు. దీంతో కలెక్టర్ రాహుల్‌శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరే నూతన పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పూసుకుపల్లి సమీపంలో సుమారు 40 ఎకరాల్లో నూతనంగా పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయగా గురువారం అడిషనల్ కలెక్టర్ అశోక్ కుమార్, భూపాలపల్లి ఆర్డీవో రవి పరిశీలించారు.

నదిలో భక్తుల సందడి



సరస్వతి పుష్కరం.. సకల జనహితం

- పుష్కర స్నానానికి పెరుగుతున్న భక్త జన సందోహం
- 8వ రోజు లక్ష మందికి పైగా పుణ్యస్నానాలు

కాళేశ్వరం, మే 22(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల పురస్కరించుకుని త్రివేణి సంగమం భక్తజనంతో కళకళలాడింది. త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల 8వ రోజైన గురువారం కూడా భక్తులు తండోపతండాలుగా పుష్కరస్నానానికి తరలివచ్చారు. బుధవారం కంటే భక్తుల సంఖ్య పెరిగింది. సరస్వతీ నదిలో లక్షమందికిపైగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. పుష్కరాలకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉండడంతో భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన భక్తులు వేలాది వాహనాల్లో తరలిరా వచ్చారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా భక్తులు పుణ్య స్నానాలు చేశారు. ఆటు ముక్తీశ్వరాలయంలోనూ స్వామి వారి దర్శనం కోసం భక్తులకు నాలుగు గంటల సమయం పట్టింది. కాళేశ్వరంలో కురిసిన భారీ వర్షం కారణంగా క్షేత్ర పరిసరాల్లో నీరు నిలిచి బురదమయం కావడంతో పుష్కర ఘాట్లతోపాటు, తాత్కాలిక బస్టాండ్, పుష్కర ఘాట్లకు వెళ్లే మట్టి రోడ్లు బురదతో నిండిపోయి భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పార్కింగ్‌స్థలాల్లో వర్షం కారణంగా నీరు నిలిచి వాహనాలు కూరుకుపోవడంతో వాటిని బయటకు తీసి ట్రాఫిక్‌ని క్లియర్ చేసేందుకు అధికారులు కృషి చేశారు. కాళేశ్వర క్షేత్రం నల్లరేగడి మట్టితో కూడిన నేల కావడంతో వర్షానికి మొత్తం బురదగా మారి వాహనాల రాకపోకలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. రహదారులన్నీ కాళేశ్వరం వైపే అన్నట్లుగా తలపించింది. ఈ సందర్భంగా భక్తులు త్రివేణి సంగమంలో చీరె, సారె, పూలు, పండ్లు, దీపంలు సమర్పించారు. పలువురు భక్తులు తమ పితృదేవతలకు పిండప్రదానాలు చేసి తర్పనాలు వదిలి దానధర్మాలు చేశారు. అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకుని మోక్షాన్ని ప్రాప్తించ మంటూ మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో కాళేశ్వర క్షేత్రం వేలాది మంది భక్తజనంతో కిటకిటలాడింది. అటు దూర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కూడా పూర్తి సామర్థ్యంతో రద్దీగా నడిచాయి.

కాళేశ్వరం చేరుకునే వాహనాలు సుమారు ఐదు గంటల పాటు ట్రాఫిక్ జామ్ అయింది. బుధవారం కురిసిన వర్షాన్ని దృష్టిలో ఉంచుకుని పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించే లక్ష్యంతో కాళేశ్వరానికి 8 కిలోమీటర్ల దూరంలోని అన్నారం క్రాస్ నుచి కాళేశ్వరానికి వాహనాలను మళ్లించారు. దీంతో అన్నారం, చంద్రుపల్లి, పూస్కుపల్లి, ఇప్పలబోరు మీదుగా కాళేశ్వరం చేరుకున్నాయి. ఈ క్రమంలోనే క్షేత్రానికి 5కిలోమీటర్ల దూరం నుంచే భక్తులు ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొన్నారు.

వాహనాల బారులు

అంతేకాకుండా పార్కింగ్ స్థలాల్లో ఉన్న వాహనాలు కదలకపోవడంతో దాదాపు 5గంటల పాటు అడవిలోనే ట్రాఫిక్ స్తంభించిపోయి వాహనాలు చిక్కుకుపోయాయి. దాంతో అధికారులు యుద్ధ ప్రాతిపదికన క్రేన్లు, ట్రాక్టర్లను రంగంలోకి దింపి ట్రాఫిక్ జామ్‌కు కారణమైన వాహనాలను క్లియర్ చేసి రాకపోకలను పునరుద్ధరించే ప్రయత్నాలు చేశారు. దాంతో దూర ప్రాంతాల నుంచి సొంత వాహనాల్లో వచ్చిన భక్తులు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరోవైపు పుష్కరఘాట్లకు సమీపంలో ఏర్పాటు చేసిన టెంట్ సిటీ మొత్తం వర్షపు నీటితో బురదమయం కావడంతో అధికారులు వెట్ మిక్స్ చల్లి బురదను నియంత్రించే ప్రయత్నం చేశారు.

ప్రముఖులకు తప్పని తిప్పలు

సరస్వతి నదీ పుష్కరాల్లో భాగంగా ప్రముఖులకు కూడ ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు. అన్నారం మీదుగా వాహనాలను మళ్లించడంతో సమయం గడిచిన కొద్ది కిలో మీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. పుష్కరాలకు వచ్చిన ప్రముఖులు దేవాదాయశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజరామయ్యర్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు హనుమంత్‌రావు, నిజమాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణలకు ట్రాఫిక్ కష్టాలు తప్పలేదు

మళ్లీ కురిసిన వర్షం

మహదేవపూర్ మండలంలో రెండు రోజులుగా వర్షం కురుస్తోంది. దీంతో పుష్కరాలకు వచ్చిన భక్తులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్ స్థలాల నుంచి వాహనాలు బయటకు రావకపోవడంతో భక్తులు వర్షంలోనే తడుస్తున్నారు. మరో వైపు క్షేత్రానికి చేరుకుంటున్న వాహనాలు ఎక్కడ పార్క్ చేయాలో అర్థం కాక అటు భక్తులు, అధికారులు తలులు పట్టుకుంటున్నారు. మరోవైపు కూలిపోయిన టెంట్లను తిరిగి పునరుద్ధరించినా.. మళ్లీ కురిసిన వర్షంతో ఫలితం లేకుండా పోయింది. రాబోయే 48గంటల్లోనూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అప్రమత్తం చేయడంతో అధికారులు భవిష్యత్ కార్యాచరణపై చర్యలు ప్రారంభించారు. పుష్కరాలకు చివరి మూడు రోజుల్లో భక్తులు మరింతగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్న అధికార యంత్రాంగం అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్‌ఖరేలు కాళేశ్వర క్షేత్రంలో ద్విచక్ర వాహనంపై తిరుగుతూ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు.

పుణ్యస్నానాలు ఆచరించిన ప్రముఖులు

సరస్వతి పుష్కరాలలో భాగంగా 8వ రోజు గురువారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, వ్యవసాయ రైతు కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, సభ్యుడు గడుగు గంగాధర్, ప్రముఖ సినీ నటుడు అల్లు అర్జున్ తల్లి అల్లు నిర్మల, తదితరులు అంతర్వాహినిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కాగా, ఆలయంలో వీఐపీల తాకిడితో సామాన్య భక్తులు ఇబ్బందులు ఎదర్కొంటున్నారు. వీఐపీలు పూజలు చేస్తున్న క్రమంలో రెండు గంటల వ్యవధి పాటు క్యూలైన్లను అధికారులు నిలిపివేశారు. దీంతో భక్తులు వీఐపీలు అయితే ఐదు నిమిషాల్లో పూజలు చేసి పంపివ్వాలని కానీ.. గంటల పాటు వారికి సమయం కేటాయిస్తారా..? అంటూ కేకలు వేస్తూ తీవ్ర అసహనానికి గురయ్యారు.

ప్రిన్సిపల్ సెక్రటరీ సమీక్ష

సరస్వతి పుష్కరాల నిర్వహణ ఏర్పాట్లపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అధికారులతో సమీక్షించారు. ఏడు రోజుల పుష్కర విధుల ఏర్పాట్లపై అధికారులను అభినందించారు. భద్రత, వైద్యం, రవాణా, తాగునీరు, పారిశుద్ధ్యం, వర్షాలవల్ల విద్యుత్ సమస్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పుష్కరాల నిర్వహణకు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులపై అధికారుల, సిబ్బంది, మెడికల్ క్యాంపులు విషయాలపై కలెక్టర్ రాహుల్ శర్మ వివరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు పాటించాలని అధికారులకు దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూచించారు.



దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

రోజూ 5 లక్షల లీటర్ల నీరు పంపిణీ

కాళేశ్వరం, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వర క్షేత్ర త్రివేణి సంగమంలో వైభవంగా జరుగుతున్న సరస్వతి పుష్కరాల్లో గ్రామీణ నీటి సరఫరా శాఖ విస్తృతంగా సేవలందిస్తోంది. నిత్యం తాగునీరు, టాయిలెట్స్ నిర్వహణ కోసం 5 లక్ష ల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తెలిపారు. పుష్కరాల ప్రారంభమైన మొదటి రెండు రోజుల్లో భక్తజనం తాగునీటి కోసం కాస్త ఇబ్బందులు పడ్డప్పటికీ మూడో రోజు నుంచి పుష్కర క్షేత్రమైన కాళే శ్వరంలోని వివిధ ప్రాంతాల్లో నీటి సరఫరా పుష్కలంగా జరుగుతోంది. సీఈ సురేష్ నేతృత్వంలో ఎస్ఈ మల్లేష్, ఈఈ నిర్మల, కాటారం సబ్ డివిజన్ డీఈ ఈ రమేష్‌తో పాటు మరో ముగ్గురు, ఎనిమిది మంది ఏఈఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్స్, హెల్పర్స్, ల్యాబ్ టెక్నీషియన్స్‌తో సహా 135మంది పుష్కర విధుల్లో సేవలందిస్తున్నారు. పుష్కరాల సందర్భంగా కాళేశ్వరం క్షేత్రంలో 1.20లక్షలు, 40 వేల లీటర్ల సామర్థ్యం గల ఓవర్ హెడ్ ట్యాంకులు, 1లక్ష లీటర్ల సంప్, పుష్కర ఘాట్లు, బస్టాండ్లు, పార్కింగ్ స్థలాలు, త్రివేణి సంగమం తదితర చోట్ల 22 మినీ స్టోరేజ్ ట్యాంక్స్, 42 చలివేంద్రాల ద్వారా తాగునీటి సరఫరా అందిస్తు న్నారు. 20వేలకు పైగా వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. నీటి సరఫరా పాయింట్ల వద్ద క్లోరినేషన్ డోజర్స్ ఏర్పాటు చేశారు. ప్రతీరోజు నవరత్న హారతి సమయంలో వాటర్ బాటిల్స్ అందిస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం 270 టెంపరరీ టాయిలెట్స్, 28 రెడీమేడ్ టాయిలెట్స్, 71 శాశ్వత టాయిలెట్స్, బస్సుల్లో 2 బయో టాయిలెట్స్, ఒక మొబైల్ టాయిలెట్‌లను ఏర్పాటు చేసి నిర్వహణ కోసం 8 గల్పర్ మిషన్లు పనిచేస్తున్నాయి. నిత్యం నీటి సరఫరా, పంపిణీ, టాయిలెట్ల నిర్వహణను ఈఈ నిర్మల, డీఈఈ రమేష్‌తో పాటు ఏఈలు పర్యవేక్షిస్తూ భక్తులకు ఇబ్బందులు కలగకుండా కృషి చేస్తున్నారు.



తాగునీటి పంపిణీని పర్యవేక్షిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



ట్రాఫిక్‌జామ్ కావడంతో బారులు తీరిన వాహనాలు

భారీగా ట్రాఫిక్ జామ్
5 కిలోమీటర్లు నిలిచిన వాహనాలు

కాళేశ్వరం, మే 22 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు గురువారం ఉదయం సుమారు ఐదు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. బుధవారం సాయంత్రం కురిసిన భారీవర్షంతో పార్కింగ్ స్థలాలు పూర్తిగా బురదమయం అవ్వడమే కాకుండా పార్కింగ్ స్థలంలో మళ్లీ వాహనాలను నిలుపలేని పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న భక్తుల తాకిడి, వాహనాల రద్దీని పోలీసులు దృష్టిలో ఉంచుకుని అన్నారం క్రాస్ వద్ద వన్‌వే చేశారు. దీంతో అన్నారం, చంద్రుపల్లి, పూస్కుపల్లి, ఇప్పలబోరు మీదుగా కాళేశ్వరానికి చేరుకున్నాయి. ఈ క్రమంలోనే సుమారు ఐదు గంటల పాటు ఐదు కిలోమీటర్లు మేర ట్రాఫిక్ జామ్ అయింది. మరో రెండు నూతన పార్కింగ్ స్థలాలు త్వరితగతిన ఏర్పాటు చేసి పోలీసులు ట్రాఫిక్ సమస్యను పునరుద్ధరించారు.

చదును పనులు ముమ్మరం



టెంట్ సిటీ వద్ద రోడ్డును చదును చేస్తున్న ట్రాక్టర్

కాళేశ్వరం, మే 22 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాల్లో రహదారులు, పార్కింగ్ స్థలాలు చదును చేసే పనులు ముమ్మరంగా చేశారు. కురుస్తున్న అకాల వర్షాలతో సరస్వతీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన టెంట్ సిటీ, ఘాట్‌కు చేరుకునే రహదారులు, పార్కింగ్ స్థలాలు బురదమయంగా మారాయి. దీంతో సంబంధిత అధికారులు చూర, కంకర, డస్ట్‌లతో మరమ్మతులు చేశారు. అధికారులు అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు భక్తులు ఇబ్బందులు రాకుండా పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఎడ్ల బండ్లపై పుష్కర స్నానాలకు..



ఎడ్ల బండిపై పుష్కరఘాట్‌కు వస్తున్న భక్తులు

కాళేశ్వరం, మే 22 (ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కర స్నానాలకు వచ్చే భక్తులు ఆనందంగా గడుపుతున్నారు. గురువారం ఆహ్లాదకరమైన వాతావరణం ఉండడంతో అందుబాటులో ఉన్న ఎడ్ల బండ్లపై పుష్కర ఘాట్‌కు ప్రయాణం చేస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. ఎడ్లబండి యజమాని ఒక్కొక్కరికి రూ.50 నుంచి 80 వరకు తీసుకుంటున్నారు. అంతేకాకుండా స్థానిక రైతులకు దీంతో ఉపాధి కూడా లభించింది.

కలెక్టర్, ఎస్పీని అభినందించిన ప్రిన్సిపల్ సెక్రటరీ



కలెక్టర్, ఎస్పీతో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సెక్రటరీ

కాళేశ్వరం, మే 22 (ఆంధ్రజ్యోతి) : వర్షం కారణంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండ చేపట్టిన చర్యలు పట్ల కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేను రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ అభినందించారు. పుష్కర ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేశారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద నుంచి పుష్కర ఘాట్ వరకు దేవాలయ పరిసరాల వరకు భక్తులకు షిల్ బస్ సేవలను పునరుద్దరించడంతో పాటు భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. భక్తులు ఉచిత రవాణా సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

వరంగల్ క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి పట్టుపడ్డ 13 మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా ఇద్దరికి న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ చారి జైలు శిక్ష విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మిగతా 11 మందికి రూ.10,500 జరిమానా విధించినట్లు తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా పట్టుబడ్డ ఐదుగురికి రూ.2.500 జరిమానా విధించారన్నారు.

సట్టా నిర్వహిస్తున్న ఒకరి అరెస్టు

ఆన్‌లైన్‌లో ఓ వ్యక్తి సట్టా నిర్వహిస్తున్నాడనే పక్కా సమాచారం మేరకు కమలాపూర్ పీఎస్ పరిధిలోని కనపర్తికి చెందిన జంగాని సురేశ్‌ను సీఐ రంజిత్ బృందం ఆదుపులోకి తీసుకొని, సదరు వ్యక్తి నుంచి రూ.10,450 స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. తదుపరి దర్యాప్తు నిమిత్తం స్థానిక పోలీసులకు అప్పగించామన్నారు.



గోపాల్‌పూర్ ఊర చెరువు వద్ద సూచనలిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

గోపాల్‌పూర్ చెరువు అభివృద్ధే లక్ష్యం

వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు

వడ్డెపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ మండలం గోపాల్‌పూర్ ఊర చెరువు అభివృద్ధే లక్ష్యమని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. గురువారం గ్రేటర్ వరగల్ 56వ డివిజన్ పరిధిలోని గోపాల్‌పూర్ ఊర చెరువుతో పాటు, జవహర్‌కాలనీ నాలా, 55వ డివిజన్ నక్షత్రకాలనీ, పోచమ్మ గుడి ప్రాంతాన్ని మేయర్ గుండు సుధారాణి, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి సందర్శించారు. క్షేత్ర స్థాయిలో సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ.. కాలనీలు ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. హైడ్రా తరహాలో నగరంలో వాడ్రా రానుందని తదుపరి ఎఫ్‌టీఎల్ జోన్‌లోని ప్రాంతాలను గుర్తించి చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. వారి వెంట 55, 56 డివిజన్ల కార్పొరేటర్లు జక్కుల రజిత వెంకటేశ్వర్లుయాదవ్, సిరంగి సునీల్ కుమార్, కాంగ్రెస్ నేతలు కొంక హరిబాబు, చింత రమేష్‌గౌడ్, కందుకూరి పూర్ణచందర్, తుపాకుల దశరథం, రుద్రోజ్ మణీంద్రనాథ్, డీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు శ్రీనివాస్, రవికుమార్, సంతోష్‌బాబు, రవికిరణ్, రాజ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

రేపు కేయూలో ఎమ్మార్పీఎస్ జిల్లా సదస్సు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్

కేయూ క్యాంపస్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ సెనెట్ హాల్‌లో మే 24న శనివారం ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ జిల్లా సదస్సును నిర్వహిస్తున్నట్లు ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్ వెల్లడించారు. గురువారం కేయూ గెస్ట్‌హౌస్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ అనుబంధ సంఘాల అత్యవసర సమావేశం ఎంఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొచ్చు తిరుపతి నేతృత్వంలో జరిగింది. ఎమ్మార్పీఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్, సంకినేని వెంకట్, పుట్ట రవి, బుర్రి సతీశ్ మాదిగలు హాజరై మాట్లాడారు. మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం లభించిన సందర్భాన్ని పురస్కరించుకుని జూన్‌లో సుబేదారి గ్రౌండ్‌లో ఎమ్మార్పీఎస్ జాతీయ కమిటీ నేతృత్వంలో ఘనంగా సన్మాన సభను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నేతలు బొక్కల నారాయణ, గంగారపు శ్రీనివాస్, బొడ్డు శాంతిసాగర్ పాల్గొన్నారు.

హనుమకొండ ఏసీపీగా నరసింహారావు బాధ్యతలు



సీపీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఏసీపీ నరసింహారావు

వరంగల్ క్రైం, మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ నూతన ఏసీపీగా గురువారం నరసింహరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. 1995 బ్యాచ్‌కు చెందిన నరసింహారావు గతంలో హనుమకొండ, జనగామ, నర్సంపేట ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించారు.

ఇంటర్ పరీక్ష రోజే డీసెట్

» విద్యార్థుల్లో ఆందోళన » వాయిదా వేయాలని డిమాండ్

వరంగల్ ఎడ్యుకేషన్, మే 22 (ఆంధ్రజ్యోతి): పరీక్షల షెడ్యూల్‌లు ప్రకటించే అధికారులు చేస్తున్న తప్పిదాలతో విద్యార్థులు నష్టపోవాల్సిన పరిస్థితులు ఏర్పడుతుంది. 25న ఇంటర్ పరీక్షతో పాటు డీఈఈ సెట్ పరీక్ష సైతం జరుగనున్నది. అయితే ఇంటర్ అర్హతతో విద్యార్థులు ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ టీచర్స్ ట్రైనింగ్ కోర్సులో ప్రవేశానికి రాయాల్సిన పరీక్ష డీసెట్‌ను రాయలేకపోతున్నట్లు వాపోతున్నారు. ఈ విషయాన్ని ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ గుర్తించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. డీసెట్ పరీక్షను మరోరోజు నిర్వహించాలని కోరుతున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

» భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర, పూజలు



హనుమాన్ జయంతిలో పాల్గొన్న కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ రాధికారెడ్డి

హనుమకొండ కల్చరల్, మే 22 (ఆంధ్రజ్యోతి): వైశాఖశుద్ధ దశమి గురువారం హనుమాన్ జయంతిని ప్రజలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. హనుమకొండ, వరంగల్ నగరాల్లోని అనేక ఆలయాల్లో కొలువై ఉన్న ప్రసన్నాంజనేయస్వామి ఆలయాలను భక్తులు సందర్శించి భక్తిశ్రద్ధలతో మొక్కుబడులు చెల్లించుకున్నారు. అంజనీపుత్రుడిగా, వీరహనుమాన్‌గా, వాయుదేవుడిగా ప్రసన్నాంజనేయస్వామి, పంచముఖ ఆంజనేయస్వామిగా భిన్నరంగాల్లో స్వామిని కొలుస్తూ 40 రోజులపాటు మండల దీక్ష చేసిన భక్తులు మాలాధారణ చేసిన భక్తులు దీక్ష విరమించుకున్నారు.

చారిత్రక వేయిస్తంభాల ఆలయ ప్రాంగణంలో కొలువై ఉన్న అతీ ప్రాచీన ప్రసన్నాంజనేయస్వామి సన్నిధిలో పెద్ద ఎత్తున పాల్గొన్న భక్తుల సమక్షంలో మహావైభవంగా గణపతి నవగ్రహ రుద్రహోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. భరతభూషణ్, సీఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత వెంకటరమణ ఉభయదాతలుగా వ్యవహరించి విశేష అన్నదానాన్ని చేశారు. ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గట్టు మహేశ్‌బాబు, పలువురు న్యాయాధికారులు పాల్గొన్న కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మతోపాటు పెండ్యాల సందీప్‌శర్మ, వేద పండితుడు గంగు మణికంఠశర్మ వైదిక కార్యక్రమాలను నిర్వహించగా ఈవో అనిల్‌కుమార్ పర్యవేక్షించారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వందలాది భక్తులు హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. జిల్లేడుపూలు, లిల్లీపూల దండలతోపాటు వినపవడలతో ప్రత్యేకంగా మాలతయారు చేసి ఆంజనేయుడికి సమర్పించారు. జైహనుమాన్, జైబోలో హనుమాన్ అంటూ దీక్ష స్వాములు చేసిన నినాదాలతో ఆలయ ప్రాంగణం దద్దరిల్లింది.

హనుమకొండలోని పద్మాక్షి రోడ్‌లోని భక్తాంజనేయస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు పరాంకుశం శ్రీమన్నారాయణచార్య ఆధ్వర్యంలో హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. స్వామివారికి సుప్రభాతం, అభిషేకం, అనంతరం మన్యసూక్త సహిత పంచసూక్త, సామూహిక అభిషేకాలు, నవగ్రహ హవనం నిర్వహించారు. వందలాది దీక్షా స్వాములు పాల్గొన్నారు. భక్తులకు విశేష అన్నదానం నిర్వహించారు. హనుమకొండ రెవెన్యూ రామాలయం, ఏటూజడ్ సమీపంలోని శ్రీభూనీలా సమేత వెంకటేశ్వర ఆలయం, ఏకశిలా పార్కు సమీపంలోని శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు జరిగాయి.

టీటీడీ ఆధ్వర్యంలో..

టీటీడీ, హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని ఆరు ప్రాంతాల్లో మన గుడి కార్యక్రమంలో భాగంగా హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించినట్లు టీటీడీ కోఆర్డినేటర్ రావిరెడ్డి కృష్ణమూర్తి చెప్పారు. ఇందులో భాగంగా హనుమకొండ రెడ్డికాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో, ఆలయ కార్యదర్శి బత్తిని వెంకటయ్య, ప్రముఖుల ఆధ్వర్యంలో వైభవంగా జరిగిన వేడుకల్లో సంస్కృత పండితుడు సముద్రాల శఠగోపాచార్య హనుమాన్ వైభవాన్ని భక్తులకు ప్రవచన రూపకంగా అందజేశారు.

● **హనుమకొండ (ఆంధ్రజ్యోతి) :** హనుమకొండ భద్రకాళి దేవాలయం టి జంక్షన్ వద్ద గల ఊళ్లో ఆంజనేయులు (యోగాంజనేయ స్వామి) గుడిలో గురువారం హనుమజ్జయంతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు గుటోజు కేదారి పూజాకార్యక్రమాలను నిర్వహించారు. భద్రకాళి చెరువు బండ్ కింద ఉన్న ఈ యోగాంజనేయ స్వామి విగ్రహం వద్ద ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు తత్తరి రాజానంద్ కుమార్ దంపతులు ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిధిగా కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, స్థానిక కాపు సంఘం నాయకుడు దాది కన్నయ్య, జంగిలి వసంతరావు, సముద్రాల శఠగోపాచార్యులు, ఆర్‌టీసీ సుధాకర్, రమణాచారి, రమేష్, సాంబరాజు రవీందర్, కుంటమల్ల ఈశ్వర్, పీపీసీ నాయకులు రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



జవహర్‌కాలనీలో శోభాయాత్ర నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

● **మడికొండ (ఆంధ్రజ్యోతి):** మడికొండలో మెట్టురామలింగేశ్వర దేవాలయంలో గురువారం హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఆంజనేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. పంచామృత నవరసాభిషేకం, చందన లేపనం, తమలపాకులతో ప్రత్యేక పూజ చేశారు. హనుమాన్ మాలధారణ భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.శేషు భారతి ఆధ్వర్యంలో జరిగిన ఈ ప్రత్యేక పూజల్లో అర్చకులు పరాశరం విష్ణువర్ధనాచార్యులు, ఆర్. అభిలాష్ శర్మ, పి.సత్యనారాయణ శర్మతోపాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. మడికొండ బురుజు దగ్గర జరిగిన హనుమాన్ జయంతి వేడుకల్లో 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

● **వడ్డెపల్లి (ఆంధ్రజ్యోతి):** హనుమకొండలోని వివిధ డివిజన్లలో హనుమాన్ జయంతిని గురు వారం అత్యంత ఘనంగా భక్తి శ్రద్దలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయ స్వామికి అభిషేకాలు చేసి అన్నదానాలు చేశారు. హనుమకొండ వడ్డెపల్లిలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ కమిటీ చైర్మన్ కటకం ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ పూజారి పులిగిల్ల విశ్వప్రసాద్ అంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, 60వ డివిజన్ కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ పాల్గొని అంజనేయ స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వడ్డెపల్లి చెరువు కట్ట ప్రాంతంలో అభయాంజనేయ స్వామి దేవాలయంలో అంజన్నకు మహాఅన్నదానం వితరణ, విశేష అభిషేకాలను ఆలయ అర్చకులు మణికొండ ప్రవీణ్‌శర్మ, హనుమాన్‌దీక్ష స్వాములు అల్లం హరిమహేందర్ పటేల్, బోదాసు దామోదర్, పాండాల విజయ్‌కుమార్, రాజేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు. జవహర్ కాలనీ అభయాంజనేయ స్వామి దేవాలయం నుంచి పురవీధులల్లో బీజేపీ రాష్ట్ర నేత బండి హరీశ్ ముదిరాజ్, కాలనీ అధ్యక్షుడు బైరి సోమయ్య ఆధ్వర్యంలో హనుమాన్ శోభయాత్ర నిర్వహించారు.

● **బాలసముద్రం :** హనుమాన్ జయంతి సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని సీతారామ ఆంజనేయస్వామి దేవాలయంలో ఏకశిలాపార్కు వాకర్స్ అసోసియోషన్ ఆధ్వర్యంలో మహాన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో సుమారు 13 వందల మందికి అన్న ప్రసాదం వడ్డించారు. ఈ సందర్భంగా వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి మాట్లాడుతూ.. వాకర్స్ మిత్రుల సహకారంతో సుమారు రూ.లక్ష వెచ్చించి అన్నప్రసాదం కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డినీలిమ దంపతులతోపాటు వాకర్స్ అసోసియోషన్ ప్రధాన కార్యదర్శి పడాల సోమయ్య, ట్రెజరర్ సుంచికాల రవీందర్, గౌరవ అధ్యక్షుడు చాడా దశరథరామిరెడ్డి, బొద్దిరెడ్డి రాజిరెడ్డి, వాకర్స్ ఇంటర్‌నేషనల్ మాజీ గవర్నర్‌లు పచ్చిమట్ల ఎల్లగౌడ్, జంగా గోపాలరెడ్డి తడక కుమారస్వామి, ప్రస్తుత గవర్నర్ కూరాకుల భారతి తదితరులు పాల్గొన్నారు.



వడ్డెపల్లి రామాలయంలో అభిషేకాలు చేస్తున్న పూజారులు, భక్తులు



అన్నప్రసాద వితరణలో పాల్గొన్న నీలిమారెడ్డి తదితరులు

సంక్షిప్త సమాచారం..

జిల్లాస్థాయి బాక్సింగ్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్ మే 22 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ డీఎస్ఏ బాక్సింగ్ హాల్‌లో జూనియర్ బాలబాలికల బాక్సింగ్ ఎంపికలు గురువారం సందడిగా ప్రారంభమయ్యాయి. ఈ ఎంపికలను బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్రకుమార్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన ఎంపిక పోటీలలో 15 మంది బాలబాలికలు పాల్గొన్నారని అన్నారు. ఇక్కడ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 24, 25 తేదీలలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్ బాక్సింగ్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాజేందర్‌తోపాటు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో నెలకొని ఉన్న 16 సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కళాశాల బోధనేతర సిబ్బంది సంఘం అధ్యక్షుడు బి.రాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కాకతీయ యూనివర్సిటీలో వీసీ కె.ప్రతాప్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం రాజు మాట్లాడుతూ.. కొంతకాలంగా కళాశాలకు సహాయక రిజిస్ట్రార్ లేరని, కళాశాల 100 ఏళ్లు పూర్తిచేసుకుంటున్న సందర్భంగా కళాశాలను అందంగా తీర్చిదిద్దేందుకు కావాల్సిన నిధులను సమకూర్చాలని, పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కాగా, వీసీ ప్రతాప్‌రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు రాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్య

మడికొండ (ఆంధ్రజ్యోతి): మానసిక వ్యాధితో తీవ్ర ఒత్తిడికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మడికొండ ఇన్‌స్పెక్టర్ పి.కిషన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాజీపేట మండలం అమ్మవారిపేటకు చెందిన మైదం చేరాలు (54).. కొంతకాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఇంతకుముందు పలు మార్లు ఆత్మహత్యకు యత్నించాడు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో పొలం వద్దకు వెళ్లి పురుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంటికి వచ్చిన కుమారుడు శరత్ తండ్రిని వెదికేందుకు పొలం వద్దకు వెళ్లే సరికి చేరాలు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. కుటుంబీకుల సహకారంతో ఎంజీఎంకు తరలించారు. చేరాలు చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుమారుడు శరత్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పాడైన మటన్, చికెన్ పట్టివేత

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ నక్కలగుట్టలోని 20'ఎస్ కిచెన్ రెస్టారెంట్‌లో సుమారు రూ.24,500 విలువ చేసే సుమారు 6 రకాల పాడైన ఉత్పత్తులు చికెన్, మటన్, బిర్యానీ, రోస్టెడ్ ఐటెమ్స్, ఇతర ఆహార పదార్థాలను సీఐ రంజిత్ బృందం సీజ్ చేశారని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. నిర్వాహకుడు ఎం.డి. సోహైల్‌ను ఆదుపులోకి తీసుకొని తదుపరి చర్యల నిమిత్తం ఫుడ్‌సేఫ్టీ అధికారి వేణుగోపాల్‌కు అప్పగించామన్నారు.

కాలం చెల్లిన ఐస్‌క్రీమ్ ఉత్పత్తుల పట్టివేత

వరంగల్ క్రైం (ఆంధ్రజ్యోతి) : లైసెన్స్ లేకుండా కాలం చెల్లిన ఐస్‌క్రీం ఉత్పత్తులను విక్రయిస్తున్న రామారంలోని సాఫ్టీడాన్ ఐస్‌క్రీం కంపెనీపై గురువారం దాడులు నిర్వహించి రూ. 1,52,000 విలువ చేసే ఉత్పత్తులను సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. ఉత్పత్తులతో పాటు నిర్వహకుడు రాచూరి లింబాద్రిని తదుపరి చర్యల నిమిత్తం ఫుడ్‌సేఫ్టీ అధికారి వేణుగోపాల్‌కు అప్పగించడం జరిగిందన్నారు. ఆహార పదార్థాల విషయంలో నిబంధనలు ఉల్లంఘించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో చింతగట్టు వాసి

(5వ పేజీ తరువాయి)

దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు రంజిత్‌కుమార్, చిన్న కుమారుడు రాకేష్(32) అలియాస్ వివేక్. తండ్రి బాబు ఆటో నడుపు కుంటూ, తల్లి స్వరూప స్కూల్‌లో వంట మనిషిగా, అన్న రంజిత్‌కుమార్ ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. రాకేష్ 2016 మేలో సీకేఎం కళాశాలలో పీజీ చేస్తుండగా మావోయిస్టు భావ జాలానికి ఆకర్షితుడై అడవిబాట పట్టాడు. ఆయన అన్న పీజీ పూర్తి చేసి ఆటో నడుపుకుంటూ భార్య, ఇద్దరు పిల్లలను పోషించు కుంటూ చింతగట్టులోనే తల్లిదండ్రులతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. రాకేష్ చింతగట్టులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి వరకు పూర్తి చేశాడు. ఇంటర్ స్నేహ జూనియర్ కళాశాలలో, ఆరోర డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. రాకేష్ సీకేఎం కళాశాలలో పీజీ చేస్తూ 2016 మేలో మావోయిస్టు బాట పట్టాడు. అప్పటి నుంచి మావోయిస్టు బాటలోనే తన ప్రస్థానాన్ని కొనసాగించినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. ఈ సందర్భంగా రాకేష్ తండ్రి బాబును పలకరించగా... 'నా కుమారుడు రాకేష్ మావోయిస్టుల బాట పట్టి 9 సంవత్సరాలైంది. ఇప్పటివరకు ఏనాడూ మా కుటుంబాన్ని కలువలేదు. కుమారుడు ఎన్‌కౌంటర్‌లో చనిపోయిండని తెలిస్తే నా భార్య గుండె పగులుతుంది. ఇలాంటి పరిస్థితి ఏ తండ్రికి రాకూడదు..' అని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, రాకేశ్ మృతదేహం శుక్రవారం చింతగట్టుకు తీసుకువస్తారని తెలిసింది.

సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి

» ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

» ప్రజా సంఘాల ప్రతినిధుల డిమాండ్



అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

వడ్డెపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): చత్తీస్‌ఘడ్ రాష్ట్రం నారాయణపూర్ జిల్లా అబూజమడ్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ గురువారం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్ ప్రాంతంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల ప్రతినిధులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం రాష్ట్ర నేత పి.రమేష్‌చందర్, తెలంగాణ ప్రజాఫ్రంట్ రాష్ట్ర, జిల్లా నేతలు బి.రమాదేవి, జనగాం కుమారస్వామి, ప్రవీణ్‌కుమార్, భరత్‌భచావో నేతలు ఓం బ్రహ్మం, రజ్‌మహ్మద్, వెంగల్‌రెడ్డి మాట్లాడారు. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ కేంద్రకమిటీ ప్రధాన కార్యదర్శి నంబళ్ల కేశవరావుతోపాటు 28 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్ రూపంలో మృతి చెందారని, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇది ముమ్మాటికీ ఎన్‌కౌంటర్ కాదని, ఏకపక్షంగా పట్టుకుని కాల్చి చంపినట్లుగా అర్థం అవుతోందని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం.. దేశంలో మావోయిస్టులు లేకుండా చూస్తామని బాహాటంగానే ప్రకటించిందని ఆరోపించారు. ఎన్‌కౌంటర్‌లతో దండకారణ్యంలోని ఆదివాసీ పల్లెలు, గూడాలు అతలాకుతలం అవుతున్నాయని, ఈ మారణహోమంలో ఆదివాసీలే బలవుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఈ ధర్నాలో వివిధ ప్రజా సంఘాల నాయకులు సారంగపాణి, ఉదయ్‌సింగ్, రాజయ్య, శ్రవణ్, ఇంద్రసేన, జ్యోతి, క్రాంతి, కరేటి శంకర్‌రావు, డాక్టర్ క్రిష్ణ, దొమ్మాటి ప్రవీణ్‌కుమార్, రాంబ్రహ్మం, మహేష్, యాకూబ్, కందికొండ బుచ్చిరాములు, పర్వేజ్, అయుబ్, అనిత, తిరుపతి, ఆయూం తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ జిల్లా చీఫ్ ప్యాట్రన్‌గా నాయిని

వరంగల్ స్పోర్ట్స్, మే 22(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్‌గా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని ఆయన నివాసంలో నాయినిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్‌కు అండగా నిలబడి చీఫ్ ప్యాట్రన్ బాధ్యతలు స్వీకరించిన ఎమ్మెల్యే నాయినికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రెసిడెంట్ రవీంద్రకుమార్, సెక్రెటరీ బి.వీరన్న, ఎర్రగట్టు స్వామి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, సెక్రెటరీ రడం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సుదర్శన్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్ గడ్డం అనిల్, తిరుపతి, ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన లారీని ఎత్తుకుపోయిన డ్రైవర్ అరెస్టు

హనుమకొండ టౌన్, మే 22 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా సరుకులను తరలిస్తుండగా డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ అధికారి సీజ్‌చేసిన లారీని ఎవరూలేని సమయంలో అదే లారీని డ్రైవర్ కె.సతీష్ ఈనెల 17న ఓరుగల్లు పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న లారీని ఎత్తుకుపోయినట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ కోదాడ ప్రాంతానికి చెందిన వ్యక్తి కాగా, అతడిపై కేసు నమోదు చేసి గురువారం పోలీసులు లారీని గుర్తించి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

కార్మికోద్యమ నేత పర్సా

హనుమకొండ చౌరస్తా, మే 22 (ఆంధ్రజ్యోతి): కార్మికుల ఉద్యమాలనే తన ఊపిరిగా మలుచుకున్న మహోన్నతమైన వ్యక్తి పర్సా సత్యనారాయణ అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ కొనియాడారు. హనుమకొండ రాంనగర్‌లోని జిల్లా సీఐటీయూ కార్యాలయంలో సత్యనారాయణ పదవ వర్ధంతిని సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వారు మాట్లాడారు. సింగరేణి కార్మికుల సమస్యలపై, అజాంజాహి మిల్లు కార్మిక సంఘాన్ని ఏర్పాటు చేసి వారి హక్కుల కోసం నిరంతరం పోరాడిన పోరాట యోధుడన్నారు. 1970లో సీఐటీయూ స్థాపన సమయంలో ఆయన కీలక భూమిక పోషించారన్నారు. నిరుపేద కుటుంబంలో జన్మించి కార్మికోద్యమ నేతగా ఎదిగారన్నారు. పర్సా సత్యనారాయణ ఆశయాల సాధనకు సీఐటీయూ నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య, ఉపాధ్యక్షులు జి.ప్రభాకర్‌రెడ్డి, బొట్ల చక్రపాణి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి జి.రాములు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎం.చుక్కయ్య, మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గొడుగు వెంకట్, గిరిజన సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి వాంకుడోత్ వీరన్న, రజక సంఘం జిల్లా కార్యదర్శి కె.కుమారస్వామి, సీఐటీయూ నాయకులు మంద మల్లేశం, ఎ.మల్లయ్య, వల్లెపు రాజు పాల్గొన్నారు.



పర్సా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

కాలాలకు అతీతం ఆయన మార్గం

ప్రపంచంలో పలు మతాలు ఉన్నాయి. పుట్టుకతోనే మనిషికి ఒక మతం ఉంటుంది. పెరిగే వయసుతోపాటు ఆ మతం తాలూకు నమ్మకాలు అతనితో పెనవేసుకుపోతాయి. కొందరిలో అవి తర్కాన్ని చిదిమేసి, మూఢనమ్మకాలవైపు నడిపిస్తాయి. ఆ మనుషులు ఏర్పరచుకున్న భావనల్లో మానవత్వం మరుగుపడిపోతుంది మనిషి, అతని నడవడిక, ఆలోచన, ఆచరణలే కేంద్రంగా ఏర్పడిన మతం... బౌద్ధం. ప్రపంచానికి ప్రేమను, కరుణను, అహింసను మొదటిసారిగా అందించినవాడు బుద్ధుడు.

ధర్మపదం

హైందవం 'బుద్ధి కర్మానుసారిణీ' అంటే... 'కర్మ బుద్ధ్యానుసారిణీ' అంటుంది బౌద్ధం. 'కర్మను బట్టి మన బుద్ధి నడుచుకుంటుంది. ఏ ఆలోచన వచ్చినా, ఆపద కలిగినా, ఉపద్రవం సంభవించినా అది మన కర్మ ఫలితమే' అనే భావన హైందవానిది. దానికి భిన్నంగా... 'మనం చేసే ప్రతి కర్మా మన ఆలోచనల ఫలితం' అని బౌద్ధం చెబుతుంది. చాలా చిన్నదిగా కనిపించే ఈ తేడా... ఆ మతాలను అనుసరించే మనుషుల మీద, సంఘం మీద పెను ప్రభావం ఎలా చూపిస్తుందనేది పరిశీలించవలసిన అవసరం ఉంది.

హిందూ ధర్మంలో కర్మ సిద్ధాంతానికి ఎంతో ప్రాధాన్యత ఉన్నదనేది మనకందరికీ తెలిసినదే. హిందువులు పవిత్ర గ్రంథంగా భావించే 'భగవద్గీత'లో కర్మ గురించి ఒక అధ్యాయమే ఉంది. అలాగే బౌద్ధం కూడా కర్మకు ప్రాధాన్యాన్నిచ్చింది. అయితే హైందవం 'బుద్ధి కర్మానుసారిణీ' అంటే... 'కర్మ బుద్ధ్యానుసారిణీ' అంటుంది బౌద్ధం. 'కర్మను బట్టి మన బుద్ధి నడుచుకుంటుంది. ఏ ఆలోచన వచ్చినా, ఆపద కలిగినా, ఉపద్రవం సంభవించినా అది మన కర్మ ఫలితమే' అనే భావన హైందవానిది. దానికి భిన్నంగా... 'మనం చేసే ప్రతి కర్మా మన ఆలోచనల ఫలితం' అని బౌద్ధం చెబుతుంది. చాలా చిన్నదిగా కనిపించే ఈ తేడా... ఆ మతాలను అనుసరించే మనుషుల మీద, సంఘం మీద పెను ప్రభావం ఎలా చూపిస్తుందనేది పరిశీలించవలసిన అవసరం ఉంది.


ధర్మచింతనా ముఖ్యమే...

ప్రతిదాన్నీ కర్మే నిర్ణయిస్తే... వ్యక్తి తను చేస్తున్న పనుల గురించి దృఢమైన ఆలోచనలు ఎలా చేయగలడు? పేదరికంలో ఉన్నవాడు, అణచివేతకు, అన్యాయాలకు గురవుతున్నవాడు ఇదంతా తన కర్మ ఫలితమేననే ఉదాసీనతకు గురవుతాడు. 'మనం ఏమిటనేది మన ఆలోచనల ఫలం, మన ఆలోచనల ఆధారంగానే మనం నిర్మితం అవుతాం' అనే 'ధర్మపదం' ప్రజలకు చేరడం, వారు అంగీకరించడం. త్రిశరణాలుగా ఖ్యాతి పొందిన 'బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి' అనేవి బుద్ధుని ప్రతీకలు. సంఘం అంటేనే మనుషుల సమూహం. నైతిక ప్రవర్తన, ధర్మ చింతన, స్వీయ పరిశీలన లేని మనుషులు ఉండే సంఘంలో అశాంతి, ఆటవికత రాజ్యం ఏలుతాయి.

కాబట్టి మనిషికి సంఘం ఎంత ముఖ్యమో... ఆ సంఘంలో ఉండే మనుషుల్లో ధర్మ చింతన కూడా అంతే ముఖ్యమని వేల సంవత్సరాల క్రితమే తెలియజెప్పిన బుద్ధుని బోధలు కాలాలకు అతీతంగా మానవతకు మార్గదర్శకాలు.

• నరసింహ ప్రసాద్ గొర్రెపాటి
94407 34501





సహజయోగ

'బాహ్య సౌందర్యం కన్నా ఆత్మ సౌందర్యం మిన్న' అనే మాట మనం తరచుగా వింటూ ఉంటాం. ఇంతకూ 'ఆత్మ సౌందర్యం' అంటే ఏవిటి? దాన్ని ఎలా పెంపొందించుకోవాలి? ఇవి తెలుసుకోవలసిన ఆసక్తికరమైన విషయాలు.

ఆ సౌందర్యమే శాశ్వతం

చాలామంది దృష్టిలో... అందానికి అంటే సౌందర్యానికి ప్రతీక - మోనాలిసా. ఆ చిత్రాన్ని గీసిన కళాకారుడు లియోనార్డో డావిన్సీ. అతను ఫ్రాన్స్‌కు చెందిన బహుముఖ ప్రజ్ఞాశాలి. అతను సృజించిన చిత్రపటం మోనాలిసా నిజానికి ఒక బిడ్డను కోల్పోయిన తల్లిది. సంతాన వియోగంతో ఆమె చాలా కాలంగా బాధపడుతూ ఉంటుంది. ఒక రోజు... తన బిడ్డ పోలికలున్న మరొకరి బిడ్డను చూసినప్పుడు.. ఆమె ముఖంలో చిరునవ్వు ఉదయించింది. దాన్ని డావిన్సీ యథాతథంగా చిత్రించారు. ఆమె ముఖంలో విరిసిన చిరునవ్వు ఎన్ని తరాలు గడచినా... ఇప్పటికీ సౌందర్యానికి ప్రతీకగా నిలిచిపోయింది. ఆధునిక కాలంలో అందానికి ఉన్న నిర్వచనాల ప్రకారం మోనాలిసా పెద్ద అందగత్తె కాదు. కానీ ఆమె సౌందర్యానికి చిహ్నంగా ఆకర్షిస్తూనే ఉంది. ఆ చిత్రపటం నుంచి వచ్చే చైతన్య తరంగాలు మానవుల అంతరాత్మను స్పృశించడమే దీనికి కారణం. అది ఆత్మ సౌందర్యాన్ని ప్రతిబింబించే చిత్రపటం. ఎందుకంటే... ఒక మహిళ ముఖంలో మాతృప్రేమ ప్రతిఫలిస్తున్నప్పుడు... ఆమె అత్యంత సుందరంగా కనిపిస్తుంది.

మీ లోపలికి చూడండి...

మానవుల దృష్టిని అధోముఖంగా తీసుకువెళ్ళే భౌతికమైన శరీర ఆకర్షణ అంత ముఖ్యమైనది కాదు. మన శరీరంలోని ప్రతి భాగం నుంచి చైతన్య తరంగాలు ప్రవహించేలా మనం ఉండాలి. మనం దేనినైనా మనం తాకితే... దాని నుంచి చైతన్య తరంగాలు ప్రవహించడం ప్రారంభించాలి. అటువంటి సౌందర్యం... దైవికమైన సౌందర్యం. బాహ్య సౌందర్యం వెంట, కృత్రిమమైన ఆకర్షణల వెంట పరుగెత్తడం మంచిది కాదు. వేల సంవత్సరాల నుంచి వారసత్వంగా పొందిన సంస్కృతీ సంప్రదాయాలు మన భారతీయులకు ఉన్నాయి. వాటిని నిలబెట్టుకోవడానికి మనం ప్రయత్నించాలి. సంప్రదాయ కళలు, ఆభరణాలు, దుస్తులు... ఇవి వేల ఏళ్ళుగా వినియోగంలో ఉన్నాయి. వాటిని మనం ఉపయోగించుకోవాలి. కానీ పాశ్చాత్య దేశాల ప్రభావంతో మనం మన సంస్కృతిని మరిపోయాం. బయటి వాటిని అనుసరిస్తున్నాం. దీనివల్ల మనం మనలోని 'ఆత్మ'గా పిలిచే అతి ముఖ్యమైన అంశం అజ్ఞానంతో కప్పడిపోతోంది. మన దేశంలో ఆత్మకు అలంకారం

> మన కళ్ళు బాహ్యమైన విషయాల మీద త్వరగా కేంద్రీకృతం అవుతాయి. మానవులమైన మన ధ్యాస ఎప్పుడూ బయటే ఉండడం దీనికి కారణం. అలాకాకుండా మన లోపలికి చూడడానికి ప్రయత్నించినప్పుడు... ఆ అంతర్ సౌందర్యాన్ని, దానిలోని ఆనందాన్ని గ్రహించగలుగుతాం.

లాంటి విషయాలు వేలకొద్దీ ఉన్నాయి. అవి ఆత్మను అణచివేయవు. కానీ మన కళ్ళు బాహ్యమైన విషయాల మీద త్వరగా కేంద్రీకృతం అవుతాయి. మానవులమైన మన ధ్యాస ఎప్పుడూ బయటే ఉండడం దీనికి కారణం. అలాకాకుండా మన లోపలికి చూడడానికి ప్రయత్నించినప్పుడు... ఆ అంతర్ సౌందర్యాన్ని, దానిలోని ఆనందాన్ని గ్రహించగలుగుతాం.

ఆ మెరుపు మీలోనే ఉంది...

మరి ఆ ఆనందాన్ని వదిలేసి... మన ధ్యాస బయట ఎందుకు తిరుగుతోంది? ఎందుకంటే అంతర్ సౌందర్యాన్ని గ్రహించగలిగే స్థితిని మనం సాధించలేదు. అందుకే ఆత్మను పాడుచేసే వాటిని ఇష్టపడుతున్నాం. కానీ ఆ సంగతి తెలుసుకోవడం లేదు. సహజయోగ దీనికి మార్గం చూపుతుంది. సహజయోగ సాధన ద్వారా తమ లోపల ఉన్న కుండలినీ శక్తి జాగృతం చేసుకున్నవారు... భగవంతుని ఆశీస్సుల వల్ల ఆత్మ స్వరూపులుగా మారుతారు. అంటే పవిత్రత, మాతృప్రేమ, సంతృప్తి, సృజనాత్మకత, ధైర్యం, అందరితో కలసిపోయే స్వభావం, క్షమాగుణం లాంటి ఆత్మకు ఉండే శుభ లక్షణాలన్నిటినీ పొందుతారు. ఈ లక్షణాలతో జీవించడం వల్ల మనం ఆత్మ సౌందర్యాన్ని పొందగలం. కాబట్టి మీ లోపల ఉన్న 'ఆత్మ' అనే వజ్రాన్ని గుర్తించండి. దాని లక్షణాలను గ్రహించండి. మీరే ఆ వజ్రం అని తెలుసుకోండి. దాని మెరుపు మీలోనే ఉంది. ఆత్మ సాక్షాత్కారం ద్వారా మీ ఆత్మ సౌందర్యం అనే ఆ మెరుపు ప్రజల్లో మీ పట్ల గౌరవాన్ని పెంచుతుంది. మీలో శాశ్వతంగా నిలిచేది అదే. కాబట్టి ఆత్మ సౌందర్యాన్ని పెంపొందించుకోవడానికి ప్రయత్నించండి. భౌతిక సౌందర్యం కోసం వెంపర్లాడి అనుకరణల జోలికి పోకుండా... మీలో ఉన్న 'మిమ్మల్ని' గుర్తించండి. అదే మీ శాశ్వతమైన విలువ. దాన్ని అభివృద్ధి చేసుకోండి.



డాక్టర్ పి. రాకేష్, 8988982200
'పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి, సహజయోగ ట్రస్ట్', తెలంగాణ

సందేశం

సలామ్.. ఒక ప్రార్థన

'సలామ్' అనే పదం అల్లాహ్ మహోన్నతమైన శుభ నామాల్లో ఒకటి. దానికి 'శాంతి ప్రదాత' అని, 'అల్లాహ్ శాంతికి మూలం. మీపై శాంతి శ్రేయస్సులు వర్షించుగాక' అని అర్థాలు ఉన్నాయి. తొలి మానవుడైన ఆదం (అలై)ను సృష్టించిన అల్లాహ్.. అతనికి అన్నిటికన్నా ముందు సలామ్ చేసే సంస్కారాన్ని నేర్పాడు.



ఎదుట ఉన్న వ్యక్తి ఒక్కరే అయినప్పటికీ... బహువచనాన్ని ఉపయోగిస్తూ సలామ్ చేయడం, బదులుగా ఎదుటి వ్యక్తి కూడా అదే రీతిలో సలామ్ చేయడం అభిలషణీయమైన పద్ధతి. "ఎవరైనా మీకు గౌరవభావంతో సలామ్ చేస్తే... మీరు అంతకన్నా ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలామ్ చేయండి. లేదా కనీసం ఆ విధంగానైనా చేయండి. ఇతరుల ఇళ్ళకు వెళ్ళినప్పుడు... వారికి సలామ్ చేసి, వారి అంగీకారం పొందిన తరువాతే లోపలికి ప్రవేశించండి. ఇది ఎంతో ఉత్తమమైన పద్ధతి. అది మేలు కోసం చేసే ప్రార్థన. అల్లాహ్ తరఫున నిర్ణయించిన ఈ పద్ధతి ఎంతో శుభవంతమైనది, పరిశుద్ధమైనది" అని దివ్య ఖుర్‌ఆన్ చెబుతోంది. ఎదుటి వ్యక్తులకు ముందుగా సలామ్ చేసేవారు అల్లాహ్ దృష్టిలో అందరికన్నా శ్రేష్ఠులనీ, తనకోసం అల్లాహ్‌ను ప్రార్థించనివాడు మూర్ఖుడైతే, సలాం చేయడంలో అలసత్వం వహించేవాడు అందరికన్నా లోభి అని అంతిమ దైవ ప్రవక్త మహమ్మద్ స్పష్టం చేశారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

గీతాసారం

నిశ్చితి-అనిశ్చితి

జీవితంలో మనకు ఎదురైన రకరకాల సందర్భాల్లో భావోద్వేగాలకు గురి అవుతూ ఉంటాం. అప్పుడు మనలో అనిశ్చితి నెలకొంటుంది. భావోద్వేగానికి లోనై... సరైన సాక్ష్యాధారాలు లేకుండా నిర్ణయాలు తీసుకోవడం, నిర్ధారణలకు రావడం, అంచనాలు

> శాశ్వతమైన నిశ్చయత అనేది సొంత జీవన అనుభవాల నుంచి వస్తుంది. ఇది డ్రైవింగ్ లేదా సైక్లింగ్ లాంటిది. అది ప్రతి ఒక్కరికీ వారి వారి సొంత అనుభవం. ఈ అనుభవాలను పుస్తకాలనుంచో లేదా ఇతరుల నుంచో అరువు తెచ్చుకోలేం. కాబట్టి దాన్ని మనం కష్టపడే సంపాదించుకోవాలి.



వేయడం లాంటివి వదిలేయాలని శ్రీకృష్ణుడు సూచించాడు. యుద్ధంలో తన బంధువులను చంపడం వల్ల ఎలాంటి మంచి జరగదనే భావనతో అర్జునుడు యుద్ధాన్ని తప్పించుకోవాలని నిర్ణయించుకున్నాడు. ఆ తరువాత... తన నిర్ణయాన్ని సమర్థించుకోవడం కోసం 'ఏది సముచితం, ఏది కాదు?' అనే చర్చను ముందుకు తెచ్చాడు. "అన్నిటికన్నా వివేకమే ఉన్నతమైనదిగా భావిస్తే నన్ను ఈ భయంకరమైన యుద్ధంలోకి ఎందుకు దించావు? ప్రసంగాలతో నాకు కలవరం కలిగించవద్దు. నా క్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని... అన్నిటికన్నా ఏది మంచిదో నాకు నిశ్చయంగా చెప్పు" అని శ్రీకృష్ణుణ్ణి అడిగాడు. ఈ ప్రశ్న అవగాహన కోసం, అన్వేషణ కోసం కాకుండా స్వీయ సమర్థనకోసం వేసినట్టు కనిపిస్తుంది.

మన పరిస్థితి కూడా అర్జునుడికన్నా భిన్నంగా ఏమీ లేదు. ఎందుకంటే... మనం ఈ లోకంలోకి వచ్చీ రాగానే... మతం, జాతి, కులం, కుటుంబ స్థితి, జాతీయత, ఆడ-మగ మొదలైన వాటితో మనకు గుర్తింపు ఏర్పడుతుంది. వాటిని నిలబెట్టుకోవడానికి, వాటిని సమర్థించుకోవడానికి జీవితాంతం పోరాడుతూనే ఉంటాం. అలాగే అర్జునుడు కూడా సమర్థన కోసం నిశ్చయమైన సమాధానాన్ని శ్రీకృష్ణుడి నుంచి ఆశిస్తున్నాడు. ఈ లోకంలో ఆశాశ్వతత్వం, అనిశ్చితి అనేవి ప్రమాణాలుగా ఉంటాయి. అంటే ఏదీ శాశ్వతం కాదు, ఏదీ నిశ్చయంగా ఉండదు. కానీ మనకు హాయిని ఇచ్చే నిశ్చయత లేదా నిశ్చితి (సర్టెనిటీ) కోసం ఎదురుచూస్తాం. హేతుబద్ధమైన నిర్ణయాలు తీసుకోవడానికి వీలుచూపే మరిన్ని విషయాలను తెలుసుకోవడానికి, అనిశ్చితిలోనే నిరీక్షించడానికి ధైర్యం, ఓర్పు కావాలి. శాశ్వతమైన నిశ్చయత అనేది సొంత జీవన అనుభవాల నుంచి వస్తుంది. ఇది డ్రైవింగ్ లేదా సైక్లింగ్ లాంటిది. అది ప్రతి ఒక్కరికీ వారి వారి సొంత అనుభవం. ఈ అనుభవాలను పుస్తకాల నుంచో లేదా ఇతరుల నుంచో అరువు తెచ్చుకోలేం. కాబట్టి దాన్ని మనం కష్టపడే సంపాదించుకోవాలి.



కె.శివప్రసాద్

సద్బోధ

బుద్ధఘోషుడి జ్ఞానదీక్ష

బౌద్ధ ధర్మంలోని మహాయాన మార్గంలో ఆచార్య నాగార్జునుడిది ఎంత గొప్ప స్థానమో... థేరవాదంలో బుద్ధఘోషుడిది అంతటి ఉన్నతమైన స్థానం. దీనికి కారణం అతనిలో నేర్చుకోవాలనే జిజ్ఞాస. జ్ఞాన సాధనకు పట్టుదల, కృషి ఎంతో అవసరమని అతని కథ చెబుతుంది. బుద్ధఘోషుడు క్రీస్తుశకం నాలుగు, అయిదు శతాబ్దాలకు చెందినవాడు. అతను తెలుగువాడనే అభిప్రాయం కూడా ఉంది. బాల్యం నుంచే జ్ఞానతృష్ణ కలిగిన బుద్ధఘోషుడు... ఎక్కడ పండితులు ఉన్నారని తెలిస్తే అక్కడికి వెళ్ళేవాడు. వారితో చర్చలు జరిపేవాడు. చివరకు ఒక బౌద్ధ విహారానికి చేరుకున్నాడు.

అతనికి ఆ విహారాధిపతి ఆచార్య రేవతుడు ఆశ్రయం ఇచ్చాడు. అప్పటికే చీకటిపడింది. నిద్రపోవడానికి ముందు బుద్ధఘోషుడు సముద్ర ఘోషలాంటి గంభీర స్వరంతో పతంజలి యోగ సూత్రాలను వల్లె వేశాడు. వాటిని జాగ్రత్తగా విన్న రేవతుడు "ప్రస్తుతానికి విశ్రాంతి తీసుకో. రేపటి ఉదయం నా వద్దకు రా" అన్నాడు.



మరుసటిరోజు ఉదయం రేవతుణ్ణి బుద్ధఘోషుడు కలుసుకున్నాడు. అప్పుడు రేవతుడు "రాత్రి గాడిదలా ఓండ్ర పెట్టింది నువ్వేనా?" అని ప్రశ్నించాడు.

అప్పుడు బుద్ధఘోషుడు "నాది గాడిద ఓండ్ర అంటున్నారే? నేను చదివినది మీకు కాస్తయినా అర్థమయిందా?" అని అడిగాడు.

రాత్రి తనకు విశ్రాంతి కోసం విహారంలో చోటు ఇచ్చిన వ్యక్తితో ఏమాత్రం తటపటాయించకుండా మాట్లాడిన బుద్ధఘోషుడి ఆత్మవిశ్వాసం, కపటంలేనితనం రేవతుడికి నచ్చాయి. ఆయన చిరునవ్వు నవ్వుతూ బుద్ధఘోషుడి భుజం తట్టి "అలా కూర్చో" అని తన ఎదుట ఉన్న ఆసనాన్ని చూపించాడు. పతంజలి యోగ సూత్రాలను చాలా స్పష్టంగా వల్లిస్తూ... వాటిపై అద్భుతమైన వ్యాఖ్య చేశాడు. ఆశ్చర్యంతో నోట మాటరాక... కొయ్యబొమ్మలా కూర్చొని వినడం బుద్ధఘోషుడి వంతయింది. తనకు 'తెలిసింది గోరంత, తెలుసుకోవలసింది కొండంత' అని అర్థమయింది. అతని అహంకారం అణగిపోయింది. రేవతుడి ముందు మోకరిల్లాడు. తనను శిష్యుడిగా స్వీకరించి జ్ఞానబోధ చేయాలని రెండు చేతులూ జోడించి ప్రార్థించాడు.

అప్పుడు రేవతుడు 'అభిదమ్మ పిటకం' నుంచి కొంత భాగాన్ని చదివి వినిపించి "దీన్ని 'సమ్మా సంబుద్ధవాదం' అంటారు. దీని గురించి తెలుసుకోవాలంటే ముందుగా ప్రవజ్య దీక్ష తీసుకోవాలి" అన్నాడు. బుద్ధఘోషుడు తక్షణమే తన అంగీకారం తెలిపాడు. అతని కంఠస్వరంలోని గాంభీర్యాన్ని చూసి... రేవతుడు ఇచ్చిన దీక్షానామమే బుద్ధఘోష. దానితో అతని అసలు పేరు మరుగున పడిపోయి... ఆ పేరే జగత్ప్రసిద్ధం అయింది. రేవతుడి శిష్యరికంలో జ్ఞానదీక్ష చేపట్టిన బుద్ధఘోషుడు త్రిపిటకాలను క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. రేవతుడి ఆదేశానుసారం సింహళద్వీపానికి వెళ్ళి అక్కడ ఆచార్యులను కలిసి, చర్చలు జరిపాడు. 'విశుద్ధ మగ్గ' అనే గ్రంథాన్ని రచించాడు. దాన్ని బౌద్ధ పండితులు 'థేరవాద సర్వస్వం'గా పరిగణిస్తారు.

• రాచమడుగు శ్రీనివాసులు

చింతన

అదే అసలైన స్వేచ్ఛ

సుఖదుఃఖాలు మన జీవితంలో రెండు భాగాలు. సుఖంగా ఉన్నప్పుడు... ఆ సుఖం అలాగే కొనసాగాలని మనిషి ఆరాటపడతాడు. దుఃఖం, బాధ కలిగినప్పుడు విలవిలలాడిపోతాడు. ఎందుకంటే ఇది మనిషి స్వభావం. మంచి చెడుల విచక్షణాభావం అందరికీ ఉంటుంది. కాని సత్యం అనేది ఒకటి ఉంది. అది మంచి చెడులకు అతీతమైనది. ఆ సత్యం మన హృదయాలలో నిక్షిప్తమై ఉంది. దానికి మీరు సుపరిచితులు కావాలని కోరుకుంటున్నాను.

సమస్యలన్నిటికీ మూలకారణం... మనమే

కష్టాల్లో, సమస్యలలో కూరుకుపోయినప్పుడు.. మనం పొందినవాటితో, మనం కోల్పోయినవాటితో జీవితాన్ని బేరీజు వేసుకుంటాం. ఉద్యోగాన్ని, కుటుంబాన్ని, బాధ్యతలను చూసుకొని... అదే తమ జీవితం అని అందరూ భావిస్తారు. కానీ జీవితం అంటే ఇవేవీ కావు. జీవితంలో అన్నిటికన్నా ముఖ్యమైనది ఏదైనా ఉందంటే... అది మనలో నడిచే శ్వాస. ఈ శ్వాస రాకపోకలు ఆగిపోయినప్పుడు... మీ గౌరవ ప్రతిష్ఠలు, మీ బంధాలు, బాంధవ్యాలు, ఉద్యోగం, ధన సంపదలు... వేటినైతే మీరు జీవితం అని ఈనాడు భావిస్తున్నారో అవన్నీ అంతమైపోతాయి. దేనివల్ల ఈ రోజు జీవించి ఉన్నారో, దేనివల్ల మీకంటూ ఈనాడు ఒక విలువ ఉందో... దాన్ని తెలుసుకోవడమే ఈ జీవితం తాలూకు సర్వ శ్రేష్ఠమైన లక్ష్యం. దాన్ని తెలుసుకోకపోతే జీవితం నిరర్థకం అవుతుంది. జీవితం ఉన్నందువల్లే సమస్యలు కూడా ఉన్నాయి. మనిషి సమస్యల నుంచి తప్పించుకోలేడు. మనకున్న సమస్యలన్నిటికీ మూలకారణం... మనమే. అవన్నీ మనం సృష్టించుకున్నవే. ఈ ప్రాపంచిక నియమావళి అందరికీ సమానమే. సమస్యలనేవి అందరినీ ఒకేలా వేధిస్తాయి. వాటన్నిటికీ కారణం... మనిషి తన భుజస్కంధాలమీద అనవసరమైన భారాన్ని మోస్తూ ఉండడం.



ఈ రోజు.... మరో అవకాశం

జీవితంలో నిరాశకు స్థానం ఉండకూడదు. జీవితంలో నిరాశతో కుంగిపోతున్న స్థితిలో కూడా... ఆశ అనేది మీలోనే ఉద్భవిస్తుంది. రేపటి రోజున సూర్యుడు తిరిగి ఉదయిస్తాడు, అస్తమిస్తాడు. ఉదయించిన సూర్యుడు తప్పనిసరిగా అస్తమించినా... మరుసటి రోజు మళ్ళీ ఉదయించి, మనకు మరొక కొత్త రోజును అందిస్తాడు. అలాగే మీ జీవితాన్ని కూడా తిరిగి ప్రారంభించడానికి మీకొక కొత్త రోజు... ప్రతిరోజూ లభిస్తుంది. ఆ రోజుకు స్వాగతం పలకండి. మీలోని ఆశాజ్యోతులను వెలిగించండి. మీలోని ఆనందాన్ని వీక్షించండి. నిన్నటి రోజు మీరు చేసిన తప్పిదాలను సరిదిద్దుకోవడానికి ఈరోజు మీకు మరొక అవకాశాన్ని కల్పిస్తోంది. కాబట్టి మీ జీవితంలో ఆశాకిరణాలను ప్రకాశింపజేయండి. ఆ భగవంతుడు మీకు ఈ శరీరాన్ని, ఈ శ్వాసను కానుకగా ఇచ్చాడు. వాటినుంచి లాభాన్ని పూర్తిగా పొందండి.

జీవితం ఒక కానుక

మీలో సాగే ఈ శ్వాస అత్యంత అమూల్యమైనదని మీరు ఎప్పుడైనా గుర్తించారా? భగవంతుడి అనుగ్రహం వల్ల... ఎవ్వరి ప్రమేయం లేకుండా తనకుతానే ఈ శ్వాస మీ లోపలికి వస్తోంది, పోతోంది. అది మీకు మళ్ళీ దొరకని ఒక అవకాశాన్ని, ఒక కానుకను అందిస్తోంది. జీవితం అనే ఆ కానుకను మనిషి అందుకోవాలి. మీరు ఈ ప్రపంచంలో ఉత్త చేతులతో జన్మించినప్పటికీ... ఉత్త చేతులతో వెనుతిరగవలసిన అవసరం లేదు. మీ వెంట ఏదైనా తీసుకువెళ్ళండి. మరి మీరు మీ వెంట దేన్ని తీసుకువెళ్ళగలరు? హృదయపాత్రను ప్రేమతో, ఆనందంతో నింపుకొంటే... దాన్ని తీసుకువెళ్ళగలరు. మీకు లభించిన ఈ శ్వాస, ఈ సమయం, ఈ జీవితం... ఇవన్నీ ఎంతో అమూల్యమైనవి. వాటని వృథా చేసుకోకూడదని మీరు గ్రహిస్తే... మీ జీవితం రూపురేఖలే మారిపోతాయి. ఆ మార్పు మీకు బయటకు కనిపించకపోవచ్చు, కానీ మీలో ఎంతో పరివర్తన వస్తుంది. మీ శ్వాస గొప్పతనాన్ని మీరు అర్థం చేసుకున్న రోజున.. మిమ్మల్ని మీరు తెలుసుకుంటారు. సందేహాలకు స్థానంలేని స్థితిలో జీవితాన్ని కొనసాగిస్తారు. మీలోనికి వచ్చే పోయే శ్వాసతో మీకు అనుబంధం ఏర్పడితే... అప్పుడు మీకు మీ జీవితం మీద ప్రేమ కలుగుతుంది. ఎప్పుడైతే మీకు మీ జీవితంపై ప్రేమ కలుగుతుందో... అప్పుడు మిమ్మల్ని మీరు స్వతంత్రులుగా భావిస్తారు. అదే మీలోని అసలైన స్వేచ్ఛ.



ప్రేమ్‌రావత్

జంగు నవీన్, సజ్జా నాగేశ్వర్‌రావు

మొత్తం 27 మంది వివరాలు ప్రకటించిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు

» నంబాల కేశవరావు బృందం మొత్తం తుడిచిపెట్టుకుపోయిందని వెల్లడి
» సుకుమాలో పేలిన ఐఈడీ.. జవాన్ మృతి, మరో ముగ్గురికి గాయాలు

చర్ల/హసన్‌పర్తి/విశాఖపట్నం/టెక్కలి, మే 22 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు కీలక నేతలు జంగు నవీన్ అలియాస్ మధు (45), సజ్జా నాగేశ్వర్‌రావు (61) కూడా మృతి చెందినట్టు గుర్తించారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు బృందం మొత్తం తుడిచిపెట్టుకుపోయినట్టు ఛత్తీస్‌గఢ్ పోలీసులు ప్రకటించారు. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మొత్తం 27 మంది మావోయిస్టుల వివరాలను గురువారం వెల్లడించారు. నారాయణపూర్ జిల్లా బీఆర్‌జీ పోలీసులు పక్కా సమాచారంతో కూంబింగ్ చేపట్టగా.. ఎదురుకాల్పులు జరిగాయని, 27 మంది మావోయిస్టులు మృతి చెందారని, వీరిలో 14 మంది మహిళలు ఉన్నట్టు ఛత్తీస్‌గఢ్ డీజీపీ గౌతమ్ చెప్పారు. వీరంతా పీఎల్‌జీఏ (పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ) 7వ బెటాలియన్ సభ్యులని, వారిపై మొత్తం రూ.3.33 కోట్లు రివార్డు ఉందన్నారు. అబూజ్‌మడ్ ఒకప్పుడు మావోయిస్టు పార్టీకి కంచుకోట అని.. ఇప్పుడక్కడ మావోయిస్టులు లేరన్నారు. అబూజ్‌మడ్‌లో ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు.


మావోయిస్టు బుర్ర రాకేశ్

బుర్ర రాకేశ్.. నంబాల కంప్యూటర్ ఆపరేటర్

అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం చింతగట్టుకు చెందిన రాకేశ్ (32) అలియాస్ వివేక్ మృతి చెందారు. ఆయన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నట్టు సమాచారం. రాకేశ్ తండ్రి బుర్ర బాబు ఆటో నడుపుతూ, తల్లి స్వరూప స్కూల్‌లో వంట మనిషిగా పనిచేస్తున్నారు. రాకేశ్ 2016 మేలో సీకేఎం కళాశాలలో పీజీ చదువుతున్న సమయంలో మావోయిస్టు భావజాలానికి ఆకర్షితుడై అడవిబాట పట్టారు. నాటి నుంచి అజ్ఞాతంలోనే ఉన్న ఆయన.. ఈ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. ఇదిలా ఉండగా.. ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా అడవుల్లో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి కోబ్రా 210 బెటాలియన్ జవాను సోలంకి (30) మృతి చెందారు. మరో ముగ్గురు జవాన్లు విక్రమ్ రాణా, మహదేవ్, ఆంటోనీరాజ్ తీవ్రంగా గాయపడ్డారు. పిడియ గుట్టల్లో కూంబింగ్‌కు వెళుతున్న సమయంలో ఈ ఘటన జరిగింది.

కేశవరావు మృతదేహం అప్పగింతలో జాప్యం!

మావోయిస్టు పార్టీ కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించేందుకు మరింత సమయం పట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. కేశవరావు స్వస్థలం శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి మండలంలోని జీయన్నపేట. అక్కడేఆయన అంత్యక్రియలు నిర్వహించాలని కుటుంబసభ్యులు నిర్ణయించారు. మృతదేహాన్ని తెచ్చేందుకు కుటుంబసభ్యులు గురువారం ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్‌పూర్ వెళ్లారు. అక్కడి పోలీసులు మృతదేహాన్ని మూడ్రోజుల తర్వాత అప్పగిస్తామని చెప్పినట్టు సమాచారం. మృతదేహం ఇస్తే తప్ప కదలబోమని కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. 'వెంటనే వెళ్లకుంటే మీపైనా కాల్పులు జరుపుతా'మని పోలీసులు హెచ్చరించడంతో వారు వెనుదిరిగినట్టు తెలిసింది. కాగా కేశవరావు ఎన్‌కౌంటర్‌పై పౌరహక్కుల సంఘం ప్రతినిధులు శుక్రవారం హైకోర్టులో రిట్ పిటిషన్ వేయనున్నట్లు తెలిసింది. దీనికి సంబంధించి కేశవరావు తల్లి భారతమ్మ సంతకాలు సేకరించినట్టు సమాచారం.


కుటుంబసభ్యుల నుంచి రిలేషన్ సర్టిఫికెట్‌పై సంతకాలు తీసుకుంటున్న అధికారులు

కళాశాల నుంచి ఉద్యమ బాట!

» మావోయిస్టు పత్రికకు చీఫ్ ఎడిటర్‌గా బాధ్యతలు
» అగ్రనేత సజ్జా వెంకట నాగేశ్వరరావు ప్రస్థానం

చీరాల, మే 22 (ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్‌లో ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా చీరాల మండలం దేవాంగపురి పంచాయతీ జాండ్రపేటకు చెందిన మావోయిస్టు అగ్రనేత సజ్జా వెంకట నాగేశ్వరరావు అలియాస్ రాజన్న మృతి చెందారు. వీరిది చేనేత కుటుంబం. తల్లిదండ్రులు బాలగంగాధరరావు, సుబ్బరావమ్మ. నాగేశ్వరరావుకు చిన్నతనం నుంచి ముక్కుసూటిగా ఉండేవారనే పేరుంది. ఒంగోలులో విద్యాభ్యాసం తర్వాత పాలిటెక్నిక్ చదివేందుకు 16వ ఏట గుంటూరు వెళ్లారు. అక్కడే మావోయిస్టు సిద్ధాంతాలకు ఆకర్షితులై అడవిబాట పట్టారు. 1980ల్లో కొంతకాలం జైలు జీవితం గడిపారు. తర్వాత పూర్తిగా అజ్ఞాతంలోకి వెళ్లారు. మావోయిస్టు పత్రిక 'అవామ్-ఇ-జంగ్'లో వివిధ బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఆ పత్రికకు చీఫ్ ఎడిటర్‌గా ఉన్నారు. తాజా ఎన్‌కౌంటర్‌లో మరణించారు. ఆయన మృతదేహం కోసం కుటుంబ సభ్యులు గురువారం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారు. స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

కొందరిది అడవి బాట.. మరికొందరిది గెలుపుబాట

» వేర్వేరుదారుల్లో వరంగల్ ఆర్ఈసీ పూర్వ విద్యార్థులు
» పీపుల్స్ వార్ గ్రూప్‌లో అనేక మంది నాయకులు ఈ సంస్థ నుంచే..
» నంబాల కేశవరావు ఇంజనీరింగ్ చదివింది ఇక్కడే

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి

వరంగల్ ఆర్ఈసీ... దేశ, విదేశాల్లోని అనేక ప్రముఖ సంస్థల్లో విజయవంతంగా పని చేసిన తెలుగు ఇంజనీరింగ్ నిపుణులను అందించిన ఘనత ఈ విద్యా సంస్థకు దక్కుతుంది. మరోవైపు పీపుల్స్‌వార్ గ్రూప్‌లో అనేక మంది సమర్థులైన నాయకులు కూడా ఇదే సంస్థ నుంచి వచ్చారు. అయితే వీరిలో బుధవారం ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ప్రముఖుడు. హనుమకొండలో ప్రస్తుతం ఎన్ఐటీగా ఉన్న ప్రఖ్యాత ఇంజనీరింగ్ విద్యా సంస్థ ఆర్ఈసీగా నాడు ప్రసిద్ధి. దేశవ్యాప్తంగా పేరుగాంచిన ఈ సంస్థ నుంచి ఉత్తీర్ణులైన అత్యధికులు దేశ, విదేశాల్లో గౌరవప్రదమైన ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఈ కళాశాల విద్యార్థి అయిన కావూరి సాంబశివరావు దేశ, విదేశాల్లో కాంట్రాక్టులు చేపట్టడమేకాకుండా కేంద్ర మంత్రి కూడా అయ్యారు. మరోవైపు విప్లవం వర్ధిల్లాలి అంటూ నినదిస్తూ అడవిబాట పట్టి అమరులైన అనేకులు కూడా ఇందులో విద్యనభ్యసించారు. పీపుల్స్‌వార్‌కు ప్రాణం పోసిన రాడికల్ విద్యార్థి సంఘానికి ఈ కాలేజీ కేంద్ర బిందువుగా ఉండేది. నంబాల కేశవరావు, ఇతర రాడికల్ విద్యార్థి సంఘం నాయకుల గురించి తాము చాలా విన్నామని, విద్యార్థి సంఘం ఎన్నికల సందర్భంగా ఏబీవీపీ, ఆర్ఎస్‌యూ గొడవలు ఆ కాలంలో సహజమని 1970ల్లో అందులో ఇంజనీరింగ్ చేసి.. ప్రస్తుతం గల్ఫ్‌లో ఉంటున్న ఓ ఇంజనీరింగ్ ప్రముఖుడు చెప్పారు. హాస్టళ్లో నక్సలైట్ల కార్యకలాపాలు ఉధృతంగా కొనసాగుతున్న ఆ కాలంలో తన తండ్రి తనకు బయట నివాసం ఏర్పాటు చేయడంతో సుబేదారిలో ఉండి చదువుకున్న తర్వాత తాను విదేశాలకు వచ్చానని చెప్పారు. పలు ప్రముఖ ఇంజనీరింగ్ సంస్థల్లో పని చేసిన ఆయన ప్రస్తుతం సొంత వ్యాపారం చేస్తున్నారు.

నంబాల ఎన్‌కౌంటర్‌ను ఖండించిన సీపీఎం

న్యూఢిల్లీ, మే 22: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మంది మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌ను సీపీఎం తీవ్రంగా ఖండించింది. మావోయిస్టులు చర్చల కోసం పలుమార్లు విజ్ఞప్తి చేసినా కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం పట్టించుకోలేదని సీపీఎం పొలిట్ బ్యూరో ఒక ప్రకటనలో విమర్శించింది. ప్రభుత్వాలు చర్చల ద్వారా పరిష్కారానికి ప్రయత్నించకపోగా అమానుష హత్యాకాండకు పాల్పడడమే తమ విధానంగా మార్చుకున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. మావోయిస్టులను అంతం చేస్తామంటూ కేంద్ర హోం మంత్రి డెడ్‌లైన్ ప్రకటిస్తుండడం, చర్చల అవసరం లేదని ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి చెబుతుండడం వారి ఫాసిస్టు మనస్తత్వానికి నిదర్శనమని, వారి తీరు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొంది. కేంద్రం వెంటనే చర్చల కోసం మావోయిస్టుల విజ్ఞప్తిని అంగీకరించాలని, వారిపై పారా మిలిటరీ ఆపరేషన్లను నిలిపివేయాలని కోరింది.

కర్రెగుట్ట కూడా.. నక్సల్బరీ అంత చరిత్రాత్మకమే

» 5 దశాబ్దాల ఉద్యమం ఇప్పుడు ఆవశ్యకతను కోల్పోయింది
» తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి సుదీప్ లఖ్తాకియా వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): దాదాపు ఐదు దశాబ్దాల క్రితం 1967 మేలో నక్సల్బరీలో జన్మించిన నక్సలైట్ ఉద్యమం ఎంత చరిత్రాత్మకమో.. కర్రెగుట్టలో జరిగిన నక్సల్స్ నిర్మూలన ఉద్యమం కూడా అంతే చరిత్రాత్మకం, కవితాత్మకంగా భావిస్తానని తెలంగాణ కేడర్ ఐపీఎస్ అధికారి, జాతీయ భద్రతా గార్డు(ఎన్ఎస్‌జీ) బ్లాక్ కమాండో దళం మాజీ డైరెక్టర్ జనరల్ సుదీప్ లఖ్తాకియా అన్నారు. నక్సల్స్ ఏరివేతలో ఎంతో అనుభవం ఉన్న ఆయన.. ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో పనిచేశారు. నక్సల్స్ నిర్మూలనకు ప్రత్యేకంగా ఏర్పర్చిన గ్రే హౌండ్స్‌కు సారథ్యం వహించారు. సీఆర్‌పీఎఫ్ ప్రత్యేక డీజీగా బాధ్యతలు నిర్వర్తించారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శితో పాటు అనేక మంది నక్సల్స్ మరణించడం ఐదు దశాబ్దాల ఉద్యమానికి తీవ్ర విఘాతమని ఆయన పేర్కొన్నారు. సమకాలీన ప్రపంచంలో ఆధునిక భారతంలో పూర్తిగా ఆవశ్యకత కోల్పోయిన ఒక సిద్ధాంతానికి మృత్యుఘంటికలు ధ్వనిస్తున్నాయని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధికారం తుపాకి గొట్టం ద్వారా రాదని.. పరిజ్ఞానం, టెక్నాలజీ మాత్రమే మన ప్రజలు, సమూహాల తలరాతల్ని నిర్ణయించగలదని లఖ్తాకియా అభిప్రాయపడ్డారు. ఈ ఐదు దశాబ్దాల హింసాత్మక మార్గంలో ఎందరో అమాయక ప్రజలు తమ జీవితాల్ని కోల్పోవడం విషాదకరమని ఆవేదన వెలిబుచ్చారు. కాగా.. మొదట్లో మావోయిజాన్ని ఎదుర్కోవడంలో వ్యూహపరమైన తప్పిదాలు కొన్ని జరిగాయని లఖ్తాకియా అన్నారు. నక్సల్స్ ఉద్యమ రూపాన్ని అర్థం చేసుకోవడంలో, కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఐక్యతలో, ఇంటెలిజెన్స్ సేకరణలో ఈ తప్పిదాలు జరిగాయని పేర్కొన్నారు. మావోయిస్టు ఉద్యమ రహస్య స్వభావాన్ని అర్థం చేసుకోవడంలో కూడా ఆలస్యం జరిగిందని.. రహస్యం వల్లనే ఆ సంస్థ ఉనికిలో కొనసాగిందని ఆయన అన్నారు. అందులో వ్యక్తులు ఎన్నో అలియాస్ పేర్లతో పనిచేస్తారని.. వారిని గుర్తించడానికి ప్రత్యేక ఇంటలిజెన్స్ ఆపరేషన్ అవసరమని.. గతంలో ఈ ఆపరేషనల్ ఇంటెలిజెన్స్ వల్లనే గ్రేహౌండ్స్ విజయాలు సాధించిందని ఆయన చెప్పారు.


చిత్రజ్యోతి
SINCE 1965

కేన్స్ వేదికపై విశ్వంభర



చిరంజీవి కథానాయకుడిగా వశిష్ఠ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'విశ్వంభర'. యూవీ క్రియేషన్స్ బేనర్‌పై విక్రమ్ రెడ్డి, ప్రమోద్, వంశీ నిర్మిస్తున్నారు. నిర్మాత విక్రమ్‌రెడ్డి గురువారం కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొన్నారు. అక్కడ నిర్వహించిన కార్యక్రమంలో 'విశ్వంభర' విశేషాలతో ప్రత్యేకంగా రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఆ పుస్తకానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని త్వరలో వెల్లడిస్తామని ఆయన చెప్పారు. అలాగే ఈ సినిమా కథ, వీఎఫ్ఎక్స్‌కు ఉన్న ప్రాధాన్యం గురించి విక్రమ్‌రెడ్డి వివరించారు. 'విశ్వంభర' నిర్మాణానంతర కార్యక్రమాలు తుదిదశలో ఉన్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రంలో త్రిష, ఆషికా రంగనాథ్ కథానాయికలు. సంగీతం: కీరవాణి, సినిమాటోగ్రఫీ: ఛోటా కె. నాయుడు

నవ్వులూ... చర్చలు



రామ్‌చరణ్ కథానాయకుడిగా బుచ్చిబాబు సాన తెరకెక్కిస్తున్న చిత్రం 'పెద్ది'. మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వెంకటసతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన గ్లింప్స్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. దాదాపు 30 శాతం షూటింగ్ పూర్తైంది. తాజాగా, ఈ సినిమాకు సంబంధించిన ఓ కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లో గురువారం ప్రారంభమైంది. ఇందుకోసం ఓ విలేజ్ సెట్‌ను నిర్మించారు. సుదీర్ఘంగా సాగే ఈ షెడ్యూల్‌లో భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు బుచ్చిబాబు, నటుడు దివ్యేందు శర్మతో కలసి తీసుకున్న ఫొటోను రామ్‌చరణ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేశారు. 'నవ్వులు, చర్చలు, విపరీతమైన హార్డ్ వర్క్‌తో నిండిన ఈ షెడ్యూల్ హుషారుగా సాగుతోంది' అని పేర్కొన్నారు. ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయిక. జగపతిబాబు, శివరాజ్‌కుమార్, దివ్యేందు శర్మ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఏ.ఆర్.రెహ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రత్నవేలు. వచ్చే ఏడాది మార్చి 27న సినిమా విడుదలవుతోంది.

మరోసారి సమావేశం

తెలుగు చలనచిత్ర పరిశ్రమ

సినిమాలను థియేటర్లలో ఆడించాలంటే అద్దె విధానం బదులు, పర్సెంటేజీ పద్ధతిని అమలు చేయాలని, లేదంటే జూన్ 1 నుంచి థియేటర్లలో షోలు నిలిపివేస్తామని ఎగ్జిబిటర్లు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు ఏ నిర్ణయం తీసుకుంటారా అనే ఆసక్తి సర్వత్రా నెలకొంది. ఇప్పటికే విడివిడిగా నిర్మాతలూ, ఎగ్జిబిటర్లు సమావేశమయ్యారు. అయినా పరిష్కారం ఓ కొలిక్కి రాకపోవడంతో ఫిల్మ్ ఛాంబర్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. నిర్మాతలూ, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లతో ఓ కమిటీ వేసి మరోసారి సమావేశం నిర్వహించనుంది. శనివారం జరిగే మీటింగ్‌లో ఈ సమస్యకు ఒక పరిష్కారం దొరకవచ్చని అందరూ భావిస్తున్నారు. జూన్ 5న కమల్‌హాసన్ నటించిన 'థగ్‌లైఫ్', జూన్ 12న పవన్‌కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' విడుదలకు సిద్ధమవుతుండడంతో ఈ మీటింగ్‌లో థియేటర్ల విషయంలో ఎగ్జిబిటర్లు తీసుకునే నిర్ణయం కీలకమవ్వనుంది.



రాజకీయాల్లో బిజీగా ఉన్న ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, తాను అంగీకరించిన చిత్రాలను వరుస పెట్టి పూర్తి చేయాలనే లక్ష్యంతో మేకర్స్‌కు కాల్షీట్లు కేటాయిస్తున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఆయన నటించిన 'హరిహర వీరమల్లు' చిత్రం షూటింగ్ పూర్తయి, జూన్ 12న విడుదలకు సిద్ధమైంది. ఇటీవలె ఆయన నటిస్తున్న మరో చిత్రం 'ఓజీ' షూట్ కూడా తిరిగి ప్రారంభమైనట్లు నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు. పవన్ కల్యాణ్ నటిస్తున్న మరో చిత్రం గురించి తాజాగా అప్డేట్ వచ్చింది. ఆయన నటిస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రం షూటింగ్ కూడా త్వరలోనే పునః ప్రారంభించనున్నట్లు మేకర్స్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. "పవన్ కల్యాణ్ కెరీర్‌లోనే గొప్ప పాత్రను తెరపై చూసి వేడుక చేసుకోవడానికి సిద్ధంగా ఉండండి. ఇది అభిమానులకు, సినీ ప్రియులకు కన్నులపండుగ లాంటిది. ఈ ప్రాజెక్ట్ అనేక సంవత్సరాలు గుర్తుండిపోయేలా ఉంటుంది. త్వరలోనే షూట్‌ను రీస్టార్ట్ చేస్తున్నాం" అని నిర్మాణ సంస్థ మైత్రీ మూవీమేకర్స్ పేర్కొంది. హరీశ్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో పవన్‌కల్యాణ్ శక్తిమంతమైన పోలీసాఫీసర్‌గా కనిపించనున్నారు. నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్ నిర్మిస్తున్నారు.

ప్రచారకర్తగా తమన్నా



కన్నడ సంఘాల ఆగ్రహం

కర్ణాటక ప్రభుత్వ రంగ సంస్థ 'కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్' ఉత్పత్తులైన 'మైసూరు శాండల్ సోప్' బ్రాండ్‌కు ప్రముఖ కథానాయిక తమన్నా భాటియాను ప్రచారకర్తగా నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రెండేళ్లపాటు ప్రచారకర్తగా నియమించుకునేందుకుగాను రూ.6.20 కోట్లు చెల్లించేందుకు ఆమెతో ఒప్పందం చేసుకొంది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని పలు కన్నడ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ సంస్థకు కన్నడ నటులను కాకుండా ఒక పరభాషా నటిని ప్రచారకర్తగా ఎలా నియమిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

నాయకుడు కంటే పెద్ద హిట్ అవుతుంది

కమల్ హాసన్




'నేను మనసు పెట్టి చేసిన ప్రతి సినిమా గొప్ప విజయాన్ని సాధించింది. ఇలాంటి సినిమా మళ్లీ మళ్లీ రాదు. అందుకే సినిమాను బాగా ప్రమోట్ చేయడానికి ప్రయత్నిస్తున్నాను. 'నాయకుడు' కంటే 'థగ్ లైఫ్' పెద్ద విజయం సాధిస్తుంది' అని అన్నారు సీనియర్ నటుడు కమల్ హాసన్. ఆయన హీరోగా మణిరత్నం దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'థగ్ లైఫ్'. త్రిష, శింబు కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రం జూన్ 5న థియేటర్లలో విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమల్ హాసన్ మాట్లాడుతూ 'మణిరత్నం సినిమాలో నేను నటించను, జస్ట్ బిహేవ్ చేస్తాను. 'ఇంద్రుడు చంద్రుడు' సినిమాకు తనికెళ్ల భరణి రాయాల్సింది. కానీ కుదరలేదు. ఆయనతో కలసి మరింత ప్రయాణం చేయాలని ఉంది' అని అన్నారు. దర్శకుడు మణిరత్నం మాట్లాడుతూ 'చాలా కాలం తర్వాత కమల్‌తో సినిమా చేసే అవకాశం వచ్చినందుకు సంతోషంగా ఉంది. ఆయన 'నాయకుడు' సమయంలో ఎలా ఉన్నారో ఇప్పుడు కూడా అలానే ఉన్నారు' అని అన్నారు. నిర్మాత సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 'ఇంతకు ముందు కమల్‌హాసన్ నటించిన రెండు సినిమాలు నేనే రిలీజ్ చేశాను. అవి బ్లాక్ బస్టర్ అయ్యాయి. ట్రైలర్, పాటలు చూసిన తర్వాత ఈ సినిమా కూడా బ్లాక్ బస్టర్ అవుతుందనే నమ్మకం కలిగింది' అని అన్నారు.

డ్రగ్స్ కోసం ప్రత్యేక బడ్జెట్



మలయాళ నిర్మాత శాండ్రా థామస్ ఆరోపణ

మలయాళ చిత్ర పరిశ్రమలో కొందరు డ్రగ్స్ తీసుకుంటున్నారంటూ ఆరోపణలు రావడం.. ఈ క్రమంలో వారిని అరెస్టు చేయడం తెలిసిందే. తాజాగా, మలయాళ పరిశ్రమలో డ్రగ్స్ వాడకం గురించి సంచలన ఆరోపణలు చేశారు నటి, నిర్మాత శాండ్రా థామస్. "చిత్రసీమలో మాదకద్రవ్యాల వాడకం ఎక్కువైంది. సెట్స్‌లో అది ఒక సాధారణ వ్యవహారంగా మారిపోయింది. అంతేకాక, వాటి కోసమే ప్రత్యేకంగా బడ్జెట్, గదులను కేటాయిస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఎవరూ కఠిన చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఓ ఐదు.. పదేళ్ల ముందే మాదకద్రవ్యాల వాడకాన్ని అరికట్టి ఉండాల్సింది. ఇప్పుడు అందరూ మాదకద్రవ్యాలకి అలవాటు పడుతున్నారు. ఈ వ్యవహారంపై నోరువిప్పితే ఎక్కడ తమ ప్రాజెక్టులు ఆగిపోతాయన్న భయంలో నిర్మాతలు ఉన్నారు" అని పేర్కొన్నారు.



హృదయాన్ని కదిలించే బృందావనం



లవ్, సెంటిమెంట్ అంశాల మేళవింపుగా తెరకెక్కిన చిత్రం 'బృందావనం'. బాలు, షిన్నోవా జంటగా నటించారు. బొత్స సత్య దర్శకత్వంలో కిశోర్ టీ, వెంకట్ ఆర్ నిర్మించారు. మైత్రీ మూవీస్ ఈ చిత్రాన్ని శుక్రవారం విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకు హీరో నారా రోహిత్ ముఖ్య అతిథిగా హాజరై 'బృందావనం' ఘన విజయం అందుకోవాలని ఆకాంక్షించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. తెరపై అందమైన ప్రణయ భావనల్ని ఆవిష్కరిస్తుంది' అని చెప్పారు. అందమైన సంగీత ప్రయాణం ఈ చిత్రం, ప్రతి ఒక్కరి హృదయాన్ని కదిలించే సున్నితమైన ప్రేమకథతో దర్శకుడు అద్భుతంగా రూపొందించాడు' అని నిర్మాతలు చెప్పారు.

అన్ని హంగులతో అలరిస్తుంది



విజయ్ సేతుపతి, రుక్మిణి వసంత్ జంటగా దర్శకనిర్మాత అరుముగ కుమార్ తెరకెక్కించిన చిత్రం 'ఏస్'. శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తోంది. తెలుగులో శ్రీ పద్మిని సినిమాస్ బ్యానర్‌పై బి. శివప్రసాద్ విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విజయ్ సేతుపతి మాట్లాడుతూ 'నాకు మొదట అవకాశం ఇచ్చిన అరుముగ కుమార్‌తో మళ్లీ సినిమా చేసినందుకు ఆనందంగా ఉంది. ఇందులో యాక్షన్, రొమాన్స్ వంటి అన్ని వాణిజ్య హంగులు ఉన్నాయి. అందరినీ ఆకట్టుకునేలా ఈ సినిమా ఉంటుంది' అని అన్నారు. నిర్మాత బి. శివప్రసాద్ మాట్లాడుతూ 'అందరి ముఖాల్లో సంతోషం చూస్తుంటే విడుదలకు ముందే ఈ సినిమా హిట్ అయినట్టు కనిపిస్తోంది. విజయ్‌తో 'రొమాంటిక్ డాన్' అనే సినిమాను త్వరలోనే ప్రకటిస్తాను' అని అన్నారు. 'ఈ చిత్రం విందు భోజనంలా ఉంటుంది. విజయ్ సేతుపతి ఆల్ రౌండర్. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే అవుతుంది' అని చిత్ర దర్శకనిర్మాత అరుముగ కుమార్ అన్నారు.

ప్రేమకథలో పలు మలుపులు



పలు సూపర్‌హిట్ సినిమాలు, వెబ్ సిరీస్‌తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన తమిళ హీరో శ్రీరామ్ తాజా చిత్రం 'నిశ్శబ్ద ప్రేమ'. ప్రియాంక తిమ్మేష్ కథానాయిక. రాజ్ దేవ్ దర్శకత్వంలో లవ్, రొమాంటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని కార్తికేయన్ ఎస్ నిర్మించారు. శుక్రవారం విడుదలవుతోంది. ఈ సందర్భంగా హీరో శ్రీరామ్ మాట్లాడుతూ 'లవ్‌స్టోరీలో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలిగిన గ్రిప్పింగ్ మూవీ ఇది. అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. తమిళంలో ఇప్పటికే హిట్ అయింది. మంచి సినిమాకు భాషా భేదాలు లేవు కనుక ఇక్కడ కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అన్నారు.

అమ్మ ఆశీస్సులతో...



ఆద్యంతం వినోద ప్రధానంగా సాగే కుటుంబ కథా చిత్రం 'వైభవం'. సాత్విక్ దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఆయన సోదరుడు రుత్విక్ హీరోగా నటించారు. శుక్రవారం ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో సాత్విక్ మాట్లాడుతూ 'మా అమ్మ రమాదేవి కోరిక మేరకు సినిమాల్లోకి అడుగుపెట్టాం. మా అమ్మే నిర్మాత. ఆమె ఆశీస్సులతో సినిమా ఘన విజయం అందుకుంటుందని ఆశిస్తున్నాం' అని చెప్పారు.

మార్ష్ శతక మోత

● లఖ్‌నవూ ఘనవిజయం ● పూరన్ హాఫ్ సెంచరీ
● గుజరాత్‌కు ఝలక్ ● రాణించిన షారుక్



మిచెల్ మార్ష్ (64 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 117)

అహ్మదాబాద్: వరుసగా నాలుగు ఓటములతో ప్లేఆఫ్స్‌కు దూరమైన లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ ఎట్టకేలకు అదరగొట్టింది. పట్టికలో అగ్రస్థానాన కొనసాగుతున్న గుజరాత్ టైటాన్స్‌ను వారి సొంతగడ్డపైనే దీటుగా ఎదుర్కొంది. ఓపెనర్ మిచెల్ మార్ష్ (64 బంతుల్లో 10 ఫోర్లు, 8 సిక్సర్లతో 117) తొలి శతకం సాధించగా.. పూరన్ (27 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 56 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఆ తర్వాత బౌలర్లు కూడా కట్టడి చేయడంతో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంత్ సేన 33 పరుగుల తేడాతో టైటాన్స్‌ను మట్టికరిపించింది. అటు గుజరాత్‌కిది కేవలం నాలుగో ఓటమి కాగా.. లఖ్‌నవూ ఆరు విజయాలు, 12 పాయింట్లతో కాస్త మెరుగైంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 2 వికెట్లకు 235 పరుగులు చేసింది. మార్‌క్రమ్ (36) సహకరించాడు. ఆ తర్వాత ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 202 పరుగులు చేసింది. షారుక్ (57), రూథర్‌ఫోర్డ్ (38), గిల్ (35), బట్లర్ (33) రాణించారు. ఓరౌర్కీకి 3, అవేశ్.. బదోనిలకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా మార్ష్ నిలిచాడు. ఇదిలావుండగా క్యాన్సర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా గుజరాత్ జట్టు లావెండర్ రంగు జెర్సీలతో బరిలోకి దిగింది.

షారుక్ పోరాడినా..: గుజరాత్ బ్యాటింగ్ బలమంతా టాపార్డర్‌పైనే ఆధారపడి ఉంటుంది. కానీ 236 పరుగుల కష్టసాధ్యమైన ఛేదనలో వీరంతా ఓ మాదిరి స్కోరుకే పరిమితమయ్యారు. ఒక్కరు కూడా హాఫ్ సెంచరీ సాధించకపోగా.. తొలి పది ఓవర్లలోనే ఈ త్రయాన్ని పెవిలియన్‌కు చేర్చి లఖ్‌నవూ బౌలర్లు పైచేయి సాధించారు. అయితే ఈసారి మిడిలార్డర్ ఆదుకునే ప్రయత్నం చేయగలిగింది. ఇన్నింగ్స్ తొలి బంతినే ఓపెనర్ సాయి సుదర్శన్ ఫోర్‌గా మలిచాడు. అటు మూడో ఓవర్‌లో మరో ఓపెనర్ గిల్ హ్యాట్రిక్ ఫోర్లతో ధాటిని కనబర్చాడు. సాయిని పేసర్ ఓరౌర్కీ పెవిలియన్‌కు చేర్చగా.. బట్లర్ ఆరో ఓవర్‌లో 4,6,6,4తో 21 పరుగులు రాబట్టి పవర్‌ప్లేను 67/1తో ముగించాడు. కానీ స్వల్ప వ్యవధిలో ఈ ఇద్దరూ పెవిలియన్‌కు చేరడంతో టైటాన్స్ షాక్‌కు గురైంది. ఇక కష్టమే అనుకున్న వేళ మిడిలార్డర్‌లో రూథర్‌ఫోర్డ్-షారుక్ జోడీ నుంచి ప్రతిఘటన ఎదురైంది. నాలుగో వికెట్‌కు వీరు 86 పరుగులు జత చేశారు. కుదురుకునేందుకు కాస్త సమయం తీసుకున్నా 14వ ఓవర్‌లో 17 రన్స్‌తో ఛేదన వైపు తీసుకెళ్లారు. స్పిన్నర్ షాబాజ్ ఓవర్‌లో రూథర్‌ఫోర్డ్ 4,6 షారుక్ 6తో 19 రన్స్ వచ్చాయి. తర్వాతి ఓవర్‌లోనే షారుక్ 4,6,4 బాదడంతో సమీకరణం 4 ఓవర్లలో 54కు చేరింది. దీంతో మ్యాచ్ ఇరువైపులా మొగ్గుచూపింది. కానీ ఓరౌర్కీ 17వ ఓవర్‌లో నాలుగు పరుగులే ఇచ్చి రూథర్‌ఫోర్డ్, తెవాటియా (2)ల వికెట్లు తీసి ఎల్ఎస్‌జీ శిబిరంలో జోష్ నింపాడు. 19వ ఓవర్‌లో షారుక్ కూడా వెనుదిరగ్గా, అప్పటికే సమీకరణం క్లిష్టంగా మారింది. ఆరు బంతుల్లో 38 పరుగులు చేయాల్సి రావడంతో టైటాన్స్ ఓటమి ఖాయమైంది.

టాపార్డర్ హవా: పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించడంతో టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఇన్నింగ్స్ దూసుకెళ్లింది. ఎప్పటిలాగే ఓపెనర్లు మార్ష్, మార్‌క్రమ్‌తో పాటు నికోలస్ పూరన్ అదరగొట్టాడు. ఆరంభంలో బంతి అనూహ్యంగా బౌన్స్ కాగా.. మార్ష్‌కు సైతం పలుమార్లు శరీరానికి బంతి తాకడంతో విలవిల్లాడాడు. పవర్‌ప్లేలో పెద్దగా మెరుపులు లేకపోవడంతో ఎల్ఎస్‌జీ 58 రన్స్‌తో ఫర్వాలేదనిపించింది. ఆ తర్వాత మార్ష్ జోరు పెంచాడు. ప్రసిద్ధ్ ఓవర్‌లో 4,6 బాదిన తను స్పిన్నర్ సాయి కిశోర్ ఓవర్‌లో సిక్సర్ సాధించాడు. అయితే చక్కగా కుదురుకున్న ఈ జోడీని పదో ఓవర్‌లో సాయి విడదీశాడు. మార్‌క్రమ్‌ను అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 91 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత మార్ష్-పూరన్ జోడీ టైటాన్స్ బౌలర్లపై విరుచుకుపడింది. పూరన్ తన తొలి బంతినే సిక్సర్‌గా మలిచాడు. ఇక స్పిన్నర్ రషీద్ తొలి ఓవర్‌లో మార్ష్ చెలరేగి 6,4,6,4,4తో 25 పరుగులు రాబట్టాడు. అటు కిశోర్ ఓవర్‌లో 4,6.. సిరాజ్ ఓవర్‌లో 4,6,4తో పూరన్ ఎదురుదాడికి దిగడంతో లఖ్‌నవూ స్కోరు రాకెట్ వేగంతో సాగింది. మరోవైపు మార్ష్ 56 బంతుల్లోనే శతకం పూర్తి చేసుకోగా.. 18వ ఓవర్‌లో రెండు సిక్సర్లు బాది స్కోరును 200 దాటించాడు. ధాటిగా ఆడుతున్న ఈ ఓపెనర్‌ను అర్షద్ ఖాన్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 52 బంతుల్లోనే 121 పరుగుల మెరుపు భాగస్వామ్యానికి తెర పడింది. చివరి ఓవర్‌లో పంత్ (16 నాటౌట్) రెండు సిక్సర్లు బాది 20 రన్స్ అందించడంతో లఖ్‌నవూ స్కోరు 230 దాటింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	13	9	4	0	18	0.602
బెంగళూరు	12	8	3	1	17	0.482
పంజాబ్	12	8	3	1	17	0.389
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	13	6	6	1	13	0.019
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	13	5	6	2	12	0.193
హైదరాబాద్	12	4	7	1	9	-1.005
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	13	3	10	0	6	-1.030

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (సి) షారుక్ (బి) సాయి కిశోర్ 36; మార్ష్ (సి) రూథర్‌ఫోర్డ్ (బి) అర్షద్ ఖాన్ 117; పూరన్ (నాటౌట్) 56; పంత్ (నాటౌట్) 16; ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 20 ఓవర్లలో 235/2. వికెట్ల పతనం: 1-91, 2-212; బౌలింగ్: సిరాజ్ 4-0-37-0; అర్షద్ 3-0-36-1; రబాడ 4-0-45-0; ప్రసిద్ధ్ 4-0-44-0; సాయికిశోర్ 3-0-34-1; రషీద్ 2-0-36-0.

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) మార్‌క్రమ్ (బి) ఓ రౌర్కీ 21, గిల్ (సి) సమద్ (బి) అవేశ్ 35, బట్లర్ (బి) ఆకాశ్ సింగ్ 33, రూథర్‌ఫోర్డ్ (సి-సబ్) బిష్ణోయ్ (బి)ఓ రౌర్కీ 38, షారుక్ (సి-సబ్) బిష్ణోయ్ (బి) అవేశ్ 57, తెవాటియా (సి) హిమ్మత్ సింగ్ (బి) ఓ రౌర్కీ 2, అర్షద్ (సి) ఓ రౌర్కీ (బి) షాబాజ్ 1, రషీద్ ఖాన్ (నాటౌట్) 4, రబాడ (బి) బదోని 2, సాయి కిషోర్ (బి) బదోని 1, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం: 20 ఓవర్లలో 202/9; వికెట్లపతనం: 1-46, 2-85, 3-96, 4-182, 5-186, 6-193, 7-197, 8-200, 9-202; బౌలింగ్: ఆకాశ్ సింగ్ 3.1-0-29-1, ఆకాశ్ దీప్ 4-0-49-0, ఓ రౌర్కీ 4-0-27-3, అవేశ్ ఖాన్ 3.5-0-51-2; షాబాజ్ 4-0-41-1, బదోని 1-0-4-2.

ఒకే సీజన్‌లో ఎక్కువ మంది (9) 500+ స్కోర్లు సాధించడం ఐపీఎల్‌లో ఇదే తొలిసారి.

1 ఓ సీజన్‌లో 25 అంతకంటే తక్కువ బంతుల్లోనే ఎక్కువ (5) ఫిఫ్టీలు సాధించిన బ్యాటర్‌గా పూరన్.

నేటి మ్యాచ్

బెంగళూరు x హైదరాబాద్ | వేదిక బెంగళూరు | రా.7.30 నుంచి



ఆయుష్ మాత్రే, వైభవ్

ఆయుష్‌కు అండర్-19 పగ్గాలు

వైభవ్ సూర్యవంశీకి చోటు
ఇంగ్లండ్ టూర్‌కు భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో అదరగొడుతున్న యువ సంచలన బ్యాటర్లు ఆయుష్ మాత్రే, వైభవ్ సూర్యవంశీలపై సెలెక్టర్ల దృష్టి పడింది. వచ్చే నెలలో ఇంగ్లండ్‌లో పర్యటించే భారత అండర్-19 జట్టు కెప్టెన్‌గా మాత్రేను ఎంపిక చేశారు. జూన్ 24 నుంచి జూలై 23 వరకు ఇంగ్లండ్ అండర్-19తో భారత కుర్రాళ్లు ఐదు యూత్ వన్డేలు, రెండు నాలుగు రోజుల టెస్టులు ఆడనున్నారు. జట్టులో మొత్తం 16 మంది ఆటగాళ్లున్నారు. జట్టులో హైదరాబాద్‌కు చెందిన వికెట్ కీపర్ రాపోలు అలంకృత్ స్టాండ్‌బై ఆటగాడిగా ఎంపికయ్యాడు. కాగా వేలంలో అన్‌సోల్డ్‌గా మిగిలిన 17 ఏళ్ల మాత్రే చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ రుతురాజ్ గాయపడడంతో జట్టులోకి వచ్చి ఓపెనర్‌గా చెలరేగుతున్నాడు. ఆడిన ఆరు మ్యాచ్‌ల్లోనే 206 పరుగులు సాధించాడు. ఇక 14 ఏళ్ల వైభవ్ విధ్వంసం అందరికీ తెలిసిందే. ఇప్పటికే ఓ మెరుపు శతకం కూడా బాదేయడంతో తనకు అండర్-19 జట్టులో చోటు ద్వారా ప్రమోషన్ లభించినట్టయ్యింది.

యూఏఈ కొత్త చరిత్ర

● బంగ్లాపై టీ20 సిరీస్ విజయం

దుబాయ్: బంగ్లాదేశ్‌పై టీ20 సిరీస్‌ను సొంతం చేసుకోవడం ద్వారా యూఏఈ జట్టు చరిత్ర సృష్టించింది. మూడు మ్యాచ్‌ల టీ20ల సిరీస్‌లో భాగంగా బుధవారం రాత్రి జరిగిన ఆఖరి మ్యాచ్‌లో యూఏఈ 7 వికెట్ల తేడాతో బంగ్లాను ఓడించింది. తొలుత బంగ్లా 20 ఓవర్లలో 162/9 స్కోరు చేసింది. జాకర్ అలీ (41), తన్జిద్ హసన్ (40) టాప్ స్కోరర్లు. హైదర్ అలీ మూడు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో యూఏఈ 19.1 ఓవర్లలో 166/3 స్కోరు చేసి గెలిచింది. అలీషాన్ షరాఫు (68 నాటౌట్), ఆసిఫ్ ఖాన్ (41 నాటౌట్) తుదికంటా క్రీజులో నిలిచి జట్టును గెలిపించారు.

క్వార్టర్స్‌లో శ్రీకాంత్

కపిల-తనీష జోడీ కూడా ● మలేసియా మాస్టర్స్





కౌలాలంపూర్: మలేసియా మాస్టర్స్‌లో భారత షట్లర్ కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్స్‌కు చేరుకోగా.. హెచ్ఎస్ ప్రణయ్ రెండో రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. గురువారం జరిగిన ప్రీక్వార్టర్స్‌లో శ్రీకాంత్ 23-21, 21-17తో ఎన్‌గుయన్ (ఐర్లాండ్)పై చెమటోడ్చి గెలిచాడు. ప్రణయ్ 9-21, 18-21తో యుషి తనాక (జపాన్) చేతిలో, సతీష్ కుమార్ కరుణాకరన్ 14-21, 16-21తో క్రిస్టో పొపోవ్ (ఫ్రాన్స్) చేతిలో పరాజయం పాలయ్యారు. మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిల-తనీషా క్రాస్టో 21-17, 18-21, 21-15తో ఫ్రాన్స్‌కు చెందిన జూలియన్ మయో-లీ పలెర్మోపై గెలిచి ముందంజ వేసింది. మహిళల డబుల్స్‌లో ప్రేరణ అల్వేకర్-మృణ్మయి దేశ్‌పాండే జంట 9-21, 14-21తో హసు హుయ్-లిన్ జి యున్ చేతిలో ఓడింది.



రైజాకు రజతం

షుల్ (జర్మనీ): ఐఎస్ఎస్ఎఫ్ జూనియర్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ రైజా ఢిల్లాన్ రజతం సాధించింది. గురువారం జరిగిన మహిళల స్కీట్ 60 షాట్ల ఫైనల్లో ఒలింపియన్ రైజా 51 టార్గెట్లను గురి చూసి కొట్టింది. ఫోబీ బాడ్లీ స్కాట్ (బ్రిటన్) స్వర్ణం, అనబెల్లా హెట్మర్ (జర్మనీ) కాంస్యం సాధించారు.

ముంబైకి పెనాల్టీగా నోబాల్

ముంబై: ముంబై ఇండియన్స్-ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య బుధవారం జరిగిన మ్యాచ్‌లో నోబాల్‌ను పెనాల్టీగా విధించారు. ఐదో ఓవర్ మూడో బంతి వేసే సమయంలో ఆఫ్‌సైడ్‌లో కేవలం ముగ్గురు ఫీల్డర్లు మాత్రమే ఉన్నారు. ఇది నిబంధనలకు విరుద్ధం. ఎంసీసీ నిబంధనల ప్రకారం బంతి వేసే సమయానికి లెగ్‌సైడ్ వైపు ఐదుగురికి మించి ఉండరాదు. అయితే ఆ సమయంలో ఆరుగురు ఫీల్డర్లు ఉండడంతో అంపైర్ నోబాల్‌ను పెనాల్టీగా విధించాడు.



జొకోవిచ్

ఒకే పార్శ్వంలో జొకో, సిన్నర్

25 నుంచి ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో మాజీ చాంపియన్ నొవాక్ జొకోవిచ్‌కు కఠినమైన డ్రా ఎదురైంది. వరల్డ్ నెం:1 జానిక్ సిన్నర్, గతేడాది రన్నరప్ అలెగ్జాండర్ జ్వెరెవ్, జొకోవిచ్ ఒక పార్శ్వంలో తలపడనున్నారు. గురువారం సింగిల్స్ మెయిన్ డ్రాను నిర్వాహకులు విడుదల చేశారు. డిఫెండింగ్ చాంప్, వరల్డ్ నెం:2 కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్) తొలి రౌండ్‌లో నిషికోరితో, అమెరికా ఆటగాడు మెకెంజీ మెక్‌డొనాల్డ్‌తో జొకోవిచ్ తలపడనున్నారు. జొకో ముందంజ వేస్తే క్వార్టర్స్‌లో జ్వెరెవ్.. అదీ దాటితే సెమీస్‌లో సిన్నర్‌తో అమీతుమీ తేల్చుకోవాల్సి రావచ్చు. మహిళల డ్రాలో డిఫెండింగ్ చాంప్ ఇగా స్వియటెక్ తొలి రౌండ్‌లో రెబెక్కా స్రమ్‌కొవాతో తలపడనుంది. అయితే, క్వార్టర్స్ చేరితే గతేడాది రన్నరప్ పౌలినీతో స్వియటెక్ ఆడే అవకాశం ఉంటుంది.

బిజినెస్



బజాజ్ చేతికి కేటీఎం?

మెజారిటీ వాటాల కొనుగోలుకు ప్రయత్నాలు

న్యూఢిల్లీ: రుణాల ఊబిలో కూరుకుపోయి కష్టాలు పడుతున్న ఆస్ట్రియాకు చెందిన బైక్‌ల తయారీ కంపెనీ కేటీఎంలో మెజారిటీ వాటాలు కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు బజాజ్ ఆటో ప్రకటించింది. తమ పూర్తి యాజమాన్య సంస్థ బజాజ్ ఆటో ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ బీవీ ద్వారా ఈ కొనుగోలు చేయాలనుకుంటున్నట్టు వెల్లడించింది. ఇందుకోసం ఇప్పటికే 80 కోట్ల యూరోల (రూ.7,765 కోట్లు) రుణ ప్యాకేజి సమకూర్చినట్టు తెలిపింది. అన్ని రకాల అనుమతులు సాధించినట్టయితే కేటీఎంలో ప్రస్తుతం మైనారిటీ వాటాలున్న బజాజ్ మెజారిటీ వాటాలతో ఆ కంపెనీ యజమానిగా మారుతుందని ఆ ప్రకటనలో పేర్కొంది. ఉమ్మడి అభివృద్ధి కార్యక్రమం కింద భారత్ కేంద్రంగా నిర్వహిస్తున్న కేటీఎం వ్యాపారాల్లో వేగం పెంచే కృషిని కొనసాగిస్తామని బజాజ్ తెలిపింది. ఈ కార్యక్రమం కింద ఉభయ సంస్థలు ఉమ్మడిగా బైక్‌ల అభివృద్ధి, తయారీ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. 80 దేశాలకు ఎగుమతి చేస్తున్నాయి. కేటీఎం రుణ పునర్నిర్మాణానికి, వ్యాపారాల కొనసాగింపునకు తాము సమకూర్చిన నిధులు ఉపయోగపడతాయని కంపెనీ ఆ ప్రకటనలో తెలిపింది. ఆ 80 కోట్ల యూరోల్లో 20 కోట్ల యూరోలు ఇప్పటికే అందించామని, మిగతా సొమ్మును త్వరలో సమకూరుస్తామని కూడా పేర్కొంది. అత్యంత కీలక దశలో నిధులు సమకూర్చడంతో పాటు యాజమాన్య బాధ్యతలు కూడా చేపట్టడం ద్వారా కేటీఎం భవిష్యత్తును నిర్దేశించగల శక్తిగా బజాజ్ నిలుస్తుందని కంపెనీ తెలిపింది.

అదానీ లాభాల పంట



రూ.90,000 కోట్లకు చేరిన స్థూల లాభం

న్యూఢిల్లీ: అదానీ గ్రూప్ కంపెనీలు మార్చి 31వ తేదీతో ముగిసిన 2025 ఆర్థిక సంవత్సరంలో లాభాల మోత మోగించాయి. గ్రూప్ కంపెనీలన్నింటి స్థూల లాభం రూ.90,000 కోట్లకు చేరింది. 21 నెలల పాటు రుణాలు చెల్లించేందుకు అవసరమైన నగదు నిల్వ జమ అయింది. ఆరేళ్లలో గ్రూప్ స్థూల లాభాలు మూడింతలు పెరిగి రూ.24,870 కోట్ల నుంచి (2018-19) రూ.89,806 కోట్లకు (2024-25) చేరినట్టు కంపెనీ ప్రకటించింది. 2024 ఆర్థిక సంవత్సరంతో ఆర్జించిన రూ.82,976 కోట్లతో పోల్చితే లాభం 8.2% పెరిగింది. ఆరేళ్ల కాలంలో (2019-2025) 24% సమీకృత వార్షిక వృద్ధి (సీఏజీఆర్) నమోదయింది. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో గ్రూప్ కంపెనీలు రూ.40,565 కోట్ల నికర లాభం ఆర్జించాయి. నికర లాభం ఆరేళ్ల సీఏజీఆర్ 48.5% ఉంది. ఇదే కాలంలో కంపెనీ స్థూల ఆస్తులు 25% సీఏజీఆర్‌తో రూ.6,09.133 లక్షల కోట్లకు చేరాయి. స్థూల రుణాలు 2024 ఆర్థిక సంవత్సరంతో పోల్చితే రూ.2.41 లక్షల కోట్ల నుంచి రూ.2.9 లక్షల కోట్లకు చేరాయి. రూ.53,843 కోట్ల నగదు నిల్వను కూడా పరిగణనలోకి తీసుకుంటే గ్రూప్ కంపెనీల నికర రుణభారం రూ.2.36 లక్షల కోట్లుగా నమోదయింది.

ఆస్తులపై రాబడులు (ఆర్ఓఏ) 16.5 శాతంగా ఉన్నాయి. ప్రపంచంలో మౌలిక వసతుల రంగంలోని కంపెనీల్లో గరిష్ఠ ఆర్ఓఏ ఇదేనని గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రాబీ సింగ్ తెలిపారు. లాభాల్లో అద్భుత వృద్ధి కారణంగా స్థూల లాభాల్లో రుణాల వాటా 2019 నాటి 3.8% నుంచి 2025 ఆర్థిక సంవత్సరం నాటికి 2.6 శాతానికి తగ్గింది. స్థూల లాభాల్లో 82% మౌలిక వసతుల విభాగం నుంచే వచ్చినట్టు ఆయన చెప్పారు. అదానీ గ్రూప్ మౌలిక వసతుల విభాగంలో యుటిలిటీ కంపెనీలు అదానీ గ్రీన్ ఎనర్జీ, అదానీ పవర్, అదానీ ఎనర్జీ సొల్యూషన్స్, అదానీ టోటల్ గ్యాస్; రవాణా కంపెనీలు అదానీ పోర్ట్స్, సెజ్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ ఉన్నాయి. పన్ను చెల్లింపుల అనంతర నగదు నిల్వ 13.6% వృద్ధితో రూ.66,527 కోట్లున్నదని, భారీ నగదు ప్రవాహం కారణంగా రికార్డు స్థాయిలో రూ.1.26 లక్షల కోట్ల ఆస్తులు జోడయ్యాయని రాబీ సింగ్ తెలిపారు. అదానీ పోర్ట్‌ఫోలియోలో ఇంత భారీగా ఆస్తులు జోడు కావడం ఇదే ప్రథమమని పేర్కొంటూ దీని వల్ల మొత్తం ఆస్తుల విలువ రూ.6.1 లక్షల కోట్లకు చేరినట్టు ఆయన వెల్లడించారు. ఈ మొత్తంలో నాలుగింట మూడు వంతుల ఆస్తులు గల ఆరేళ్ల కాలంలోనే జోడయ్యాయన్నారు.

ఐటీసీ లాభాలు అంతంతే

క్యూ4 లాభం రూ.6,416.85 కోట్లు



న్యూఢిల్లీ: మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో ఐటీసీ లిమిటెడ్ లాభాలు నామమాత్రంగానే పెరిగాయి. ఈ కాలానికి కంపెనీ రూ.18,266 కోట్ల కన్సాలిడేటెడ్ ఆదాయంపై రూ.6,416.85 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 9.2 శాతం పెరిగినా నికర లాభంలో వృద్ధి మాత్రం రెండు శాతమే ఉంది. ఆదాయం భారీగా పెరగడానికి ఐటీసీ హోటల్స్ విభజన (డీమెర్జర్) ద్వారా సమకూరిన రూ.15,179 కోట్ల రాబడి ప్రధానంగా దోహదం చేసింది. అనుబంధ కంపెనీలను మినహాయించి (స్టాండ్ అలోన్) చూసినా క్యూ4లో ఐటీసీ ఆర్థిక ఫలితాలు అంత ఆశాజనకంగా లేవు. ఈ కాలానికి కంపెనీ రూ.17,248 కోట్ల ఆదాయంపై రూ.4,874 కోట్ల నికర లాభం నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయం 9.6 శాతం పెరిగినా నికర లాభం మాత్రం 0.8 శాతం మాత్రమే పెరిగింది.

ఆర్థిక సంవత్సరం మొత్తానికి

2024-25 ఆర్థిక సంవత్సరం మొత్తాన్ని పరిగణనలోకి తీసుకున్నా రూ.73,465 కోట్ల ఆదాయంపై ఐటీసీ రూ.20,092 కోట్ల నికర లాభం నమోదు చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఆదాయం 10.2 శాతం పెరిగినా, నికర లాభం మాత్రం నామమాత్రంగా రూ.182 కోట్లు మాత్రమే పెరిగింది. ఉత్పత్తి ఖర్చులు పెరిగిపోవడం, డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండడం ఇందుకు ప్రధాన కారణమని కంపెనీ తెలిపింది.

ఒక్కో షేరుపై రూ.7.85 చొప్పున డివిడెండ్

ఆర్థిక ఫలితాలు అంతంత మాత్రంగానే ఉన్నా వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.7.85 చొప్పున తుది డివిడెండ్ చెల్లించాలని ఐటీసీ బోర్డు సిఫారసు చేసింది. ఈ ఏడాది మార్చిలో ప్రకటించిన రూ.6.5 మధ్యంతర డివిడెండ్‌ను కూడా కలిపితే 2024-25 ఆర్థిక సంవత్సరానికి కంపెనీ ఒక్కో షేరుపై వాటాదారులకు రూ.14.35 చొప్పున డివిడెండ్ చెల్లించినట్టవుతుంది. రూపాయి ముఖ విలువ ఉన్న కంపెనీ షేర్లపై ఇది 1,435 శాతానికి సమానం.

త్వరలోనే ఎన్ఎస్ఈ ఐపీఓ

న్యూఢిల్లీ: ఎన్ఎస్ఈ ఐపీఓకు త్వరలోనే మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని సెబీ చీఫ్ తుహిన్ కాంత పాండే చెప్పారు. అయితే ఎప్పటిలోగా సెబీ నుంచి ఇందుకు అనుమతి లభిస్తుందనే విషయాన్ని చెప్పేందుకు నిరాకరించారు. ఢిల్లీలో అసోచాం నిర్వహించిన ఒక సదస్సుకు హాజరైన ఆయన విలేకరుల ప్రశ్నలకు స్పందిస్తూ ఐపీఓకు నిరభ్యంతర పత్రం జారీ చేసేందుకు తాము లేవనెత్తిన అభ్యంతరాలపై ఎన్ఎస్ఈతో చర్చిస్తున్నామన్నారు. సెబీ అభ్యంతరాలతో ఎన్ఎస్ఈ ఐపీఓ గత ఎనిమిదేళ్లుగా పెండింగ్‌లో ఉంది.

13 కోట్లు దాటిన మార్కెట్ ఇన్వెస్టర్లు

దేశాభివృద్ధికి క్యాపిటల్ మార్కెట్ ప్రస్తుతం ఇంధనంలా మారిందని సెబీ చీఫ్ అన్నారు. దేశంలో స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టే మదుపరుల సంఖ్య ప్రస్తుతం 13 కోట్లు దాటిపోయిందన్నారు. 2019 మార్చితో పోలిస్తే ఇది మూడింతలు ఎక్కువన్నారు. 1996-2010 మధ్య పుట్టిన ప్రతి ముగ్గురు జనరేషన్-జెడ్ యువతలో ఒకరు ఈక్విటీ లేదా మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెడుతున్నట్టు వెల్లడించారు. ఇండస్‌ఇండ్ బ్యాంకు ఉన్నతోద్యోగుల భారీ అక్రమాలపై తాము కూడా దృష్టి పెట్టినట్టు ఆయన తెలిపారు.



మార్కెట్లోకి కొత్త ఆల్ట్రోజ్

టాటా మోటార్స్ అత్యంత ప్రజాదరణ పొందిన ఆల్ట్రోజ్ కారు కొత్త వెర్షన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. సరికొత్త హంగులతో తయారుచేసిన ఈ కారు ప్రారంభ ధర రూ.6.89 లక్షలు కాగా హై ఎండ్ వెర్షన్ ధర రూ.11.49 లక్షలు. ఆరు ఎయిర్‌బ్యాగ్‌లు, ఐదు ఆకర్షణీయమైన రంగుల్లో ఇది అందుబాటులో ఉంటుంది. ప్రీమియం డిజైన్, అసాధారణ భద్రతా ఫీచర్లు, అత్యాధునిక టెక్నాలజీ దీని ప్రత్యేకతలని కంపెనీ తెలిపింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

23వ తేదీ			
హైదరాబాద్	500	విజయవాడ	530
వరంగల్	502	గోదావరి	517
చిత్తూరు	613	విశాఖపట్నం	545
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	111
కర్నూలు	120	నెల్లూరు	116
విశాఖపట్నం	116	అనంతపురం	116
గోదావరి	119		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,910 ▲	89,650 ▲	1,12,000 ▲
విజయవాడ	98,500 ▼	92,500 ▼	99,200 ▼
విశాఖపట్నం	99,020 ▲	89,750 ▲	1,12,000 ▲
రాజమండ్రి	97,910 ▲	89,750 ▲	1,00,300 ▼
ప్రొద్దుటూరు	96,600 ▲	88,770 ▲	1,00,000 ▲
ముంబై	95,516 ▲	87,493 ▲	96,519 ▼

అమ్మకాల ఒత్తిడితో కుంగిన మార్కెట్

ముంబై: అమెరికా, జపాన్ దేశాల బాండ్లపై రాబడులు పెరిగిన నేపథ్యంలో ప్రపంచ మార్కెట్ల నుంచి అందిన ప్రతికూల సంకేతాల నేపథ్యంలో భారత స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాలను చవి చూశాయి. రిస్క్ తీసుకోవడానికి విముఖత ప్రదర్శించిన ఇన్వెస్టర్లు భారీ స్థాయిలో అమ్మకాలు సాగించారు. ఐటీ, ఆయిల్, ఎఫ్ఎంసీజీ షేర్లలో అమ్మకాల జోరుతో సెన్సెక్స్ 644.64 పాయింట్ల నష్టంతో 80,951.99 వద్ద ముగిసింది. ఇండస్ ఇండ్ బ్యాంక్, భారతి ఎయిర్‌టెల్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు మినహా సెన్సెక్స్‌లోని 27 కంపెనీల షేర్లు నష్టాల్లోనే ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1106.71 పాయింట్లు నష్టపోయి 80,489.92 పాయింట్ల ఇంట్రాడే కనిష్ఠ స్థాయిని తాకింది. నిఫ్టీ 203.75 పాయింట్ల నష్టంతో 24,609.70 వద్ద ముగిసింది. అమెరికన్ బాండ్లపై రాబడులు 5% స్థాయిని, జపాన్ బాండ్లపై రాబడులు 3.5% స్థాయిని దాటడంతో రిస్క్‌తో ముడిపడి ఉన్న షేర్లను ఇన్వెస్టర్లు భారీ సంఖ్యలో విక్రయించడం ప్రపంచ మార్కెట్లన్నింటినీ కుంగదీసిందని విశ్లేషకులంటున్నారు.

బ్లూవాటర్ లాజిస్టిక్స్ ఇష్యూ ధర రూ.132-135: హైదరాబాద్‌కు చెందిన బ్లూవాటర్ లాజిస్టిక్స్ లిమిటెడ్ ఇష్యూ వచ్చే మంగళవారం ప్రారంభం కాబోతోంది. షేర్ల ధర శ్రేణిని కంపెనీ రూ.132-135గా ప్రకటించింది. ఇష్యూ ద్వారా రూ.40.50 కోట్లు సమీకరించాలన్నది లక్ష్యంగా తెలిపింది. షేర్లను ఎన్ఎస్ఈ ఎమర్జ్ ప్లాట్‌ఫారంపై లిస్టింగ్ చేస్తారు. ఇష్యూ గురువారం ముగుస్తుంది. ఒక్కోటి రూ.10 ముఖవిలువ గల 30 లక్షల ఈక్విటీ షేర్లను బుక్ బిల్డింగ్ విధానంలో విడుదల చేస్తారు. రిటైల్ ఇన్వెస్టర్లకు 10.10 లక్షల ఈక్విటీ షేర్లను రిజర్వ్ చేశారు.

ఇండస్ ఇండ్‌ను ఆదుకునేందుకు సిద్ధం: అశోక్ హిందుజా

న్యూఢిల్లీ: ఉన్నతోద్యోగుల అక్రమాలతో కష్టాల్లో ఉన్న ఇండస్‌ఇండ్ బ్యాంకును ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నట్టు హిందుజా గ్రూప్ ప్రకటించింది. అవసరమైతే బ్యాంకుకు మరిన్ని నిధులు సమకూర్చేందుకూ సిద్ధంగా ఉన్నట్టు బ్యాంకు ప్రమోటర్ కంపెనీ ఐఐహెచ్ఎల్ చైర్మన్ అశోక్ హిందుజా ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల అక్రమాలతో బయటపడిన నష్టాన్ని సరిదిద్దేందుకు బ్యాంకు తాత్కాలిక మేనేజ్‌మెంట్ వేగంగా తీసుకుంటున్న చర్యలను ఆయన ప్రశంసించారు.

కోలుకున్న షేర్లు: క్యూ4 ఆర్థిక ఫలితాలతో ఇండస్‌ఇండ్ బ్యాంకు షేర్లు బీఎస్ఈలో గురువారం తీవ్ర అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్యాంకును ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామన్న హిందుజా గ్రూప్ ప్రకటనతో కోలుకుంది. చివరికి 1.82 శాతం లాభంతో రూ.785.10 వద్ద ముగిసింది.

అమెరికాలో కొండెక్కిన వడ్డీ రేట్లు

న్యూయార్క్: అమెరికాలో వడ్డీ రేట్లు మరింత కొండెక్కాయి. ఆ దేశ కేంద్ర బ్యాంకు 20 సంవత్సరాల కాల పరిమితి ఉండే 1600 కోట్ల డాలర్ల కేంద్ర ప్రభుత్వ రుణపత్రాలను వేలానికి పెడితే మదుపరుల నుంచి పెద్దగా స్పందన లభించలేదు. దాంతో 30 ఏళ్ల కాలపరిమితి ఉండే ప్రభుత్వ రుణ పత్రాలపై వడ్డీరేటు 5.12 శాతానికి, ఇరవై సంవత్సరాల కాల పరిమితి ఉండే రుణ పత్రాలపై వడ్డీరేటు 5.13 శాతానికి చేరాయి. పదేళ్ల కాల పరిమితి రుణ పత్రాలపై చెల్లించే వడ్డీరేటు కూడా 4.6 శాతానికి చేరింది.


జూరాల ప్రాజెక్టు గేట్ల వద్ద దిగువకు పారుతున్న వరద నీరు

జూరాల ప్రాజెక్టులో వరద నీటి వృథా

» పూర్తి కాని రూఫ్ వే తాడు మరమ్మతులు

అమరచింత, మే 22 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు రెండ్రోజులుగా వచ్చి చేరుతున్న వరద నీరు దిగువకు పారి వృథా అవుతోంది. ప్రాజెక్టు 49, 56 గేట్ల వద్ద స్టాప్‌లాక్ ఎలిమెంట్ పైకి ఎక్కి వరద నీరు దిగువకు పారుతోంది. ఈ నీటి వృథాకు అధికారుల నిర్లక్ష్యమే కారణమనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజానికి, గత ఏడాది వరద సమయంలో జూరాల ప్రాజెక్టులోని 8 గేట్ల వద్ద రోప్ వే తాడు దెబ్బతింది. దీంతో ప్రాజెక్టు అధికారులు ప్రస్తుత వేసవిలో మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. అయితే, అధికారుల అలసత్వం వల్ల ఇప్పటివరకు మూడు గేట్ల పనులు మాత్రమే పూర్తయ్యాయి. ప్రస్తుతం 40, 49, 56 గేట్ల వద్ద పనులు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఒక్కో గేటు వద్ద ఐదు స్టాప్ లాక్ ఎలిమెంట్ సెంటర్లను దిగువకు దించి.. ముందు భాగంలోని షెట్టర్లను ఎత్తి రోప్‌వేకి మరమ్మతులు చేస్తున్నారు. అయితే, రెండ్రోజులుగా ప్రాజెక్టుకు ఎగువ నుంచి భారీగా వరద నీరు వస్తోంది. గురువారం 8,953 క్యూసెక్కుల వరద వచ్చింది. కానీ, 40, 49, 56 గేట్ల వద్ద స్టాప్ లాక్ ఎలిమెంట్ గేట్ల పైకి ఎక్కి వరద నీరు దిగువకు పారుతోంది. అధికారులు సకాలంలో పనులు పూర్తి చేసి ఉంటే ఇలా నీరు వృథా అయ్యేది కాదని స్థానిక రైతులు అంటున్నారు. ఈ విషయమై ప్రాజెక్టు అధికారి బీచుపల్లిని వివరణ కోరగా.. గేట్ల వద్ద మరమ్మతులు కొనసాగుతున్నాయని, ఒక్కసారిగా వరద రావడంతో కొన్ని గేట్ల వద్ద నీరు దిగువకు పారుతుందని చెప్పారు.

తెలంగాణకు 10.26.. ఏపీకి 4 టీఎంసీలు

» ఉత్తర్వులు జారీ చేసిన కృష్ణా బోర్డు

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బేసిన్ నుంచి ఏపీకి 4 టీఎంసీలు, తెలంగాణకు 10.26 టీఎంసీలు కేటాయిస్తూ కృష్ణా బోర్డు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం శ్రీశైలంలో కనీస నీటిమట్టానికి ఎగువన(800 అడుగులపైన)8.422 టీఎంసీలు, నాగార్జునసాగర్‌లో కనీస నీటి మట్టానికి ఎగువన(505అడుగులపైన) 12.793టీఎంసీలు ఉన్నాయి. ఇందులో ఆవిరి, పంపిణీ నష్టాల కింద 4.243టీఎంసీలను తీసేస్తే... 16.972 టీఎంసీల నీటి లభ్యత ఉన్నట్లు కృష్ణా బోర్డు అంచనా వేసింది. రెండు జలాశయాల్లో నీటి లభ్యత అంతంత మాత్రంగానే ఉన్నందున... తాగునీటి అవసరాల కోసమే వినియోగించుకోవాలని గుర్తు చేస్తూ ఏపీకి 4టీఎంసీలు, తెలంగాణకు 10.26టీఎంసీలు కేటాయించింది. ఈనెల 22 నుంచి 30వ తేదీ దాకా సాగర్ కుడి ప్రధాన కాలువ నుంచి రోజుకు 5500 క్యూసెక్కుల నీటిని ఏపీకి విడుదల చేయాలని సీఆర్పీఎఫ్‌ను ఆదేశించింది. ఇక, తెలంగాణ తాగునీటి అవసరాల కోసం జూలై 31వ తేదీ దాకా శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేయాలని, కనీస నీటి మట్టం కన్నా దిగువకు పడిపోకుండా చూసుకోవాలని ఏపీని కోరింది.

ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిఅత్తామామలకు నోటీసులు

» ఫెమా నిబంధనలు ఉల్లంఘించారనే పిటిషన్‌పై విచారణ

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్తామామలు హనుమాండ్ల ఝాన్సీలక్ష్మిరెడ్డి, రాజేందర్‌రెడ్డిలకు హైకోర్టు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అమెరికా పౌరసత్వం ఉన్న వారిద్దరూ.. ఫెమా నిబంధనలను ఉల్లంఘించి నేరుగా ఇక్కడ వ్యవసాయ భూమిని కొనుగోలు చేశారన్న ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించింది. ఝాన్సీలక్ష్మిరెడ్డి, రాజేందర్‌రెడ్డి ఫెమా నిబంధనలకు విరుద్ధంగా 2017లో తొర్రూరు మండలం గుర్తూరులో 75 ఎకరాల వ్యవసాయ భూమి కొనుగోలు చేశారని, ఈ అక్రమ వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పాకనాటి దామోదర్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై వివరణ ఇవ్వాలని అధికారులు, ఈడీకి జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం నోటీసులు జారీచేసింది. ఇక ఈ పిటిషన్ ఎందుకు విచారణకు స్వీకరించకూడదో వివరణ ఇవ్వాలంటూ ఝాన్సీలక్ష్మిరెడ్డి, రాజేందర్‌రెడ్డిలకూ నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణ జూన్ 19కి వాయిదా వేసింది.

మా భూమిలో జోక్యం చేసుకోకుండా ఆదేశించండి

» వైవీ సుబ్బారెడ్డి భార్య స్వర్ణలతారెడ్డి పిటిషన్

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కొండాపూర్ గ్రామ పరిధిలోని 87/2 సర్వే నంబర్‌లోని తమ 2.08ఎకరాల భూమిలోకి ప్రైవేటు వ్యక్తులు ప్రవేశించకుండా రక్షణ కల్పించేలా పోలీసులను ఆదేశించాలని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి భార్య స్వర్ణలతారెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. చట్టబద్ధమైన టైటిల్ ఉన్న తమ భూమిని ఆక్రమించుకోవాలని జి.నర్సింహారెడ్డి, షేక్ ఇస్లాముద్దీన్, కొప్పుల మల్లారెడ్డి చూస్తున్నారని... దీనిపై గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ పిటిషన్‌ను పరిశీలించిన జస్టిస్ జె.శ్రీనివాసరావు ధర్మాసనం.. ప్రతివాదులకు నోటీసులు జారీచేసింది. పిటిషనర్‌తోపాటు ప్రైవేటు ప్రతివాదుల వాదన విని రెండువారాల్లో తగిన నిర్ణయం తీసుకోవాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌ను ఆదేశించింది. విచారణను జూన్ 23కు వాయిదా వేసింది.

అప్పులు తీర్చలేక అన్నదాత ఆత్మహత్య

» విద్యుదాఘాతంతో రైతు మృతి

రఘునాథపల్లి, జైనథ్, మే 22 (ఆంధ్రజ్యోతి): పంటల దిగుబడి సరికా రాక, అప్పులు తీర్చే మార్గం కనిపించక ఓ రైతు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం వెల్దిలో గురువారం జరిగింది. నూనెముంతల యాదగిరి(50) తనకున్న రెండెకరాల్లో పంటలు సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. అయితే, పంటలు సరిగా పండకపోవడం, అప్పులు పెరిగిపోవడంతో జీవితంపై విరక్తితో గురువారం పొలంలో పురుగు మందు తాగాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా, ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని సాంగ్వి(కె) గ్రామానికి చెందిన రైతు బోయర్ దాము(50) తనకున్న ఐదెకరాల భూమిలో పత్తి పంటను సాగు చేస్తున్నాడు. రోజూలాగే గురువారం ఉదయం దాము పొలానికి వెళ్లాడు. పొలంలో తెగి పడిన 33/11 కేవీ విద్యుత్ తీగలు గమనించని దాము వాటిపై కాలువేయడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు.

తప్పు చేయకుంటే మొహం చాటేయడమెందుకు?

» కేటీఆర్ ఆరోపణలు మానసిక అంధత్వానికి నిదర్శనం

» కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో అవినీతి జరగనప్పుడు కమిషన్ విచారణ అనగానే ఎందుకు భయపడుతున్నారని ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో తప్పేమీ చేయకుంటే కేసీఆర్ ముఖమెందుకు చాటేస్తున్నారని నిలదీశారు. గురువారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో చామల మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరంలో ఏమీ జరగకుంటే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నోటీసులు ఎందుకు ఇస్తుందని ప్రశ్నించారు. ప్రాజెక్టు నుంచి సుమారు పది కిలోమీటర్ల వరకు నిషిద్ధ ప్రాంతంగా ఉంచారని, రాహుల్ గాంధీకి సైతం ఎందుకు అనుమతివ్వలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులో ఏ స్థాయిలో అవినీతి జరిగిందో తెలియాలంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు పాలమూరు-రంగారెడ్డిపై కేసు వేసిన నాగం జనార్దన్ రెడ్డిని అడగాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కింద కాంగ్రెస్ వాళ్లు బాంబులు పెట్టారని కేటీఆర్ ఆరోపించడం ఆయన మానసిక అంధత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన, కుటుంబ పరిస్థితి గురించి కవిత అమెరికా వెళ్లేటప్పుడే చెప్పిందన్నారు. ఇంటి సమస్యలు బయటికొస్తాయేమోనన్న భయంతోనే హరీశ్ రావు ఇంటికి కేటీఆర్ వెళ్లారని ఆరోపించారు. కాగా, యాదాద్రి-భువనగిరి జిల్లా కొలనుపాకలోని శ్రీ సోమేశ్వర స్వామి ఆలయానికి ప్రసాద్ పథకం 2.0 కింద నిధులు మంజూరు చేయాలని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్‌ను ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి కోరారు.

బీజేపీపై

రెండే నిమిషాలా?

(మొదటిపేజీ తరువాయి)

పేజీల్లో ప్రతికూల అంశాల గురించి సవివరంగా వెల్లడించారు. కాంగ్రెస్‌పై కిందిస్థాయిలో నమ్మకం పోయిందని ఆ లేఖలో పేర్కొన్న ఆమె.. ఆ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీ అవుతుందేమో అనే భావనను పార్టీ కార్యకర్తలే వ్యక్తం చేస్తున్నారని ఆవేదన వెలిబుచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేయకుండా బీజేపీకి సాయం చేశామనే సందేశాన్ని కాంగ్రెస్ పార్టీ బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లిందని ఆందోళన వ్యక్తం చేశారు. "ఇలాంటి రాజకీయ పరిస్థితులను ఎదుర్కోవడానికి మీరు ఒక నిర్దిష్ట కార్యాచరణ ఇస్తారని అందరూ ఆశించారు. కనీసం ఇప్పటికైనా ఒకటి, రెండు రోజులు పార్టీ ప్లీనరీ నిర్వహించండి. వీలైనంత ఎక్కువమంది అభిప్రాయాలు వినండి. ఈ విషయాన్ని కొంచెం సీరియస్‌గా తీసుకోండి." అని సూచించారు. రజతోత్సవ సభలో కేసీఆర్ ఉర్దూలో మాట్లాడకపోవడం, వక్ఫ్ బిల్లు గురించి ప్రస్తావించకపోవడం, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశాన్ని విస్మరించడం, ఎస్సీ వర్గీకరణ విషయంపై మాట్లాడకపోవడం ప్రతికూల అంశాలుగా కవిత పేర్కొన్నారు. అంతేకాదు.. అంతపెద్ద సభకు మళ్లీ పాత ఇన్‌చార్జులనే ఇవ్వడంతో వాళ్ల పాత పద్ధతిలో తెలంగాణ ఉద్యమకారులకు సదుపాయాలను కల్పించలేదనే ఫీడ్ బ్యాక్ (సమాచారం) తనకు వచ్చిందని తెలిపారు. మళ్లీ పాత ఇన్‌చార్జులకే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బీ-ఫారమ్ ఇస్తుందని ఇన్‌చార్జులు చెప్పుకుంటున్నట్టు తనకు తెలిసిందని పేర్కొన్నారు. "స్థానిక సంస్థల్లో సర్పంచ్‌లుగా పోటీచేయాలనుకునే వాళ్లు రిలాక్స్‌డ్‌గా ఉన్నారు. కానీ ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీగా పోటీచేయాలనుకునేవాళ్లు మాత్రం బీ ఫారాలను ఇన్‌చార్జుల నుంచి కాకుండా నేరుగా రాష్ట్ర పార్టీ నుంచే ఇవ్వాలని కోరుతున్నారు" అని తెలిపారు. అలాగే.. సభలో కేసీఆర్ వేదికపైకి వచ్చేలోపు.. 2001 నుంచి ఆయనతోటే ఉన్న నాయకులకు మాట్లాడే అవకాశం ఇస్తే బాగుండేదని చాలా మంది అన్నట్టు లేఖలో రాశారు. కార్యకర్తలను ఆకట్టుకోవడంలో "ధూం..ధాం" విఫలమైందన్నారు. "జడ్పీటీసీ, జడ్పీ చైర్మన్, ఎమ్మెల్యే స్థాయి వాళ్లు కూడా మిమ్మల్ని కలవడానికి అవకాశం దొరకడంలేదని బాధపడుతున్నారు. కొంతమందే కలవగలుగుతున్నారు. ఎంపికచేసిన వాళ్లే కలిసే పరిస్థితి ఉందని భావిస్తున్నారు. దయచేసి అందరినీ కలవండి" అని కేసీఆర్‌కు కవిత సూచించారు.

సానుకూల అంశాలూ..

లేఖలో తొలి రెండు పేజీల్లో ఆమె పలు సానుకూల అంశాలను ప్రస్తావించారు. "క్యాడర్‌లో ఉత్సాహం చాలా బాగుంది. వారంతా సభలో మీరు మాట్లాడుతున్నంతసేపూ .. చివరి దాకా ఉండి శ్రద్ధగా విన్నారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'పై మీరు మాట్లాడడం చాలా మందికి నచ్చింది. పలు అంశాలు, ఇచ్చిన హామీలను అమలుచేయడంలో కాంగ్రెస్ విఫలమైందంటూ 'కాంగ్రెస్ ఫెయిల్.. ఫెయిల్' అని చెప్పిన తీరు బాగుందని అనుకుంటున్నారు. సమావేశంలో రేవంత్ రెడ్డి పేరుతో తిట్టకపోవడం చాలా మందికి నచ్చింది. రేవంత్ రోజూ విమర్శిస్తున్నా.. మీరు హుందాగా ఉన్నారని నాకు సమాచారం వచ్చింది" అని పేర్కొన్నారు.

ఇంకొన్ని పంచ్‌లు ఆశించారు..



"తెలంగాణ అంటే బీఆర్ఎస్ అని.. తెలంగాణ అంటే కేసీఆర్ అని మీరు బలంగా చెప్తారని చాలామంది అనుకున్నారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చడం, తెలంగాణ గీతం గురించి మీరు మాట్లాడతారని ఎదురుచూశారు. మొత్తంగా సభలో మీ నుంచి ఇంకొంచెం పంచ్‌లను జనం ఆశించారు. అయితే మొత్తంగా చూస్తే క్యాడర్, లీడర్లు సభ విషయంలో సంతృప్తితో ఉన్నారు" అని కవిత తన లేఖలో వెల్లడించారు. పోలీసులకు ఇచ్చిన హెచ్చరికలు బాగున్నాయని.. పహల్గాం అమరులకు నివాళిగా మౌనం పాటించడం బాగుందని పేర్కొన్నారు. "చాలామంది మీతో ఫొటో దిగాలని, చెయ్యి కలపాలని అంటుంటే ఎంతో సంతోషం అనిపించింది."అని కవిత తన లేఖలో రాశారు.



లోగుట్టు ఏంటి?

లేఖ రాయడం కాదు.. బయటకు రావడంలో ఆంతర్యమేంటి?

పార్టీ రజతోత్సవ సభతోనే అంతర్గత వైరుధ్యాలు ప్రస్ఫుటం

నేడు అమెరికా నుంచి రానున్న కవిత.. ఆమె స్పందనపై ఆసక్తి

హైదరాబాద్, మే 22, (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు కవిత రాసిన సంచలన లేఖ వెనక లోగుట్టు ఏంటనే చర్చ రాజకీయవర్గాల్లో జరుగుతోంది. వాస్తవానికి వరంగల్‌లో భారీగా నిర్వహించిన ఆ పార్టీ రజతోత్సవ సభ కొన్ని రాజకీయ అసంతృప్తులకు దారితీసిందనేది బహిరంగ రహస్యం. పార్టీలోని అంతర్గత వైరుధ్యాలు ప్రస్ఫుటం అయ్యేందుకు ఆ సభ బీజం వేసింది. ఏప్రిల్ 27న జరిగిన ఆ సభకు ముందు, తర్వాత బీఆర్ఎస్‌లో అంతర్గత పరిణామాలు వేగవంతం అయ్యాయన్నది బహిరంగ రహస్యమే. పార్టీకి, తనకు రాజకీయ వారసుడు కేటీఆరే అని ఒక స్పష్టమైన సందేశం ఇచ్చే దిశగా ఆ సభను ఒక వేదికగా అధినేత ఉపయోగించుకున్నారనే చర్చ ఆ పార్టీ వర్గాల్లో నడుస్తోంది. దీంతో ఈ సభ అనంతరం కవిత కూడా తనకూ పార్టీలో సమ స్థాయి కావాలని అడుగుతున్నట్లు వార్తలొచ్చాయి. వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని ఆమె ఆడిగినట్లుగా పార్టీలోనే అంతర్గతంగా ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలోనే ఆమె 20 రోజుల క్రితమే కేసీఆర్‌కు ఒక లేఖ రాశారనే విషయం బయటకు వచ్చింది. అయితే అప్పటికి కొద్ది మందికి మాత్రమే ఆ విషయం తెలుసు. ఆ లేఖలో.. పార్టీలో జరుగుతున్న అంతర్గత పరిణామాలకు సంబంధించి పలు అంశాలను ఆమె ప్రస్తావించారని, అలా చేయడంతో ఆమెకు ఇతరత్రా రాజకీయ ఉద్దేశాలు ఉన్నాయనే చర్చ కూడా జరిగింది. తాజాగా గురువారం ఆ లేఖ సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షం అయింది. లేఖ రాస్తే.. అది రాసిన వ్యక్తికి, తీసుకున్న వ్యక్తికి మాత్రమే తెలియాలి. ఒకవేళ బయటకు వస్తే ఈ ఇద్దరిలో ఎవరో ఒకరు దానికి కారణం అవుతారు. ఇప్పుడీ లేఖ బయటకు వచ్చేలా చేయడం.. భవిష్యత్‌లో ఏ పరిణామాలకు దారితీస్తుందో చూడాల్సిందేనని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఈ లేఖ బయటకు రావడం వెనక ఎవరి ప్రమేయం ఉంది? కావాలనే బయటకు తెచ్చారా? భవిష్యత్ రాజకీయ పరిణామాలు ఎలా ఉంటాయన్నది ఆసక్తికరంగా మారింది. పార్టీలో తాను కోరుకున్న హోదా, ప్రాధాన్యం ఇవ్వకుంటే.. ప్రత్యామ్నాయ రాజకీయ వేదికల గురించి కూడా కవిత ఆలోచిస్తున్నారనే స్థాయి దాకా చర్చ జరుగుతోంది. "ఒకవేళ.. ప్రత్యామ్నాయ రాజకీయాలు కార్యరూపం దాలిస్తే మీరు ఇటువైపా? అటువైపా?" అని సైతం పార్టీలో కొందరు నాయకులను ఆమె అడిగినట్లు బీఆర్ఎస్‌లో చర్చ జరుగుతోంది. తద్వారా ఎలాంటి ప్రతిస్పందన ఉందో ఆమె తెలుసుకునే ప్రయత్నం చేశారని పార్టీ వర్గాల సమాచారం.

పైనుంచి కింది స్థాయి వరకూ..

కవిత లేఖాస్త్రం వ్యవహారం ఆ పార్టీలో పై నుంచి కిందిస్థాయి వరకు చర్చకు దారితీసింది. కాళేశ్వరం కమిషన్ నోటీసుల వ్యవహారంలో కేసీఆర్‌ను హరీశ్‌రావు కలిసినప్పుడు ఈ వ్యవహారం కూడా చర్చకు వచ్చిందని అంటున్నారు. అదే సమయంలో పార్టీలోని అగ్రనేతల నుంచి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు కూడా ఈ అంశంపైనే అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. వాస్తవానికి గత కొన్ని నెలలుగా కవిత తనకంటూ కొన్ని కార్యక్రమాలను పెట్టుకుని సొంతంగానే వాటిని నిర్వహించుకుంటున్నారనే వాదన ఉంది. పార్టీ తరఫునే చేస్తున్నప్పటికీ, పార్టీపరంగానే కార్యక్రమాలు ఉంటున్నప్పటికీ.. ఆ కార్యక్రమాల్లో పాల్గొనే పెద్ద నాయకురాలు ఆమే. అలాగే.. ఇటీవలికాలంలో తెలంగాణ జాగృతి కార్యకలాపాలను మరింత క్రియాశీలం చేశారు. తాను ప్రజల్లోకి వెళ్లడానికి అవసరమైన ఒక అజెండాను ఆమె ఏర్పాటుచేసుకుని, ఆ దిశగా కార్యక్రమాలు చేపట్టారు. ఉదాహరణకు బీసీ కులగణన అంశంపై ఆమె తనంతతానుగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఒక దశలో పార్టీలోని నేతలు ఈ అంశంపై ఎవరికి వారే యమునాతీరే అన్నట్లుగా ఎవరి కార్యక్రమాలను వారు నిర్వహించుకున్నారన్న చర్చ కూడా జరిగింది. కాగా, కుమారుడి గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు కొద్దిరోజుల క్రితం అమెరికాకు వెళ్లిన కవిత.. అక్కడ బీఆర్ఎస్ రజతోత్సవ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడంపైనా ప్రవాసుల్లో కొంత చర్చ జరిగింది. కేసీఆర్‌కు ఆమె రాసిన లేఖ గురువారం బయటపడడంపై కవిత వివరణ అడిగేందుకు ప్రయత్నించినా ఆమె అందుబాటులోకి రాలేదు. శుక్రవారం ఆమె రాష్ట్రానికి తిరిగిరానున్నారు. వచ్చాక దీనిపై ఆమె ఏం మాట్లాడతారోననే ఆసక్తి నెలకొంది.

బీజేపీతో పొత్తుకు కేసీఆర్ సిద్ధమని కవిత చెప్పకనే చెప్పారు

» లేఖలో కడిగి పారేశారు: ఆది శ్రీనివాస్

» కల్వకుంట్ల కలహాల కుటుంబం: బల్మూరి

» బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట: అద్దంకి

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): బీజేపీతో పొత్తు పెట్టుకునేందుకు కేసీఆర్ సిద్ధమవుతున్నారంటూ.. ఆయనకు కవిత రాసిన లేఖలో చెప్పకనే చెప్పారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆ రెండు పార్టీలూ కలిసి పనిచేస్తున్నాయంటూ తాము మొదటి నుంచీ చెబుతున్న మాటలనే ఆమె సమర్థించారని చెప్పారు. కేసీఆర్‌కు కవిత రాసిన లేఖతో ఆ పార్టీలో లుకలుకలు బయటపడ్డాయన్నారు. బీజేపీపైన పల్లెత్తు మాట మాట్లాడకుండా కేసీఆర్ వ్యవహరించిన తీరును కవిత లేఖలో కడిగి పారేశారని పేర్కొన్నారు. 'బీఆర్ఎస్ బలహీనపడటం వల్ల బీజేపీతో పొత్తుకు ప్రయత్నిస్తున్నట్లు కవిత అంగీకరించారు. అలాగే బీఆర్ఎస్‌లో కేసీఆర్ నియంతృత్వ వైఖరిని కూడా కవిత నిలదీశారు. కేసీఆర్ వైఖరిని ఆయన కూతురే తప్పు పడుతుంటే.. ఇక ప్రజలకు వారేం సమాధానం చెబుతారు' అని వ్యాఖ్యానించారు. కల్వకుంట్ల కుటుంబం కాస్తా కలహాల కుటుంబంగా మారిపోయిందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. ప్రజలకు ఉన్న అనుమానాలను ఒక లేఖ ద్వారా కవిత ప్రశ్నించిందన్నారు. బీజేపీతో బీఆర్ఎస్ సంబంధాన్ని ఎత్తి చూపిందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ముందుగా చెల్లెలికి సమాధానం చెప్పి ఆ తర్వాత బయటికొచ్చి కేటీఆర్ నీతులు మాట్లాడాలని సూచించారు. కవిత లేఖను లీక్ చేయాల్సిన దుర్గతి తమ పార్టీకి పట్టలేదని మరో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లో మూడు ముక్కలాట, అంతర్గత పోరు కొనసాగుతుందన్నారు.

నోటీసులపై ఏం చేద్దాం!

కేసీఆర్‌తో మరో సారి హరీశ్‌రావు భేటీ

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు విచారణ కమిషన్ నోటీసుల నేపథ్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు మరోసారి సమావేశమయ్యారు. ఎర్రవెల్లిలోని కేసీఆర్‌కు చెందిన ఫామ్‌హౌస్‌లో గురువారం భేటీ అయ్యారు. హరీశ్‌రావు మూడు గంటల పాటు కేసీఆర్‌తో మంతనాలు జరిపినట్లు తెలుస్తోంది. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, నీటి పారుదల శాఖ మాజీ మంత్రి హరీశ్‌రావును విచారణకు పిలుస్తూ కాళేశ్వరం కమిషన్ ఇటీవల నోటీసులు పంపించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రే కేసీఆర్‌తో హరీశ్ సమావేశమయ్యారు. తమకు పంపిన నోటీసులపై స్పందించాలా? వద్దా? అసలు నోటీసుల్లో ఏం ప్రస్తావించారు ? దాని ఆధారంగా ఎటువంటి ప్రశ్నలు అడుగుతారు? వాటికి ఏం సమాధానం చెప్పాలి ? అనే అంశాలపై వారి మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. అలాగే, అసలు విచారణకు హాజరు కావాలా ? వద్దా ? అనే అంశంపై కూడా మంతనాలు జరిపినట్లు తెలిసింది. విచారణకు స్వయంగా హాజరుకాలేని పక్షంలో.. లిఖిత పూర్వకంగా వివరణ ఇద్దామా? న్యాయనిపుణుల సలహాతో ముందుకు వెళ్దామా? అనే విషయాలపై ఇరువురు నేతలు సమాలోచన చేసినట్లు సమాచారం. కాగా, కాళేశ్వరం కమిషన్ పంపిన నోటీసులు మాజీ సీఎం కేసీఆర్ చేతికి ఇప్పటికీ అందలేదని తెలిసింది. విచారణ కమిషన్ మెసెంజర్ ద్వారా ఫామ్‌హౌస్ వద్దకు పంపిన నోటీసులను అక్కడి ఎస్టేట్ అధికారి తీసుకోలేదని విశ్వసనీయ సమాచారం. అయితే, రిజిస్టర్ పోస్టులోనూ నోటీసులు పంపినట్టు తెలిసింది.

కోల్‌కతాకు జస్టిస్ పీసీ ఘోష్

» జూన్ 3న తిరిగి రాక

» 5న కేసీఆర్, 6న ఈటల, 9న హరీశ్‌రావు విచారణ

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కమిషన్ చైర్మన్ జస్టిస్ పినాకి చంద్రఘోష్ గురువారం కోల్‌కతాకు వెళ్లిపోయారు. మళ్లీ జూన్ 3న ఆయన హైదరాబాద్‌కు వచ్చే అవకాశం ఉంది. జూన్ 5న కేసీఆర్, 6న ఈటల రాజేందర్, 9న టి.హరీశ్‌రావు విచారణకు హాజరుకావాలని కమిషన్ నోటీసులు పంపిన విషయం విదితమే. ఇక కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ తుది అంకానికి చేరింది. ముగ్గురిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసిన అనంతరం జస్టిస్ చంద్రఘోష్ నివేదికను ప్రభుత్వానికి అందించే అవకాశాలున్నాయి. అయితే, ఈ దఫాలో కాళేశ్వరం కమిషన్ చేపట్టనున్న విచారణ అత్యంత కీలకంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి, ఇద్దరు మాజీ మంత్రులను విచారణకు పిలవడంతో క్రాస్ ఎగ్జామినేషన్‌పై ఆసక్తి నెలకొంది. అయితే కేసీఆర్ విచారణకు హాజరు అవుతారా..? లేక కోర్టులో సవాలు చేస్తారా..?, లేఖ రాసి దూరంగా ఉంటారా..? అనే దానిపై ఉత్కంఠ నెలకొంది. ఈటల, హరీశ్‌రావు తాము విచారణకు హాజరవుతామని ఇప్పటికే ప్రకటించారు. దాంతో కేసీఆర్ హాజరుపైనే సర్వత్రా ఆసక్తి నెలకొంది.

మేడిగడ్డ వద్ద కాంగ్రెస్ వాళ్లే

బాంబులు పెట్టారేమో?

(మొదటిపేజీ తరువాయి)



కమీషన్లు తీసుకోవాలన్నదే సీఎం రేవంత్‌రెడ్డి అసలు ఎజెండా. ప్రజాపాలన కమీషన్ల పాలనగా మారింది. కాంగ్రెస్ మంత్రుల కమీషన్ల వ్యవహారం ప్రజల్లోకి వెళ్లడంతో.. వారి దృష్టి మళ్లించేందుకే నోటీసుల పేరిట తమాషాలు చేస్తున్నారు.." అని ఆరోపించారు. లొట్టపీసు కేసులతో రేవంత్‌రెడ్డి చేసేదేమీ లేదని, ఇప్పటివరకు ఆయన పెట్టిన కేసులన్నీ తేలిపోయాయని వ్యాఖ్యానించారు. విచారణ పూర్తయిందని, నివేదికను సిద్ధం చేశామని జస్టిస్ ఘోష్ చెప్పారని... ప్రభుత్వం మళ్లీ గడువు ఎందుకు పొడిగించిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేసీఆర్, హరీశ్ రావులకు కమిషన్ నోటీసులు టైమ్‌పాస్ కోసమేనని పేర్కొన్నారు. అయితే కేసీఆర్‌కు నోటీసులు నేరుగా అందినట్టు సమాచారం లేదని, అందిన తర్వాత ఏంచేయాలో నిర్ణయం తీసుకుంటారని తెలిపారు.

బీజేపీ, కాంగ్రెస్ నికృష్ట రాజకీయాలు..

బీజేపీ, కాంగ్రెస్ కలసి కాళేశ్వరంపై దుష్ప్రచారం చేస్తున్నాయని, నికృష్ట రాజకీయాలకు పాల్పడుతున్నాయని కేటీఆర్ విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై చేసిన దుష్ప్రచారం సుప్రీంకోర్టు సాక్షిగా తేలిపోయిందని, కాళేశ్వరంపై కూడా నిజం నిలకడగా బయటపడుతుందని చెప్పారు. "సీఎం రేవంత్‌రెడ్డిలో అపరిచితుడున్నారు. ఆయన మల్టిపుల్ పర్సనాలిటీ డిజార్డర్‌తో బాధపడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద ఒక్క రూపాయి కూడా లేదంటారు. అప్పు కోసం వెళితే అందరూ దొంగల్లా చూస్తున్నారంటారు. అలాంటిది అందాల పోటీల కోసం రూ.200కోట్లు ఖర్చుపెట్టడం సరైనదేనా?"అని ప్రశ్నించారు. మిస్‌వరల్డ్ పోటీదారులకు మంత్రులు టూరిస్ట్ గైడ్లలా మారారంటూ, సొంగకార్చుకుంటూ అందాల పోటీలో పాల్గొంటున్నారంటూ సీపీఐ నారాయణ విమర్శించారని గుర్తు చేశారు. అకాల వర్షంతో పంటలు దెబ్బతిని, ధాన్యం తడిసి రైతులు కష్టాలు పడుతున్నా.. హైదరాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగినా పట్టించుకోని రేవంత్‌రెడ్డి.. అందాల పోటీలకు నాలుగు సార్లు వెళ్లి వచ్చారని విమర్శించారు. మిస్ వరల్డ్ ఫ్లెక్సీలో రేవంత్, భట్టి, జూపల్లి ఫోటోలున్నాయని.. వీరిలో మిస్‌వరల్డ్ ఎవరో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు.

పార్టీ నుంచి పోయినవాళ్లు పోనీ..!

నలుగురున్న కుటుంబంలోనే అభిప్రాయ భేదాలుంటాయని.. అలాంటిది లక్షల మంది ఉండే రాజకీయ పార్టీలో అక్కడక్కడా సమస్యలు తలెత్తడం సాధారణమని కేటీఆర్ పేర్కొన్నారు. పార్టీ బలోపేతం కోసం కలసికట్టుగా పనిచేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గురువారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన నిర్మల్ జిల్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ పటిష్ఠత కోసం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తామని, త్వరలోనే గ్రామం నుంచి రాష్ట్ర స్థాయి వరకు పార్టీ కమిటీలను నియమిస్తామని తెలిపారు. జూన్, జూలై నెలల్లో బీఆర్ఎస్ సభ్యత్వ నమోదు చేపడతామన్నారు. బీఆర్ఎస్ హయాంలో రెండు సార్లు మంత్రి పదవి పొందిన ఇంద్రకరణ్‌రెడ్డి.. కాంగ్రెస్‌లో చేరడాన్ని ఆయన విచక్షణకే వదిలేద్దామని పేర్కొన్నారు. పోయినవాళ్లుపోగా.. ఉన్నవాళ్లతోనే పార్టీని బలోపేతం చేసుకుంటామని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల కోసం హైదరాబాద్ నుంచి పార్టీ అబ్జర్వర్లను పంపుతామని, ప్రతి గ్రామంలో పార్టీని నమ్ముకున్నవారికి టికెట్లిచ్చి గెలిపించుకుంటామన్నారు.

తడిసిన ధాన్యం కొనాలని ఆందోళనలు

» ఖానాపూర్, నచ్చన్ ఎల్లాపూర్, పొన్కల్.. బాదేపల్లిలో అన్నదాతల రాస్తారోకోలు

నిర్మల్/జడ్చర్ల, మే 22 (ఆంధ్రజ్యోతి) : అకాల వర్షాలతో తడిసిపోయిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అన్నదాతలు రోడ్డెక్కారు. గురువారం నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లో రైతులు అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రాస్తారోకోలు చేపట్టారు. కడెం మండలం నచ్చన్ ఎల్లాపూర్‌లో వడ్ల కొనుగోళ్లను వేగవంతం చేయాలని అలాగే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రాస్తారోకో చేశారు. దీంతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అక్కడికి చేరుకొని వారిని సముదాయించే ప్రయత్నం చేశారు. అనంతరం రైతులతో కలిసి కొనుగోలు కేంద్రం వద్దకు వెళ్లి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని డిమాండ్ చేస్తూ ఖానాపూర్, దిమ్మదుర్తి, మామడ మండలం పొన్కల్ ఐకేపీ సెంటర్ వద్ద రైతులు ఆందోళన చేశారు. ధాన్యం విక్రయానికి ఎన్ని రోజులు పడిగాపులు కాయాలంటూ మహబూబ్‌నగర్ జిల్లా బాదేపల్లి పత్తి మార్కెట్ ముందు రైతులు రోడ్డుపై ధాన్యాన్ని కుప్పగా పోసి రాస్తారోకో చేపట్టగా..అధికారులు వారికి సర్దిచెప్పారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కాశీంపూర్ కొనుగోలు కేంద్రంలో రైతులు, నిర్వాహకుల మధ్య తూకం విషయంలో గురువారం గొడవ జరిగింది.


నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష

జోరు వాన.. తడిసిన ధాన్యం

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో బుధవారం రాత్రి, గురువారం భారీ వర్షం కురిసింది. పలు చోట్ల కోతకొచ్చిన వరి పంట నేలకొరిగింది. కల్లాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. మెదక్ జిల్లా కేంద్రంలో 11.9 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఉమ్మడి కరీంనగర్, మంచిర్యాల, కొమురం భీం జిల్లాల్లో రెండు రోజుల నుంచి వర్షాలు కురుస్తున్నాయి. మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాల్‌పూర్‌లో గరిష్ఠంగా 9.78 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. నెన్నెల మండలం గొల్లపల్లిలో రైతుల అందివచ్చిన పంట దెబ్బతింది. మెట్‌పల్లి, సారంగాపూర్ మండలాల్లో వర్షానికి ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. బుధవారం రాత్రి జన్నారం మండలం మహ్మదాబాద్‌లో రోడ్డు పక్కన చెట్టు విరిగిపడి సునీత అనే మహిళ తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమె చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. నిజామాబాద్ జిల్లాలోని మెండోరా మండలంలో గరిష్ఠంగా 8.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆర్మూర్, బాల్కొండ, మెండోరా, మోర్తాడ్ మండలాల పరిధిలో ఆరబోసిన, కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోయింది. సజ్జ, నువ్వులు కూడా వర్షానికి తడిసిపోయాయి. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది.

హైదరాబాద్‌కు 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు

- పీఎం ఈ-డ్రైవ్ కింద అందించాలని కేంద్రం నిర్ణయం
- వచ్చే ఏడాది మార్చి నాటికి ఐదు నగరాలకు బస్సులు
- కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి వెల్లడి

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ఐదు నగరాలకు 10,900 ఎలక్ట్రిక్ బస్సులు అందజేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. నగరాల్లో ప్రజా రవాణాను మెరుగుపర్చడం, కాలుష్య రహిత విధానాలను అనుసరించడంలో భాగంగా చేపట్టిన ప్రధాన మంత్రి ఈ-డ్రైవ్ పథకం కింద వీటిని అందజేయనుంది. గురువారం ఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ పథకం మొదటి దశలో భాగంగా.. బెంగళూరుకు 4,500, ఢిల్లీకి 2,800, హైదరాబాద్‌కు 2,000, అహ్మదాబాద్‌కు 1,000, సూరత్‌కు 600 ఎలక్ట్రిక్ బస్సులను అందించనున్నట్టు కుమారస్వామి వెల్లడించారు. దేశంలో కాలుష్యాన్ని తగ్గించేందుకు కేంద్రం ఎన్నో చర్యలు చేపడుతోందని, ఆ దిశగా ఇదొక కీలకమైన ముందడుగని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి నాటికి ఈ ఐదు నగరాలకు బస్సులు అందిస్తామని తెలిపారు. కేంద్ర భారీ పరిశ్రమల శాఖ నేతృత్వంలో, రాష్ట్రాల భాగస్వామ్యంతో ఈ పథకాన్ని అమలు చేస్తామని వెల్లడించారు.

నేడు సంగారెడ్డికి సీఎం రేవంత్

- పలు అభివృద్ధి పనులకు శ్రీకారం.. పస్తాపూర్‌లో సభ

హైదరాబాద్/జహీరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంగారెడ్డి జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇప్పటికే అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కూడా ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా సీఎం జహీరాబాద్ నియోజకవర్గంలో బసవేశ్వర విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. ఆ తర్వాత రూ.వంద కోట్లతో నిర్మించిన రైల్వే ఓవర్ బ్రిడ్జి, రూ.26 కోట్లతో నిర్మించిన కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభిస్తారు. అనంతరం.. రూ.100 కోట్లతో నిమ్జ్ రోడ్డు ప్రారంభించడంతో పాటు చిరాగ్‌పల్లి-ఇప్పపల్లి గ్రామాల మధ్య రూ.20 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఆ తర్వాత పస్తాపూర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభకు హాజరై ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, మహిళా సంఘాలకు చెక్కులు పంపిణీ చేయనున్నారు.

ఎంపీడీవోల బదిలీలకు మంత్రి సీతక్క ఆమోదం

- త్వరలోనే మార్గదర్శకాలు

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని 350కి పైగా ఎంపీడీవోల బదిలీలకు మంత్రి సీతక్క ఆమోదం తెలిపారు. 2024 ఫిబ్రవరి లోక్‌సభ ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో ఎంపీడీవోలను ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తమను తిరిగిబదిలీ చేయాలంటూ పలుసార్లు ఎంపీడీవోలు చేసిన విజ్ఞప్తులపై స్పందించిన మంత్రి సీతక్క.. బదిలీల ఫైలుపై గురువారం సంతకం చేశారు. దీని ఆధారంగా ఎంపీడీవోల బదిలీలకు సంబంధించిన మార్గదర్శకాలతో ఆ శాఖ ఉన్నతాధికారులు త్వరలోనే సర్క్యులర్ జారీచేయనున్నట్లు సమాచారం.

సౌకర్యాలతోనే జూపార్కులకు తాకిడి: సురేఖ

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): జంతు ప్రదర్శన శాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తే పెద్ద సంఖ్యలో సందర్శకులు వస్తారని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జూపార్కులతోపాటు అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో సౌకర్యాలు మెరుగు పర్చాలని తెలిపారు. సచివాలయంలో గురువారం జరిగిన జపాట్ (జూస్ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ) 14వ గవర్నింగ్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ పర్యావరణానికి ఇబ్బంది లేకుండా అటవీశాఖ ఆదాయం పెంచుకోవడానికి జూ అండ్ పార్క్స్ అథారిటీ ఆఫ్ ఇండియా పకడ్బందీ ప్రణాళికతో పని చేయాలని చెప్పారు. జూ పార్కులు, మృగవాని తదితర పార్కుల్లో అదనపు సౌకర్యాలపై దృష్టి దృష్టి సారించాలని ఉన్నతాధికారులకు సూచించారు.

'పాలమూరు'పై సీఐడీ విచారణ కోరండి

- కేటీఆర్‌కు మహేశ్ గౌడ్ సవాల్



హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): కేటీఆర్‌కు ధైర్యముంటే.. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపైన సీఐడీ విచారణ లేదా న్యాయ విచారణ కోరాలని టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. ఈ మేరకు ప్రభుత్వానికి లేఖ రాయాలని.. విచారణ జరిగితే అవినీతి ఏ విధంగా జరిగిందన్నది బట్టబయలవుతుందని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై న్యాయస్థానం తీర్పు అనుకూలంగా వచ్చినట్లుగా, తాము నీతిమంతులైనట్లు చెప్పేందుకు కేటీఆర్ ప్రయత్నిస్తున్నారని గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. వాస్తవానికి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నప్పుడు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపై పూర్తి ఆధారాలతో కేసు వేశారని, అయితే ఆయన్ను బీఆర్ఎస్‌లో చేర్చుకుని కేసును నీరుగార్చారని చెప్పారు. బీఆర్ఎస్‌లో ఉన్న నేత.. బీఆర్ఎస్ పార్టీ అధినేతపై ఎలా కొట్లాడతారని ప్రశ్నించారు. కాళేశ్వరం విచారణ కమిషన్ ఇచ్చిన నోటీసులతో కల్వకుంట్ల కుటుంబంలో ఆందోళన మొదలైందని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణకుమార్ అన్నారు. కాళేశ్వరం కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరై.. తన నిజాయతీని నిరూపించుకోవాలని టీపీసీసీ అధికార ప్రతినిధి దయాకర్‌గౌడ్ డిమాండ్ చేశారు.

ప్రకటిత నేరస్థుడిగా ఎస్ఐబీ మాజీ చీఫ్!

- ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం

హైదరాబాద్, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో కీలక నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావుకు ప్రొక్లెయిమ్డ్ అఫెండర్(ప్రకటిత నేరస్థుడు) నోటీసులు జారీ అయ్యాయి. ప్రభాకర్‌రావు పోలీసు విచారణకు హాజరుకానందున ఆయన్ను ప్రకటిత నేరస్థుడిగా ప్రకటించాలని కోరుతూ సిట్ దాఖలు చేసిన పిటిషన్‌ను నాంపల్లి కోర్టు అనుమతించింది. అయితే, ప్రభాకర్‌రావు తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు న్యాయస్థానం నెల(జూన్ 20 వరకు) పాటు గడువు ఇచ్చింది. జూన్ 20లోగా ప్రభాకర్‌రావు దర్యాప్తు అధికారి ముందు హాజరు కాని పక్షంలో ఆయన్ను ప్రకటిత నేరస్థుడిగా ప్రకటిస్తామని న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ మేరకు తారామతిలోని ప్రభాకర్ రావు ఇంటికి వెళ్లిన సిట్ అధికారులు.. అక్కడి గోడకు నోటీసు అంటించారు. గడువులోగా ప్రభాకర్ రావు విచారణకు హాజరుకాకపోతే.. ప్రకటిత నేరస్థుడిగా గుర్తించి ప్రభాకర్‌రావుకు చెందిన స్థిర, చర ఆస్తులను దర్యాప్తు అధికారులు సీజ్ చేసే అవకాశం ఉంది. కాగా, ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని ప్రభాకర్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు ఇప్పటికే తోసిపుచ్చింది. ప్రభాకర్‌రావును అమెరికా నుంచి రప్పించడం కోసం దర్యాప్తు అధికారులు ఇంటర్‌పోల్ ద్వారా రెడ్ కార్నర్ నోటీసులు కూడా జారీ చేయించారు. ప్రభాకర్‌రావు తప్పనిసరిగా విచారణకు హాజరుకావాల్సిందేనని లేకపోతే ఇంటర్‌పోల్ రెడ్‌కార్నర్ నోటీసు ద్వారా అమెరికా అధికారులతో మాట్లాడి ఆయన్ను స్వదేశానికి రప్పించే ప్రయత్నం చేస్తామని సిట్ అధికారులు పేర్కొంటున్నారు.

పోలీసులు తెలిపినవి అవాస్తవాలు

(మొదటిపేజీ తరువాయి)

భాగంగా గతంలోనూ ఒకసారి రేవంత్ కోర్టుకు వచ్చి తన వాదన వినిపించారు. తాజాగా మరోసారి ఆయన వాంగ్మూలాన్ని కోర్టు నమోదు చేసింది. అప్పటి ప్రభుత్వం ఒత్తిడి మేరకు తనపై తప్పుడు కేసులు పెట్టారని రేవంత్ రెడ్డి అందులో చెప్పారు. కాగా.. గురువారం రేవంత్ వాంగ్మూలాన్ని నమోదు చేసిన అనంతరం, ఇంతటితో ఈ కేసులో వాదనలు పూర్తయినట్టు న్యాయస్థానం తెలిపింది. వచ్చే నెల 12వ తేదీన ఈ కేసులకు సంబంధించి తుది తీర్పును వెల్లడించనున్నట్టు ప్రకటించింది. ఇక, రేవంత్ కోర్టుకు వస్తున్నందున పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. కోర్టు హాల్ వద్ద ఇతరులెవరినీ అనుమతించలేదు.

భూ భారతి దరఖాస్తులకు స్పెషల్ సెల్

రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు రెవెన్యూ అధికారుల నియామకం

ప్రతి మండలానికి 6-8 మంది సర్వేయర్లు.. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడి



ఖమ్మం/హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన భూ భారతి-2025 చట్టం కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి ఎక్కడా అవినీతికి అవకాశం లేకుండా పర్యవేక్షణకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు చేపట్టిందని, ఇందుకోసం స్పెషల్ సెల్ ఏర్పాటు చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఖమ్మం కలెక్టరేట్‌లో భూ భారతి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. భూభారతి చట్టం వచ్చిన తర్వాత 33 జిల్లాల్లో 29 జిల్లాల్లో ప్రత్యక్షంగా వెళ్లి సదస్సులు నిర్వహించామని, పైలెట్ ప్రాజెక్టు కింద పెట్టిన నాలుగు మండలాల్లో ఒకటైన నేలకొండపల్లిలో 3,200దరఖాస్తులు వచ్చాయని, ఇందులో 50శాతం సాదాబైనామాలు గురించి ఉన్నాయన్నారు. జూన్ 3 నుంచి 20 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్‌తోపాటు రెవెన్యూ యంత్రాన్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వం 4.50 లక్షల లక్షల ఇళ్లను నిర్మించనుందని, ఇందులో 1.90 లక్షల మంది లబ్ధిదారులను ఇప్పటికే ఎంపిక చేశామని, మరో 2.50 లక్షల మంది ఎంపిక కూడా త్వరలోనే పూర్తిచేస్తామన్నారు. జూన్ 2న వెయ్యి కుటుంబాలు ఇందిరమ్మ ఇళ్లలో గృహప్రవేశం చేయనున్నాయని తెలిపారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ప్రతి రెవెన్యూ గ్రామంలో రెవెన్యూ అధికారిని నియమించబోతున్నామని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టుల ఇళ్ల సమస్యల పరిష్కారం, అక్రిడేషన్ల మంజూరుపై ప్రెస్‌అకాడమీ చైర్మన్‌తోపాటు యూనియన్ ప్రతినిధులతో చర్చలు చేపట్టామని, త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి తెలిపారు.

413 నక్ష గ్రామాల్లో 26 నుంచి రీ సర్వే

భూ విస్తీర్ణం, భూ లావాదేవీల ఆధారంగా ప్రతి మండలానికి 6 నుంచి 8 మంది సర్వేయర్లను నియమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు పొంగులేటి తెలిపారు. తొలి విడతలో 5 వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను తీసుకుంటున్నామని చెప్పారు. సచివాలయంలో సమీక్ష సందర్భంగా మాట్లాడుతూ లైసెన్స్‌డ్ సర్వేయర్లుగా ఎంపికైన వారికి ఈ నెల 26నుంచి శిక్షణ ఇస్తామని చెప్పారు. నిజాం కాలం నుంచి సర్వే జరగని, ఇప్పటి వరకు సర్వే రికార్డులు లేని 413నక్ష గ్రామాల్లో రీ సర్వే నెల రోజుల్లో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రయోగాత్మకంగా ఐదు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తామని వివరించారు.

పార్ట్-బీ మెట్రోకు డీపీఆర్ సిద్ధం

రాష్ట్ర సర్కారుకు చేరిన సమగ్ర నివేదిక.. ఈ నెల 8న పంపించిన హెచ్‌ఏఎంఎల్

- క్యాబినెట్ ఆమోదం తర్వాత కేంద్రానికి
- 3 కారిడార్లకు 19,579కోట్ల వ్యయం!



పార్ట్-బీ డీపీఆర్‌లోని ముఖ్యాంశాలు..

కారిడార్	కిలో మీటర్లు	అంచనా వ్యయం (సుమారు)	స్టేషన్ల సంఖ్య
జేబీఎస్-మేడ్చల్	24.5	రూ.5,571.00 కోట్లు	18
జేబీఎస్-శామీర్‌పేట్	22.0	రూ.5002.58 కోట్లు	14
ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్‌సిటీ	39.6	రూ.9004.64 కోట్లు	16

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధానిలోని మెట్రో రెండో దశలో భాగంగా పార్ట్-బీ కింద ప్రతిపాదించిన నార్త్‌సిటీ, ఫ్యూచర్‌సిటీ డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)లు రాష్ట్ర ప్రభుత్వానికి చేరాయి. ఆయా కారిడార్లలో సుమారు 6 నెలలపాటు క్షేత్రస్థాయిలో పర్యటించి అన్ని అంశాలపై అధ్యయనం చేసిన హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్‌ఏఎంఎల్) అధికారులు డీపీఆర్‌ను తయారు చేశారు. ఇటీవల జరిగిన బోర్డు మీటింగ్‌లో మరోసారి అన్ని అంశాలనూ కూలంకషంగా చర్చించి, ఆమోదించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. రాష్ట్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన తర్వాత కేంద్రానికి అందజేయాలని యోచిస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరం నలుమూలలకూ మెట్రో రైలు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఇందులో భాగంగా తొలుత నాగోల్-ఎయిర్‌పోర్టు (కారిడార్-4) 36.8 కిలోమీటర్లు, రాయ దుర్గ్- కోకాపేట్ (కారిడార్-5) 11.6 కిలోమీటర్లు, ఎంజీబీఎస్-చాంద్రాయణగుట్ట (కారిడార్-6) 7.5 కిలోమీటర్లు, మియాపూర్- పటాన్‌చెరు (కారిడార్-7) 13.4 కిలోమీటర్లు, ఎల్బీనగర్- హయత్‌నగర్(కారిడార్-8) 7.1 కిలోమీటర్ల కారిడార్లను ప్రతిపాదించారు. కిలోమీటరుకు సుమారు రూ.318 కోట్ల అంచనా వ్యయంతో రూ.24,269 కోట్లను కేటాయించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాయింట్ వెంచర్‌గా (50:50) పద్ధతిన పనులు చేపట్టాలని నిర్ణయించారు. రెండో దశ విస్తరణలో భాగంగా తొలుత 5 కారిడార్లను మాత్రమే ప్రతిపాదించి డీపీఆర్‌లు తయారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం.. మెట్రో రైల్ అధికారులను ఆదేశించింది. అయితే నగరానికి ఉత్తరం వైపునకు కూడా మెట్రో రైలును తీసుకురావాలనే డిమాండ్ తెరపైకి వచ్చింది. దీంతో ఫేజ్-2 కింద తొలుత ప్రతిపాదించిన 5 కారిడార్ల డీపీఆర్‌ను పార్ట్-ఏగా తయారు చేయాలని, పార్ట్-బీ కింద జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట్, ఎయిర్‌పోర్ట్- ఫ్యూచర్‌సిటీని రూపొందించాలని హెచ్‌ఏఎంఎల్ అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఈ క్రమంలో పార్ట్-ఏ డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వ ఆమోదంతో గతేడాది నవంబర్-4న కేంద్రానికి పంపించగా.. తాజాగా పార్ట్-బీకి సంబంధించిన మూడు కారిడార్ల డీపీఆర్‌ను హెచ్‌ఏఎంఎల్ బోర్డు ఆమోదంతో 8న రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చింది.

కిలోమీటరుకు రూ.227.39 కోట్లు..!

పార్ట్-బీ కింద జేబీఎస్ మెట్రో స్టేషన్- మేడ్చల్ (24.5 కిలోమీటర్లు), జేబీఎస్ మెట్రో స్టేషన్-శామీర్‌పేట్ (22 కిలోమీటర్లు) ప్రతిపాదించారు. అలాగే శంషాబాద్ ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్‌సిటీ (స్కిల్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లు చేపడుతున్నారు. అయితే పార్ట్-ఏలో కిలోమీటరుకు సుమారు రూ.318కోట్లతో అంచనాతో డీపీఆర్‌ను తయారు చేయగా.. పార్ట్-బీలో కిలోమీటరుకు రూ.227.39 కోట్లతోనే రూపొందించినట్లు తెలుస్తోంది. పార్ట్-బీలోని ఫ్యూచర్‌సిటీ మార్గంలో భూసేకరణ సమస్య పెద్దగా లేకపోవడంతో ఖర్చు తగ్గిన పరిస్థితి కనిపిస్తోంది.. కాగా, జేబీఎస్-మేడ్చల్, జేబీఎస్-శామీర్‌పేట్‌లో ఖర్చు పెరుగు తోందని అధికారులు తెలిపారు. మొత్తం మూడు కారిడార్లకు రూ.19,579 కోట్లు అవసరం పడుతున్నట్లు డీపీఆర్‌లో పేర్కొన్నట్లు చెప్పారు. ఇదిలా ఉండగా, రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తర్వాత డీపీఆర్‌ను కేంద్రానికి పంపించనున్నట్లు హెచ్‌ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. జేబీఎస్-మేడ్చల్‌లో 24.5 కిలోమీటర్ల మార్గం పూర్తి ఎలివేటెడ్ కారిడార్ (ఆకాశమార్గం)లో నిర్మాణం జరుగుతోందన్నారు. కాగా, జేబీఎస్-శామీర్‌పేట్ 22 కిలోమీటర్ల కారిడార్‌లో 20.35 కిలోమీటర్ల వరకు ఎలివేటెడ్, 1.65 కిలోమీటర్లు భూగర్భంలో ఉంటుందని చెప్పారు. హకీంపేట విమానాశ్రయం సమీపంలో భూగర్భ మార్గంలో ట్రాక్ చేపడతామన్నారు. కాగా, శంషాబాద్ ఎయిర్‌పోర్టు- ఫ్యూచర్ సిటీ (స్కిల్ యూనివర్సిటీ) 39.6 కిలోమీటర్లలో ఎయిర్‌పోర్టు నుంచి 1.5 కి.మీ భూగర్భ మార్గంలో, 21 కిలోమీటర్లు ఎలివేటెడ్ (ఆకాశ మార్గంలో), 17 కిలోమీటర్లు ఎట్ గ్రేడ్ (భూమిపై) ట్రాక్ ఉంటుందన్నారు. మొత్తం 86.1 కిలోమీటర్లతో పార్ట్-బీ డీపీఆర్‌ను తయారు చేసినట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు రూ.13,954 కోట్లు

- త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభిస్తాం
- సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దడానికి ఎన్ని నిధులైనా వెచ్చించడానికి సీఎం రేవంత్ రెడ్డి సిద్ధంగా ఉన్నారని, ఇప్పటికే పాలనాపరమైన అనుమతులు ఇచ్చిన రూ.13,954 కోట్ల పనులను త్వరలో పట్టాలెక్కిస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నగరంలో మూడు ప్రాంతాల్లో మెట్రో విస్తరణకు రూ.19,579 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. గురువారం ఆయన మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి సచివాలయంలో పాత బస్తీ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. రూ.7,400 కోట్లతో 20 టీఎంసీల గోదావరి జలాలను హైదరాబాద్‌కు తీసుకురానున్నామని తెలిపారు. యాకత్‌పురాలో 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి కావలసిన స్థలానికి తక్షణమే ఎన్‌వోసీ ఇవ్వాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించారు. కాగా, నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకానికి బ్యాంకర్లు సహకరించాలని భట్టి విజ్ఞప్తి చేశారు. గురువారం రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 2న రాష్ట్రావతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రంలోని 5 లక్షల మంది నిరుద్యోగ యువతకు ఈ పథకం మంజూరు పత్రాలు అందించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ పథకానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.6,250 కోట్లు సబ్సిడీ రూపేణా ఇవ్వనుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలకు వడ్డీ లేకుండా రూ.20 వేల కోట్లకుపైగా రుణాలు ఇచ్చామని, రానున్న నాలుగేళ్లలో రూ.లక్ష కోట్ల రుణాలు ఇవ్వనున్నామని తెలిపారు.

తెలంగాణలో పెరిగిన ఐపీఎస్‌ల సంఖ్య

- 139 నుంచి 151కి పెంచిన కేంద్రం
- 168 పోస్టులు కావాలని అడిగిన సీఎం

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ పోలీసు సర్వీసు (ఐపీఎస్)లకు సంబంధించిన క్యాడర్ రివ్యూను కేంద్ర హోంశాఖ ప్రకటించింది. దాదాపు 9 ఏళ్ల తర్వాత దేశవ్యాప్తంగా ఐపీఎస్ క్యాడర్ రివ్యూ జరిగింది. తెలంగాణలో ఐపీఎస్ క్యాడర్ పోస్టులను 139 నుంచి 151కి (12 పోస్టులను) పెంచుతూ హోంశాఖ గెజిట్ జారీ చేసింది. దాని ప్రకారం 151 పోస్టులలో డీజీపీతో సహా క్యాడర్ సీనియర్ డ్యూటీ 83, సెంట్రల్ డిప్యూటేషన్ రిజర్వ్ 33, స్టేట్ డిప్యూటేషన్ రిజర్వ్ 20, ట్రైనింగ్ రిజర్వ్ 2, లీవ్ రిజర్వ్, జూనియర్ పోస్టులు 13 ఉన్నట్లు కేంద్రం పేర్కొంది. వాటిలో ప్రమోషన్ ద్వారా భర్తీ చేసిన పోస్టులు 46, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసే పోస్టులు 105గా ఉంటాయని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని పలు మార్లు ఐపీఎస్‌ల సంఖ్య పెంచాలని కోరింది. తెలంగాణకు 168 ఐపీఎస్‌లు అవసరమని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ప్రధాని మోదీకి, హోంమంత్రి అమిత్ షాకు వినతి పత్రాలు ఇచ్చిన విషయం తెలిసిందే.

24 మంది అదనపు ఎస్పీల బదిలీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 24 మంది అదనపు ఎస్పీలను బదిలీ చేస్తూ హోంశాఖ ప్రత్యేక కార్యదర్శి రవిగుప్తా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్పీల నుంచి నాన్ క్యాడర్ విభాగంలో అదనపు ఎస్పీలుగా ఇటీవల పదోన్నతి పొందిన పది మందికి పోస్టింగ్‌లు ఇచ్చారు. మరోవైపు భారీ స్థాయిలో డీఎస్పీల బదిలీలకు ఉన్నతాధికారులు కసరత్తు ప్రారంభించారు. ఇటీవల 77 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో చాలా మందిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఈ క్రమంలో కొంతకాలంగా లూప్‌లైన్‌లో కొనసాగుతున్న వారితో పాటు, ఇటీవల డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసిన డీఎస్పీలకు నూతన బాధ్యతలు అప్పగించడానికి ఉన్నతాధికారులు కసరత్తు జరుపుతున్నారు. లా అండ్ ఆర్డర్ విభాగంతో పాటు ఇటీవల కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో, తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ బ్యూరో, ట్రాఫిక్ విభాగాల్లో కొత్తవారిని నియమించే అవకాశాలు కన్పిస్తున్నాయి. దాదాపు రెండేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారిని లా అండ్ ఆర్డర్ విభాగాల నుంచి కదిలించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఇటీవల రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో డీఎస్పీ స్థాయి అధికారులపై ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వారిని బదిలీ చేసి పోస్టింగ్ ఇవ్వకుండా వెయిటింగ్‌లో ఉంచారు. అలా వెయిటింగ్‌లో ఉన్న వారికి సైతం త్వరలో జరుగనున్న బదిలీల్లో లూప్ లైన్ పోస్టింగ్‌లు ఇవ్వనున్నట్లు సమాచారం.

ఆపరేషన్ కగార్‌ను ఆపేయాలి

- ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరపాలి
- కేంద్రం మావోయిస్టులతో చర్చలు నిర్వహించాలి
- వామపక్ష పార్టీలు, ప్రజా, పౌర హక్కుల సంఘాలు
- హైదరాబాద్‌లో నిరసనలు.. ఖమ్మంలోనూ ఆందోళన



అంబేడ్కర్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో గడ్డం లక్ష్మణ్, వేణుగోపాల్, పలు సంఘాల నేతలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): మావోయిస్టుల ఎన్‌కౌంటర్లను వ్యతిరేకిస్తూ వామపక్ష పార్టీలు, పౌర హక్కుల, ప్రజా సంఘాల నేతలు నిరసనలకు దిగారు. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేయాలని.. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు సహా 27 మందిని బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని.. సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలన్నారు. గురువారం హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద పౌర హక్కుల సంఘం, ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అభివృద్ధి, పథకాల పేరుతో అడవుల్లోని ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు బీజేపీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ఇటు మావోయిస్టులను, అటు ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయిస్తోందని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అన్నారు. మావోయిస్టులు శాంతియుతంగా చర్చలు జరుపుదామమని పలుమార్లు కేంద్రానికి లేఖలు రాసినా పట్టించుకోకుండా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, సహాయ మంత్రి బండి సంజయ్ నిర్లక్ష్యంగా కేంద్ర బలగాలకు ఆయుధాలిచ్చి హింసకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు, కో ఆర్డినేషన్ కమిటీ ఫర్ ది పీస్ కన్వీనర్ నార్ల రవి, వీక్షణం పత్రిక ఎడిటర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలంటూ 10 వామపక్ష పార్టీల నేతలు డిమాండ్ చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సభ్యుడు కె.గోవర్ధన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్‌లో పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించారు. రాజ్యాంగం, చట్టాలను ఉల్లంఘించి జంతువులను వేటాడినట్లుగా ఆదివాసీలను, మావోయిస్టులను హత్య చేయడం దారుణమని సీపీఐ(ఎంఎల్) కేంద్ర కమిటీ సభ్యుడు వేములపల్లి వెంకట్రామయ్య అన్నారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, సీపీఐ కేంద్ర కమిటీ సభ్యులు పశ్యపద్మ మాట్లాడుతూ.. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఇటు ఖమ్మంలోని మంచికంటి భవన్‌లో వామపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు మీడియా సమావేశం నిర్వహించి.. కేంద్రంపై మండిపడ్డాయి. మావోయిస్టులను పట్టుకొని కాల్చి చంపి.. కేంద్రం ఎన్‌కౌంటర్ అంటోందని ఆగ్రహం వ్యక్తం చేశాయి. మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలంటూ సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, పీపుల్స్ జేఏసీ చైర్మన్ దేవిరెడ్డి విజయ్ తదితరులు కరపత్రాలను విడుదల చేశారు.

శాంతి చర్చలు ప్రారంభించాలి: చంద్రన్న

ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపేసి, మావోయిస్టులతో శాంతి చర్చలు ప్రారంభించాలని సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి చంద్రన్న కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా 'ఆంధ్రజ్యోతి' కార్యాలయానికి ఆయన పేరిట పంపిన లేఖలో పలు అంశాలను వెల్లడించారు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకుంటున్న నంబాలను, మరికొందరిని అడవికి తీసుకొచ్చి బూటకపు ఎన్‌కౌంటర్ చేశారని అన్నారు. బూటకపు ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

న్యాయ విచారణ జరపాలి: కూనంనేని

మావోయిస్టుల ఎన్‌కౌంటర్‌పై సుప్రీంకోర్టు సిటింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని కేంద్రాన్ని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఒకవేళ కేంద్ర ప్రభుత్వం ముందుకు రాకుంటే సుప్రీంకోర్టే ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించాలని ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు నాయకుడు నంబాల కేశవరావుతోపాటు మరో 26 మంది ఎన్‌కౌంటర్‌పై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఆపరేషన్ కగార్ పేరిట పోలీసులు సాగిస్తున్న ఎన్‌కౌంటర్లను సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకుని విచారణ జరపాలని తెలంగాణ ప్రజాస్వామిక వేదిక కన్వీనర్, న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు.

ఉపకులాల మధ్య అసమానతల అంచనాకు..

సమష్టి వెనకబాటుతనం సూచిక

- రూపొందించాలని నిపుణుల బృందం నిర్ణయం
- నెలలో నివేదిక: బృందం కన్వీనర్

న్యూఢిల్లీ, మే 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో 243 ఉప కులాల మధ్య అసమానతలను అంచనా వేసేందుకు.. కుల గణన సమాచారాన్ని ఉపయోగించి సమష్టి వెనకబాటుతనం సూచిక(సీబీఐ)ను రూపొందించాలని దీనిపై రాష్ట్ర ప్రభుత్వ ఏర్పాటుచేసిన నిపుణుల బృందం నిర్ణయించింది. జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పడిన ఈ నిపుణుల బృందం.. 2024లో తెలంగాణలో జరిగిన సామాజిక, విద్యా, ఉపాధి, ఆర్థిక, రాజకీయ పరమైన సర్వే (సమగ్ర ఇంటింటి సర్వే) పేరుతో సేకరించిన డేటాను అధ్యయనం చేసి విశ్లేషించింది. ఈమేరకు నిపుణుల బృందం చేసిన సిఫారసులను గురువారం ఢిల్లీలో ఆ బృందం కన్వీనర్ ప్రవీణ్ చక్రవర్తి విడుదల చేశారు. రాష్ట్రంలో మొత్తం 243 ఉపకులాలు ఉండగా.. రాష్ట్ర జనాభాలో 96% మంది వాటిలో 73 ఉపకులాల్లోనే ఉన్నట్టు సర్వేలో తేలింది. అందులో షెడ్యూల్డ్ కులాలకు చెందిన 10 ఉప కులాలు, షెడ్యూల్డ్ జాతులకు చెందిన ఏడు ఉప కులాలు, వెనకబడిన జాతులకు చెందిన 45 ఉప కులాలు, ఇతరులు 11 ఉప కులాలు ఉన్నాయని.. ఈ ఉప కులాల్లో ఒక్కొక్క దానికీ సమష్టి వెనకబాటుతనం సూచికను రూపొందించాలని నిపుణుల బృందం నిర్ణయించిందని ప్రవీణ్ చక్రవర్తి తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన మౌలిక, సమానత్వ సూత్రాలకు అనుగుణంగా ఈ సూచికను రూపొందిస్తారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సామాజిక వెనకబాటుతనం, విద్య, జీవన ప్రమాణాలు, వృత్తి, ఆదాయం, స్థిర అస్థిర ఆస్తులు, బ్యాంకింగ్ ఫైనాన్స్ సౌకర్యాలకు అందుబాటు అనే ఏడు అంశాలకు సంబంధించి 43 ప్రాతిపదికలను ఉపయోగించి మొత్తం వెనకబాటుతనాన్ని సమగ్రంగా అంచనా వేస్తారు. ఉప కులాల సాపేక్ష వెనకబాటుతనాన్ని అంచనా వేసేందుకు మండల్ కమిషన్ నివేదిక 11 ప్రాతిపదికలను ఉపయోగిస్తే.. నిపుణుల బృందం 43 ప్రాతిపదికలను ఉపయోగించడం గమనార్హం. గురువారం జరిగిన సమావేశంలో ఈ నిపుణుల బృందం గణాంక పరమైన, డేటా పరమైన పనిని పూర్తి చేసిందని, సమష్టి వెనకబాటుతనం సూచిక (సీబీఐ) నిర్ధారణలపై సమగ్రంగా చర్చించిందని కన్వీనర్ తెలిపారు. త్వరలో ఈ నివేదిక తదుపరి దశను రూపొందించి, నెలరోజుల్లోనే నివేదికను సమర్పిస్తామని చెప్పారు. కాగా, కుటుంబాలకు సంబంధించి నిర్దిష్టమైన సమాచారాన్ని వెల్లడించకుండానే సామాజిక సర్వే డేటాను విశ్లేషించేందుకు వీలుగా కృత్రిమమేధను ఉపయోగించే నేచరల్ లాంగ్వేజ్ ఇంటర్‌ఫేస్‌ను అందజేయాలని నిపుణుల బృందం తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది.







ఐటీ ఇలాకాలో

బ్యూటీల తడాఖా

శిల్పారామంలో జరిగిన టాలెంట్ ఫినాలేలో 24 మంది ఫైనలిస్టుల పోటాపోటీ

హైదరాబాద్, ఎల్బీనగర్, హైటెక్ సిటీ, మే 22(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ఐటీకి చిరునామా అయిన హైటెక్ సిటీ ప్రాంతం మిస్ వరల్డ్ 2025 పోటీదారుల ఆటాపాటలతో గురువారం ఉర్రూతలూగింది. హైటెక్ సిటీలోని సైబర్‌టవర్స్‌కు ఎదురుగా ఉన్న శిల్పారామంలో ప్రపంచ సుందరీమణులు గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు గడిపారు. శిల్పారామంలో మహిళా సంఘాల ఉత్పత్తులను పరిశీలించారు. కొనుగోలు చేశారు. అలాగే అక్కడున్న మట్టి పాత్రల తయారీలో ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్న చిన్న కుండలు చేసి ఆనందించారు. అనంతరం సాయంత్రం జరిగిన టాలెంట్ ఫినాలే పోటీకి ఎంపికైన 24 దేశాల ప్రతినిధులు తమ సంగీత, నృత్య ప్రదర్శనలతో అదరగొట్టారు. అమెరికా ప్రతినిధి నృత్యంతో ప్రారంభమై దాదాపు రెండున్నర గంటలపాటు నిర్విరామంగా సాగిన ఈ కార్యక్రమం అత్యంత ఉత్సాహంగా సాగింది. వందలాది ప్రేక్షకుల కేరింతలు, చప్పట్లతో హైటెక్ సిటీ మార్మోగిపోయింది. .



కోలాటం ఆడుతున్న మిస్ ఎస్టోనియ

ఆట పాటలతో హోరెత్తించిన భామలు..

నాలుగు ఖండాల నుంచి ఎంపికైన 24 మంది అందాల భామలు టాప్-10 జాబితాలో చోటు సాధించాలంటే టాలెంట్ ఫినాలే పోటీలు చాలా కీలకం. దీంతో పోటీదారులంతా తమ పూర్తిస్థాయి ప్రతిభను ప్రదర్శించేందుకు ప్రయత్నించారు. ఇటీవల అత్యంత ప్రజాదరణ పొందిన 'రాను బొంబయికి రాను'... అనే తెలంగాణ జానపద పాటపై నైజీరియా భామ చేసిన ఇండో ఆఫ్రికన్ నృత్యం ఆహూతులను అమితంగా ఆకట్టుకుంది. ఫ్లోర్ డ్యాన్స్ ద్వారా ఈస్టోనియా భామ, 'ఐ లవ్ స్టోరీస్' అనే అద్భుత గీతంతో బ్రెజిల్ భామ సభికులను ఉర్రూతలూగించగా.. ఐస్ స్కేటింగ్ అద్భుత ఏవీ విన్యాసంతో నెదర్లాండ్ భామ సత్తా చాటింది. పియానోతో చెక్ రిపబ్లిక్, డ్యాన్స్‌తో అర్జెంటీనా భామ, తమ దేశ సంప్రదాయ నృత్యంతో శ్రీలంక ప్రతినిధి అనుది గుణశేఖర ప్రేక్షకులను కట్టిపడేశారు. నృత్యంతో ఇటలీ, ఏరోబిక్స్‌తో ట్రినిడాడ్, పియానోతో జర్మనీ అందాల భామలు సత్తా చాటారు. అత్యవసర వేళల్లో సీపీఆర్ ఎలా చేయాలో వేల్స్ ప్రతినిధి వినూత్నంగా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. హిందీ చిత్రం రామ్‌లీలాలోని 'ఢోల్ బాజే ... పాటకు భారత ప్రతినిధి నందిని గుప్తా చేసిన నృత్యం పోటీల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆమె నృత్యం చేస్తున్నంతసేపు ప్రేక్షకులు చప్పట్లు, కేరింతలతో ఆమెను ప్రోత్సహించారు. చివరగా కెన్యా భామ జుంబా డీజేతో పోటీ ముగిసింది. చివరగా డీజేతో 24 దేశాల ప్రతినిధులు చేసిన నృత్యం విశేషంగా ఆకట్టుకుంది. అందరి ప్రదర్శన అనంతరం తొలి మూడు స్థానాలను నిర్వాహకులు ప్రకటించారు. అద్భుత పియానో ప్రదర్శనతో ఆకట్టుకున్న ఇండోనేషియా సుందరి మోనికా కేజియాను టాలెంట్ ఫినాలే విజేతగా ప్రకటించారు. కామెరూన్, ఇటలీ ప్రతినిధులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. ఈ పోటీలో భారత్ తొలి మూడు స్థానాల్లోనూ నిలవకపోవడంతో కార్యక్రమానికి వచ్చిన ప్రేక్షకులు నిరాశ చెందారు. విజేతగా నిలిచిన ఇండోనేషియా భామ.. నందినీ గుప్తా ప్రాతినిధ్యం వహిస్తున్న ఆసియా ఓషియానా ఖండం నుంచి ఉండటంతో.. ఈ పోటీలో భారత్‌కు విజయావకాశాలు తగ్గాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు.



శిల్పారామంలో కుండ తయారు చేస్తున్న ఓ భామ

విక్టోరియా హోమ్‌లో సందడి

మిస్ వరల్డ్ 2025 పోటీదారులు గురువారం తొలుత హైదరాబాద్, సరూర్‌నగర్‌లోని వారసత్వ కట్టడం విక్టోరియా హోమ్‌ను సందర్శించారు. 122 ఏళ్ల క్రితం నిర్మించిన ఆ భవనాన్ని చూసి వారంతా ఆశ్చర్యపోయారు. అనంతరం విక్టోరియా హోమ్‌లోని పాఠశాలలో చదువుకుంటున్న దాదాపు 300 మంది అనాథ బాలలతో గడిపారు. విద్యార్థులతో మాట్లాడి వారి లక్ష్యాలను తెలుసుకుని ప్రోత్సహించారు. డాక్టర్ రామకృష్ణ చెలికాని ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో దక్షిణాఫ్రికా, మలేషియా, జింబాబ్వే, తుర్కియే, సింగపూర్, బంగ్లాదేశ్ ప్రతినిధులు ప్రసంగించి విద్యార్థుల్లో స్ఫూర్తి నింపారు. అలాగే, ప్రతీ విద్యార్థికి మిస్ వరల్డ్ పోటీదారులు 25 బహుమతులు అందజేశారు. పలువురు విద్యార్థులు తాము గీసిన చిత్రాలను ప్రపంచ సుందరీమణులకు బహూకరించారు. ఇక, రామకృష్ణ ఏర్పాటు చేసిన వరల్డ్ లైబ్రరీ, కంప్యూటర్ ల్యాబ్‌ను మిస్ వరల్డ్ క్రిస్టినా, మిస్‌వరల్డ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లేతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విక్టోరియా హోమ్ విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రపంచ సుందరి పోటీదారులు కూడా భాగమయ్యారు. ముఖ్యంగా 'రాను బొంబైకి రాను' అనే జానపద గీతానికి విద్యార్థులతో కలిసి ఆడి, పాడారు. అనంతరం శిల్పారామం చేరుకున్న సుందరీమణులు అక్కడి విలేజ్ మ్యూజియంను పరిశీలించి అక్కడున్న బతుకమ్మలను తిలకించారు. అనంతరం బృందావనంలో కోలాటం కళాకారులతో కలిసి ఆడిపాడారు. రాష్ట్ర మహిళా, స్త్రీ, సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్... వివిధ పథకాల ద్వారా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న చేయూతను ఈ సందర్భంగా మిస్ వరల్డ్ పోటీదారులకు వివరించారు.



విక్టోరియా హోమ్‌లో విద్యార్థులతో అందాల భామలు

నీలోఫర్ ఆస్పత్రిలో అక్రమ నిర్మాణం కూల్చివేత

» సూపరింటెండెంట్ తీరుపై

హెల్త్ సెక్రటరీ, హైదరాబాద్ కలెక్టర్ మండిపాటు

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతుల్లేకుండా నీలోఫర్ ఆస్పత్రిలో అక్రమంగా నిర్మిస్తున్న మెడికల్ షాప్‌ను గురువారం హైదరాబాద్ రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశాల మేరకు ఆసిఫ్ నగర్ ఎమ్మార్వో జ్యోతి ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం కట్టడాన్ని కూల్చివేశారు. ఆస్పత్రి ఆవరణలో మెడికల్ షాప్ ఏర్పాటు కోసం ప్రభుత్వ అనుమతి లేకుండా మంగళవారం సాయంత్రం గది నిర్మాణం చేపట్టారు. రాత్రికి రాత్రే గోడల నిర్మాణం పూర్తయింది. అక్రమ నిర్మాణంపై వార్తా పత్రికల్లో వచ్చిన కథనాలపై స్పందించిన ఉన్నతాధికారులు.. దాని తొలగింపునకు చర్యలు చేపట్టారు. దీనిపై నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ రవికుమార్ స్పందిస్తూ.. సీఎంఓ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్థూ, హైదరాబాద్ కలెక్టర్ అనుమతితో నిర్మిస్తున్నట్లు చెప్పడంతో ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. సూపరింటెండెంట్‌పై మంత్రి, ఆరోగ్యశాఖ కార్యదర్శి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్, సీఎంఓ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ అక్రమ నిర్మాణాన్ని రెవన్యూ అధికారులు కూల్చేసిన తర్వాత నీలోఫర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ ఓ ప్రకటన చేస్తూ.. జెనరిక్ మెడికల్ షాప్ ఏర్పాటు కోసం తాత్కాలికంగా ఓ గది సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

సీఎం ఓఎస్‌డీని అంటూ మెయిల్స్, కాల్స్

» ఘరానా మోసగాడి అరెస్ట్

హైదరాబాద్ సిటీ, మే 22 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి కార్యాలయంలోని అధికారుల పేరుతో నకిలీ ఈమెయిల్ ఐడీలు, వాట్సాప్ ఖాతాలను సృష్టించి డబ్బులు డిమాండ్ చేస్తున్న వ్యక్తిని హైదరాబాద్ సైబర్ క్రైం అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. అతడిని శ్రీకాకుళం జిల్లా నర్సన్నపేటకు చెందిన రంజీ మాజీ క్రికెటర్ బుడ్డుమూరు నాగరాజుగా పోలీసులు గుర్తించారు. ఇప్పటి వరకు రాపిడో ఎండీ అరవింద్ సంకా, గుప్తా రియాలిటీ చైర్మన్ శ్రీనివాస్ గుప్తా, బెక్కం ఇన్‌ఫ్రా ఎండీ కృష్ణమోహన్ బొల్లినేని, కంట్రీ డిలైట్ ఎండీలు చంద్రశేఖర్, నితిన్ కౌశల్‌తో పాటు మరికొంత మందిని డబ్బులు డిమాండ్ చేశాడని సమాచారం. విషయం వెలుగులోకి రావడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఓఎస్‌డీ దీనిపై సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితుడు నాగరాజును అరెస్ట్ చేశారు. అతడిపై తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటివరకు 39 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

సింగరేణిలో అవినీతిపై సీవీసీకి ఫిర్యాదు

గోదావరిఖని, మే 22(ఆంధ్రజ్యోతి): సింగరేణిలో జరుగుతున్న అవినీతిపై విచారణ చేపట్టాలని కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)కు జేఏసీ నాయకుడు దయానందరావు ఇటీవల ఫిర్యాదు చేశారు. జైపూర్ పవర్ ప్లాంట్‌లో 800 మెగావాట్ల ప్రాజెక్టు నిర్మాణ అంచనా వ్యయం సంవత్సరంలోనే రూ.1,600 కోట్లు పెరిగిందని, ఈ వ్యవహారంలో అవినీతి చోటుచేసుకుందని పేర్కొన్నారు. ఎక్స్‌ప్లోజివ్స్ టెండర్‌ను రూ.250 కోట్లు అదనంగా కోట్ చేశారని, సత్తుపల్లిలో రూ.600 కోట్ల బొగ్గు కుంభకోణం జరిగిందని సీవీసీ దృష్టికి తీసుకెళ్లారు. రూ.500 కోట్లతో కట్టిన సత్తుపల్లి సీహెచ్‌పీ రెండేళ్లకే కుంగిపోయిందని ఫిర్యాదు చేశారు. వారసత్వ ఉద్యోగాల్లో కీలక పాత్ర పోషించే మెడికల్ బోర్డులో 2018 నుంచి రూ.1500 కోట్ల అవినీతి జరిగిందని, అయినా చర్యలు లేవని పేర్కొన్నారు. రూ.200 కోట్ల మేర శ్రీరాంపూర్ డీజిల్ కుంభకోణంలో దోషులను తప్పించడం, భూపాలపల్లి కేటీకే ఓసీపీ టెండర్లు వాయిదా పడడంపై విచారణ జరపాలని ఫిర్యాదులో కోరారు. ఈ ఫిర్యాదును స్వీకరించినట్టు సీవీసీ ధ్రువీకరించింది.

కొడాలి నానిపై లుక్ అవుట్ నోటీసులు

గుడివాడ, మే 22 (ఆంధ్రజ్యోతి) : పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి కొడాలి నానిపై లుక్ అవుట్ నోటీసులు జారీ అయ్యాయి. ఇవి ఆన్‌లైన్ ద్వారా అన్ని ఎయిర్‌పోర్టులు, ఓడరేవులకు అందాయి. వాస్తవానికి కొడాలి నానికి రాష్ట్రంలో పాస్‌పోర్టు లేదు. రైతు మోషే కేసులో జైలుశిక్ష ఖరారుకావడం, పలు కేసుల్లో నిందితుడిగా ఉండటంతో ఆయనకు పాస్‌పోర్టు జారీ కాలేదు. అయితే, హైదరాబాద్ చిరునామాతో పాస్‌పోర్టును పొంది ఉంటారని అనుమానిస్తున్నారు. ఆ పాస్‌పోర్టును వాడి ఆయన అమెరికాకు పరారయ్యే అవకాశం ఉందని సందేహిస్తున్నారు. దీంతో ముందుజాగ్రత్తగా లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. కృష్ణాజిల్లా గుడివాడ పరిధిలో నానిపై ఇప్పటికే పలు కేసులు నమోదయ్యాయి.

విమానం ఎక్కిన సర్కారు బడి పిల్లలు

» పదో తరగతిలో భిక్కనూరు విద్యార్థుల ప్రతిభ

» వారికిచ్చిన మాటను నిలబెట్టుకున్న ఇన్‌స్పెక్టర్



విద్యార్థులను బెంగళూరు తీసుకెళుతున్న సీఐ మల్లేష్ దంపతులు

భిక్కనూరు, మే 22 (ఆంధ్రజ్యోతి): పరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తే విమానం ఎక్కిస్తానని విద్యార్థులను ప్రోత్సహించారు ఓ ఇన్‌స్పెక్టర్. చెప్పినట్లుగానే పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ చూపిన సర్కారు బడి పిల్లలను గాలి మోటారులో తిప్పారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరుకు చెందిన గడ్డం మల్లేష్ జీడిమెట్ల సీఐగా పనిచేస్తున్నారు. తాను చదువుకున్న పాఠశాలలో మల్లేష్ ఇటీవల ఓ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఏడాది టెన్త్ పరీక్షల్లో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఎక్కువ మార్కులు సాధించిన వారిని విమానం ఎక్కిస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసి గురువారం విమానంలో వారిని శంషాబాద్ నుంచి బెంగుళూరుకు తీసుకెళ్లారు. అక్కడ విశ్వేశ్వరయ్య విజ్ఞాన కేంద్రంతో పాటు ముఖ్యమైన ప్రాంతాలను వారికి చూపించారు.

మోదీ నేతృత్వం పట్ల ఎన్ఆర్ఐల విశ్వాసం: లక్ష్మణ్

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ నాయకత్వంపై ప్రవాస భారతీయులు(ఎన్ఆర్ఐ) ఆకర్షితులవుతున్నారని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యం కోసం మోదీ చిత్తశుద్ధిని వారు ప్రశంసిస్తున్నారని తెలిపారు. గురువారం సిడ్నీలో జరిగిన ఓ కార్యక్రమంలో లక్ష్మణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్ట్రేలియాలోని భారత జాగృతి మాజీ అధ్యక్షుడు అందెం శ్రీకర్‌రెడ్డి, ఇండియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆశిష్ ఆర్.కట్టా.. లక్ష్మణ్ సమక్షంలో బీజేపీలో చేరారు.

వెల్ఫేర్ కమిటీలతో సమావేశం రద్దు చేయాలి

» ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి

హైదరాబాద్, మే 22 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలోని వెల్ఫేర్ కమిటీలతో ఈ నెల 27న అధికారులు నిర్వహించబోతున్న సమావేశాన్ని రద్దు చేయాలని ఆర్టీసీ జేఏసీ కన్వీనర్ అశ్వత్థామ రెడ్డి డిమాండ్ చేశారు. వెల్ఫేర్ కమిటీలను అధికారులు తమకు అనుకూలమైన వారితో ఏర్పాటు చేసుకున్నారని, వారు ఉద్యోగుల సమస్యలపై పోరాడే పరిస్థితి లేదని ఆయన అన్నారు. వెల్ఫేర్ కమిటీల రద్దు, ఆర్టీసీలో యూనియన్ల పునరుద్ధరణ వంటి అంశాలపై రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో ఇటీవల జరిపిన చర్చలో ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కానీ అందుకు భిన్నంగా వెల్ఫేర్ కమిటీ సభ్యులతో చర్చలు జరపాలని అధికారులు నిర్ణయించడం సరైంది కాదని చెప్పారు. ఈ సమావేశం రద్దు చేయాలని, లేదంటే ఎదురయ్యే పరిణామాలకు ప్రభుత్వం బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.





కొండగట్టులో అంజన్న దీక్షాపరులు

కొండగట్టులో ప్రత్యేక అలంకారంలో ఆంజనేయస్వామి

జైబజరంగభళి

రాష్ట్రంలో ఘనంగా హనుమాన్ జయంతి.. కొండగట్టు అంజన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

మల్యాల, మే 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ముఖ్యంగా జగిత్యాల జిల్లా మల్యాల మండలం ముత్యంపేటలోని కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధికి భక్తులు పోటెత్తారు. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు లక్షన్నర మందికిపైగా భక్తులు అంజన్నను దర్శించుకున్నారని అంచనా. అంజన్న దీక్షాపరులతో కొండగట్టు క్షేత్రం కాషాయవర్ణాన్ని పులుముకుంది. ప్రతియేటా వైశాఖ బహుళ దశమి సందర్భంగా నిర్వహించే పెద్ద హనుమాన్ జయంతిని పురస్కరించుకుని అంజన్న సన్నిధిలో స్వామివారికి తిరుమంజనం, ద్రావిడ ప్రబంధ పారాయణములు, విశేష అభిషేకం, తులసీ అర్చన, స్వామివారికి పట్టు వస్త్రాలంకరణ చేశారు. యాగశాలలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు త్రైయాహ్నిక, త్రికుండాత్మక యజ్ఞాలను ఘనంగా నిర్వహించారు. గురువారం మహా పూర్ణాహుతి, ఊయల సేవను వైభవంగా జరిపారు.

8వ రోజు లక్ష మంది పుష్కర స్నానం!

» కాళేశ్వరంలో కిటకిటలాడిన ఘాట్లు

» చివరి నాలుగు రోజుల్లో

రద్దీ మరింత పెరిగే అవకాశం

భూపాలపల్లి, మే 22 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలకు భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఎనిమిదో రోజు, గురువారం దాదాపు లక్ష మంది భక్తులు పుష్కర స్నానం ఆచరించినట్లు అధికారుల అంచనా. తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో పుష్కర ఘాట్లు, ముక్తీశ్వరాలయం కిటకిటలాడాయి. బీజేపీ నేత, ఎంపీ ఈటల రాజేందర్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే సూర్యనారాయణ, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు, వ్యవసాయ రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, సభ్యుడు గడుగు గంగాధర్, సినీ నటుడు అల్లు అర్జున్ తల్లి అల్లు నిర్మల తదితర ప్రముఖులు అంతర్వాహినిలో గురువారం పుణ్య స్నానాలు ఆచరించారు. కాగా, పుష్కరాలకు మరో నాలుగు రోజులు మాత్రమే గడువు ఉంది. దీంతో చివరి నాలుగు రోజులు భక్తుల సంఖ్య మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాళేశ్వరంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షం పుష్కరాలకు విచ్చేసిన భక్తులను గురువారం ఇబ్బందులకు గురి చేసింది. పుష్కర ఘాట్లతో పాటు, తాత్కాలిక బస్టాండ్, పుష్కర ఘాట్లకు వెళ్లే మట్టి రోడ్లు బురదమయం కావడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. పార్కింగ్ స్థలాల్లోని కొన్ని వాహనాలు నీళ్లలో మునిగిపోయాయి. ట్రాఫిక్ క్రమబద్ధీకరణలో భాగంగా అన్నారం క్రాస్ నుంచి కాళేశ్వరానికి వాహనాలను మళ్లించారు. కానీ, పార్కింగ్ స్థలాల్లో ఉన్న వాహనాలు కదలకపోవడంతో ఐదు కిలోమీటర్ల మేర అడవిలోనే ట్రాఫిక్ స్తంభించిపోయింది. ట్రాఫిక్ జామ్‌కు కారణమైన వాహనాలను తొలగించేందుకు క్రేన్లు, ట్రాక్టర్లను రంగంలోకి దింపిన పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రయత్నించి విఫలమయ్యారు.



పుష్కరఘాట్ వద్ద భక్తుల రద్దీ

పుష్కారానికి వెళ్తూ.. తిరిగి రాని లోకాలకు

» ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టిన కారు

» ఇద్దరి మృతి, 13 మందికి తీవ్ర గాయాలు

» కాటారం క్రాస్ సమీపంలో

ఘోర రోడ్డు ప్రమాదం



రజిత, విష్ణు (ఫైల్)

కాటారం, మే 22(ఆంధ్రజ్యోతి): సరస్వతీ పుష్కరాలకు ఆటోలో బయలుదేరిన కుటుంబానికి మార్గమధ్యలో ఎదురొచ్చిన ఓ కారు మృత్యు శకటమైంది. పుష్కర స్నానం ముగించుకుని తిరుగు ప్రయాణమైన వారి కారు.. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో ఉన్న కుటుంబానికి చెందిన ఇద్దరు మరణించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని 353(సీ)జాతీయ రహదారిపై కమలాపూర్ క్రాస్ సమీపంలో గురువారం జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో పాల రజిత(28), గుంటుక విష్ణు(21) మరణించారు. రెండు వాహనాల్లోని 13 మంది తీవ్రంగా గాయపడ్డారు. కాటారం ఎస్సై మ్యాక అభినవ్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన కొత్త చంద్రకాంత్ కారులో నలుగురిని కాళేశ్వరం పుష్కరాలకు తీసుకొచ్చి పుణ్య స్నానం అనంతరం తిరిగి బయలుదేరారు. మరోపక్క, భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వరికోల్‌పల్లి, కుమ్మరిపల్లికి చెందిన గుంటుక నర్సింహా అలియాస్ స్వామి, అతడి భార్య సంధ్య, కుమారుడు విష్ణు, సంధ్య సోదరీమణులు శ్రీరాముల శోభ, రజిత వారి కుటుంబసభ్యులు అజిత్‌పాషాకు చెందిన ఆటోలో పుష్కరాలకు కాళేశ్వరం బయలుదేరారు. అయితే, కమలాపూర్ క్రాస్ సమీపంలో ఎదురుగా వచ్చిన చంద్రకాంత్ కారు వీరి ఆటోను బలంగా ఢీకొట్టింది. దీంతో ఆటో ధ్వంసమై రోడ్డు కిందకు దిగి అటవీ ప్రాంతంలోకి దూసుకెళ్లింది. కారు ఎగిరిపడి ఓ వైపు బోల్తా పడింది. ప్రమాద తీవ్రతకు ఆటోలో ఉన్న రజిత, విష్ణు మరణించారు. ఆటోలో ఉన్న మిగిలిన వారు, కారులో ఉన్న వారు కూడా తీవ్రంగా గాయపడగా వారిని ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల్లో పలువురి పరిస్థితి విషమంగా ఉంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.